www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 20-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 156 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: చతుర్దశి రా.12.17 తదుపరి అమావాస్య, నక్షత్రం: మఖ ఉ.8.06 తదుపరి పుబ్బ, వర్జ్యం: సా.4.34-6.16, దుర్ముహూర్తం: ఉ.6.07-7.43, అమృతఘడియలు: రా.2.45-4.26, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 6.07, సూర్యాస్తమయం: 6.09 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అది అభయ్ వ్యక్తిగతం!

మావోయిస్టు పార్టీతో సంబంధం లేదు.. అధికారికమైనదిగా గుర్తించవద్దు.. దమనకాండ వేళలో ఇలాంటి ప్రకటనలా? 2

సాయుధ పోరాటమే కర్తవ్యం.. టీ-కమిటీ ప్రతినిధి జగన్ ప్రకటన

అభయ్ ఎక్కడ!?

పోలీసుల అదుపులో ఉన్నారా?.. వారి ఒత్తిడితోనే లేఖ రాశారా?

బస్వరాజ్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడే పోరాట విరమణపై ప్రకటన?

దానినే కేడర్‌కు వెల్లడించిన అభయ్.. తాజా పరిణామాలపై భిన్న వాదనలు

వైసీపీకి భారీ షాక్!

టీడీపీలో చేరిన ముగ్గురు ఎమ్మెల్సీలు

రాజశేఖర్, బల్లి కల్యాణ్, కర్రి పద్మశ్రీలకు కండువా కప్పిన సీఎం చంద్రబాబు

మేం రాజీనామాలు చేసి నెలలు గడిచాయి

ప్రత్యేక అజెండాతోనే చైర్మన్ ఆమోదించలేదు: ఎమ్మెల్సీలు 12

కూటమి అభివృద్ధిని చూసే చేరాం: నేతలు



సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, మర్రి రాజశేఖర్, బల్లి కల్యాణ్ చక్రవర్తి

లిక్కర్ స్కామ్‌లో జగన్ సోదరుడు!



వైఎస్ అనిల్ రెడ్డి ఇళ్లు, సంస్థల్లో సిట్ సోదాలు

చెన్నై, హైదరాబాద్‌లో ఏకకాలంలో తనిఖీలు

చెన్నైలో 7 కంపెనీలు, 2 నివాసాలు, హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో మరో సంస్థ

కీలక డాక్యుమెంట్లు, ఆధారాలు స్వాధీనం

అనిల్ కంపెనీల ద్వారా లిక్కర్ ముడుపులు విదేశాలకు, వైసీపీ ఎన్నికల ఖర్చుకు తరలింపు

రెండు కంపెనీల్లో 2020 వరకు డైరెక్టర్‌గా ఉన్న జగన్ భార్య భారతి రెడ్డి

ఆఫ్రికాలో మద్యం, మైనింగ్ వ్యాపారాల్లో జగన్‌కు అనిల్ బినామీగా ప్రచారం

స్వయాన పెదనాన్న జార్జిరెడ్డి కుమారుడు

జగన్ ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కామ్‌లో మరో సంచలనం. ఇప్పటిదాకా జగన్ పీఎస్, మాజీ ఓఎస్డీ, వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, గత ప్రభుత్వంలోని ఐటీ సలహాదారును సిట్ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా జగన్ రక్త సంబంధీకుడు, పెదనాన్న జార్జిరెడ్డి కుమారుడు వైఎస్ అనిల్ రెడ్డి పాత్ర ఉన్నట్టు సిట్ విచారణలో తేలింది. శుక్రవారం హైదరాబాద్, చెన్నైలోని అనిల్ రెడ్డికి చెందిన 8 కంపెనీలు, 2 నివాసాల్లో సిట్ సోదాలు చేసింది.

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పులివెందులలో జన్మించి, చెన్నైలో నివసిస్తూ, ఆఫ్రికాలో మద్యం వ్యాపారం చేసిన అనిల్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు సోదరుడే కాదు అంతకుమించి నమ్మకమైన ఆప్తుడు కూడా. అన్న జగన్ తరఫున ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం మొదలుకొని ఇసుక, లిక్కర్ స్కామ్‌ల్లో ఆయనపై పలు ఆరోపణలున్నాయి. లిక్కర్ స్కామ్‌లో అనిల్ రెడ్డి ప్రమేయంపై సిట్ విచారణలో ఆయన వ్యక్తిగత సహాయకుడు దేవరాజులు ఇచ్చిన సమాచారం చాలా కీలకంగా మారింది. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలానికి(ఏ-33 బాలాజీ గోవిందప్పదీ ఇదే మండలం) చెందిన దేవరాజులు లిక్కర్ కేసులో

మిగతా 12వ పేజీలో...

తెలీదు.. నాకు సంబంధం లేదు!
విచారణలో మిథున్ రెడ్డి తీరు

యాభై ప్రశ్నలు.. అన్నింటికీ ఒక్కటే జవాబు

మద్యం ముడుపులు ముట్టుకోలేదు

లిక్కర్ పాలసీ రూపకల్పనలో లేను

4 గంటలు ప్రశ్నించి రాజమండ్రి జైలుకు..

నేడు మరోసారి విచారించనున్న 'సిట్'

గోల్డ్ కవరింగ్!



ముడుపుల సొమ్ములు మళ్లించారు

సంబంధంలేని వ్యక్తులు, సంస్థలకు చెల్లింపులు

షెల్ కంపెనీలతో విదేశాలకు తరలించారు

కీలక డాక్యుమెంట్లు, 38 లక్షల నగదు స్వాధీనం

గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లోనూ సోదాలు జరిపాం

తనిఖీలపై ఈడీ అధికారిక ప్రకటన

మద్యం ముడుపులు 'బంగారుబాట' పట్టాయని నిరూపించే కీలక ఆధారాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సేకరించింది. ముడుపుల సొమ్ము కోసం వాడుకున్న షెల్ కంపెనీలు, నిందితుల దుబాయ్ లింకులను గుర్తించింది. జగన్ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్‌లో 'మనీ లాండరింగ్' కోణంలో ఈడీ తన దర్యాప్తు మొదలుపెట్టింది. గురువారం దేశవ్యాప్తంగా జరిపిన సోదాల వివరాలతో శుక్రవారం ఈడీ హైదరాబాద్ జోన్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. దీనిని రూ.4వేల కోట్ల స్కామ్‌గా పేర్కొంది. 12

ఈడీ పెంచిన వేడి!

సుదీర్ఘ కసరత్తు.. ఆ తర్వాతే సోదాలు.. మనీ లాండరింగ్, ఫేక్ ఇన్వాయిస్‌లపై ఆధారాలు.. వైసీపీ శిబిరంలో కలవరం మొదలు

ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం

■ ఒకే రాష్ట్రం.. ఒకే జల విధానం

రాష్ట్రంలోని నదులన్నీ అనుసంధానిస్తాం

వంశధారకు వరదలు వస్తే.. ఆ నీటిని సోమశిల దాకా తీసుకెళ్లేలా చేస్తాం

హంద్రీ-నీవా, గాలేరు-నగరితో సీమకు తాగు, సాగునీరిస్తాం

ఉత్తరాంధ్ర, గాలేరు-నగరి పథకాలు ఏడాదిలో పూర్తిచేస్తాం

పోలవరాన్ని 2027కల్లా పూర్తిచేస్తాం


ఈ ఏడాది 5,400 టీఎంసీలు కడలిపాలు

200 టీఎంసీల గోదావరి వరద నీరు బనకచర్లకు వాడుకుంటామంటున్నాం

దీనిపై తెలంగాణ పునరాలోచించాలి

జగన్ విధ్వంసకుడు, అసమర్థుడు

అసెంబ్లీలో లఘు చర్చలో సీఎం ధ్వజం



అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాజెక్టులన్నిటినీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. నదులన్నింటినీ అనుసంధానించి.. 'ఒకే రాష్ట్రం.. ఒకే నదీ జల విధానం' అమలు చేస్తామన్నారు. వంశధారలో అధిక వరదలు వస్తే.. ఆ నీటిని సోమశిల దాకా తీసుకెళ్లేలా అనుసంధాన ప్రక్రియ చేపడతామని తెలిపారు. అసమర్థ నీటి యాజమాన్య నిర్వహణతో జగన్ చేసిన విధ్వంసం

మిగతా 12వ పేజీలో...

అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణ

ఆగస్టు 31 వరకు కట్టిన భవనాలకు వర్తింపు 13

బిల్లుకు క్యాబినెట్ ఓకే.. 'వైఎస్సార్ తాడిగడప' పేరు మార్పు

'నాలా' రద్దు సహా 13 అంశాలకు ఆమోదముద్ర

బొండా మాటల మంటలు

పీసీబీ చైర్మన్‌పై తీవ్ర ఆరోపణలు

ఉప ముఖ్యమంత్రి పవన్ పేరూ ప్రస్తావన

తీవ్రంగా పరిగణించిన పవన్ కల్యాణ్

అప్పటికప్పుడే చైర్మన్, అధికారులతో భేటీ

బొండా ఉమాది బెదిరింపు ధోరణి..

వ్యక్తిగత ఉద్దేశాలతోనే వ్యాఖ్యలు

సీఎంకు నివేదించాలని పవన్ నిర్ణయం!


బొండా వ్యాఖ్యలపై సీఎంవో ఆరా

క్రెబ్స్‌పై తానే ఫిర్యాదు చేసిన బొండా..

చర్యలకు సిద్ధమయ్యాక వద్దంటూ ఒత్తిడి?

నేపథ్యం వివరించిన పీసీబీ అధికారులు

అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో తెలుగుదేశం ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలు కలకలం రేపాయి. కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్యపై ఆయన సభలో తీవ్ర ఆరోపణలు చేశారు. సంబంధిత శాఖకు బాధ్యుడైన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేరునూ ప్రస్తావించారు. దీంతో... అసలు బొండా ఉమా ఇలా ఎందుకు వ్యవహరించారు, దీని నేపథ్యం ఏమిటనే కోణంలో అటు పవన్ కార్యాలయం, ఇటు సీఎంఓ కూడా ఆరా తీసింది. ప్రస్తుతం అసెంబ్లీలో



మిగతా 13వ పేజీలో...



భయపెట్టడం కాదు!

కాలుష్య సమస్యకు పరిష్కారం కావాలి

నిబంధనలను కఠినంగా అమలు చేస్తే ఎన్ని ఇండస్ట్రీలు మూతబడిపోతాయో!

ప్లాస్టిక్‌కు బదులు బయో-డీగ్రేడబుల్ వినియోగంపై అవగాహన కల్పించాలి

కాలుష్యంపై రోజంతా చర్చించాలి: పవన్

బడులకు దసరా సెలవులు

22 నుంచే 14

పనితీరు బాగలేదంటూ

వీఆర్వోలతో గుంజీలు 10

ఆర్డీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు



హెక్టారుకు రూ.50 వేల

సాయం

కష్టాల్లో ఉన్న ఉల్లి రైతుకు కూటమి ప్రభుత్వం అండ

సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం.. మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

ఇప్పటికే లక్షా 39 వేల క్వింటాళ్ల కొనుగోలు 14

గ్రీన్ ట్యాక్స్ తగ్గింపు 13

12 ఏళ్లు పైబడిన లారీలకు వర్తింపు.. 15 వేల నుంచి 3 వేలకు.. 5 వేల నుంచి 1500కు

వాహన పన్ను సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం.. ఎన్నికల హామీ నెరవేర్చిన చంద్రబాబు

ఓబుళాపురం అక్రమ మైనింగ్‌పై

'సుప్రీం' కమిటీ

జస్టిస్ సుధాంశు నేతృత్వంలో ఏర్పాటు

హద్దుల గుర్తింపు, అక్రమ తవ్వకాల విస్తీర్ణం, ప్రభుత్వానికి జరిగిన నష్టంపై అంచనా

నివేదిక సమర్పణకు 3 నెలల గడువు 12

దుగరాజపట్నం వద్ద

షిప్ బిల్డింగ్ క్లస్టర్

2,000 ఎకరాల్లో ఏర్పాటుకు గుజరాత్‌లో ఎంవోయూ 12



మురళిని జైలుకు తరలిస్తున్న సీఐడీ పోలీసులు

'మదనపల్లె ఫైల్స్' కేసులో

మాజీ ఆర్డీవో మురళి అరెస్టు

సుప్రీం కోర్టు బెయిల్ రద్దుతో అదుపులోకి తీసుకున్న సీఐడీ 10

ఓట్ల చోరీని భారత జెన్-జీ

అడ్డుకుంటుంది!

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని యువత, విద్యార్థులే కాపాడుకుంటారు 2

వారి పోరాటానికి అండగా ఉంటా: రాహుల్

ఇది అంతర్యుద్ధాన్ని ప్రేరేపించడమే: బీజేపీ

కర్ణాటకను వీడి విశాఖకు మిట్టల్

అధికారికంగా ప్రకటించిన స్టీల్, ఐరన్ ఓర్ దిగ్గజ పరిశ్రమ 14

దేశవ్యాప్తంగా 474 రాజకీయ పార్టీలు రద్దు!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలపై మరోసారి చర్యలు చేపట్టింది. నిబంధనలు ఉల్లంఘించిన 474 పార్టీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. గత ఆరేళ్లలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. తొలి దశలో భాగంగా ఆగస్టు 9న 334 పార్టీలను రద్దు చేసిన విషయం తెలిసిందే. 'రెండో దశలో భాగంగా 474 గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలను ఈ నెల 18న జాబితా నుంచి తొలగించాం. గత రెండు నెలల వ్యవధిలో మొత్తంగా 808 రాజకీయ పార్టీలను రద్దు చేశాం" అని ఈసీ శుక్రవారం తెలిపింది. ఇప్పటివరకు 2520 గుర్తింపు లేని నమోదిత పార్టీలు ఉండగా, తాజా తొలగింపుతో ఈ సంఖ్య 2046కు తగ్గిందని తెలిపింది.

విమానాశ్రయాల నిధులు సొంత ఖాతాలకు

▸ 250 కోట్లు మళ్లించుకున్న ఏఏఐ సీనియర్ మేనేజర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: సంస్థ నిధులను సొంతానికి వాడుకున్న ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సీనియర్ మేనేజర్ (ఫైనాన్స్) రాహుల్ విజయ్ అక్రమాల్లో మరికొన్నింటిని సీబీఐ వెలుగులోకి తెచ్చింది. మొత్తం రూ.250 కోట్ల మేర కుంభకోణానికి పాల్పడినట్టు గుర్తించింది. డెహ్రాడూన్ విమానాశ్రయంలో రూ.232 కోట్ల నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై రెండు వారాల క్రితం ఆయనను అరెస్టు చేసింది. అంతకుముందు జైపూర్‌లో 2024-25 మధ్య పనిచేసినప్పుడు మరో రూ.18.12 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని సీబీఐ తాజాగా తెలిపింది. ఈ మేరకు బుధవారం కోర్టులో అఫిడవిట్‌ను సమర్పించింది. తన హోదాను దుర్వినియోగం చేసి స్టేటుబ్యాంకులో ఉన్న ఏఏఐ ఖాతాల నుంచి యాక్సిస్ బ్యాంకు, స్టేట్ బ్యాంకుల్లోని తన సొంత ఖాతాలకు మళ్లించుకున్నట్టు గుర్తించింది.

ఢిల్లీ వర్సిటీ ఎన్నికల్లో ఏబీవీపీ ఘన విజయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికల్లో ఏబీవీపీ సత్తా చాటింది. యూనియన్ అధ్యక్ష పదవితో పాటు కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులను గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంస్థ ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్ష పదవి దక్కించుకుంది. ఏబీవీపీ తరఫున ఆర్యన్ మాన్ డీయూఎస్‌యూ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఏబీవీపీకి చెందిన కునాల్ చౌధరి కార్యదర్శిగా, దీపికా ఝా సంయుక్త కార్యదర్శిగా గెలిచారు. ఎన్ఎస్‌యూఐకి చెందిన రాహుల్ ఝాంస్లా ఉపాధ్యక్షుడిగా విజయం సాధించారు. వామపక్షాలకు చెందిన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆల్ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాయి. తాజా గెలుపొందిన ఏబీవీపీ నేతలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా అభినందించారు.

'ఏఐ' ముఖ గుర్తింపుతో అభ్యర్థుల ధ్రువీకరణ

▸ కొత్త సాంకేతికతను ప్రవేశపెట్టిన యూపీఎస్సీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: పరీక్షల ప్రక్రియ సమగ్రతను బలోపేతం చేసే దిశగా యూపీఎస్సీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వేగవంతమైన, సురక్షితమైన అభ్యర్థుల ధ్రువీకరణ కోసం ఏఐ ఆధారిత ఫేషియల్ అథెంటికేషన్ (ముఖ ప్రామాణీకరణ) సాంకేతికతను ప్రవేశపెట్టింది. ఈ ఏఐ ఆధారిత వ్యవస్థను పరీక్షించేందుకు చేపట్టిన పైలట్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు యూపీఎస్సీ చైర్మన్ అజయ్‌కుమార్ శుక్రవారం ప్రకటించారు. జాతీయ ఈ-గవర్నెన్స్ విభాగం భాగస్వామ్యంతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

ఇంజన్ ఆయిలే ఆహారం..!

▸ 33 ఏళ్లుగా దానితోనే బతుకుతున్న 'ఆయిల్ కుమార్'



బెంగళూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ఇడ్లీనో, దోశనో.. మరేదైనా అల్పాహారమో తింటారు. కానీ.. కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాకు చెందిన కుమార్ మాత్రం చాలా స్పెషల్..! బ్రేక్‌ఫాస్ట్ కింద ఉదయాన్నే ఒక బాటిల్ వేస్ట్ ఇంజన్ ఆయిల్ తాగితే గానీ ఆయన రోజు మొదలవదు..! ఉదయం టీతోపాటు రోజు మొత్తమ్మీద ఆయన ఏడు, ఎనిమిది లీటర్ల ఇంజిన్ ఆయిల్ లాగించేస్తాడు. ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం..! ఒకటి కాదు రెండు కాదు.. 33 ఏళ్లుగా ఆయన ఇలాగే ఇంజన్ ఆయిల్ తాగి బతుకుతున్నాడు. వాహనాలకు ఇంజన్ ఆయిల్ మార్చినప్పుడు వచ్చే వేస్ట్ ఆయిల్‌ను తాగుతూ 'ఆయిల్ కుమార్'గా పేరు తెచ్చుకున్నాడు. ఇప్పుడు ఆయన గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో వైరల్ అవుతోంది. ఏడాదిలో సగంరోజులు అయ్యప్ప స్వామి దీక్షలో గడిపే కుమార్.. ఇంజన్ ఆయిల్ తాగుతున్నా ఎప్పుడూ అనారోగ్యం పాలవలేదు. ఆస్పత్రులకు వెళ్లలేదు. దానికి అయ్యప్పస్వామిపై తనకున్న విశ్వాసమే కారణమని కుమార్ చెబుతున్నాడు.

బంగాళాఖాతంలో 1400 కి.మీ. నో ఫ్లై జోన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: బంగాళాఖాతంలో మరో ఖండాంతర క్షిపణి పరీక్షకు భారత్ సిద్ధమవుతోంది. దీని కోసం 24, 25 తేదీల్లో 1,400 కిలోమీటర్ల మేర నో ఫ్లై జోన్‌గా ప్రకటించారు. ఈ విషయంలో వైమానిక సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. ఒడిశా తీరంలోని అబ్దుల్ కలాం దీవి నుంచి ఆ క్షిపణి ప్రయోగం చేపట్టనున్నారు. తదుపరి తరం బాలిస్టిక్ మిస్సైల్ అగ్ని-ప్రైమ్ (అగ్ని-పి)ను ఇక్కడ పరీక్షించనున్నారని అధికారులు తెలిపారు. ఈ క్షిపణి లక్ష్య ఛేదన పరిధి 1,000 నుంచి 2,000 కి.మీ. మధ్య ఉంటుంది. అయితే ప్రస్తుతం ప్రకటించిన నో ఫ్లై జోన్ వల్ల పౌర, వాణిజ్య విమాన సేవలకు ఆటంకం ఉండదని చెబుతున్నారు.

అమెరికా, చైనా..టిక్ టాక్ డీల్ ఓకే: ట్రంప్

వాషింగ్టన్, సెప్టెంబరు 19: అమెరికాలో టిక్‌టాక్ సోషల్ మీడియా వేదికను తిరిగి అనుమతించే విషయంలో ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. అంతేకాదు త్వరలో చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌ను కలుస్తానని, చైనాకు కూడా వెళతానని పేర్కొన్నారు. శుక్రవారం జిన్‌పింగ్‌తో ఫోన్‌లో చర్చలు జరిపిన ట్రంప్.. అనంతరం తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్'లో పోస్టు పెట్టారు.

అఫ్ఘానిస్థాన్‌లోకి మళ్లీ అడుగు పెడతాం

అఫ్ఘానిస్థాన్‌లోకి తమ సైనిక దళాలను తిరిగి పంపాలని అమెరికా ఆలోచిస్తున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలతో తెలుస్తోంది. దాదాపు నాలుగేళ్ల క్రితం అఫ్ఘానిస్థాన్‌లో తమ సైన్యాన్ని ఉపసంహరించుకోవడం వల్ల కోల్పోయిన కీలకమైన బాగ్రాం సైనిక స్థావరాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఆయన ప్రకటించారు. గురువారం బ్రిటన్ పర్యటనలో భాగంగా ప్రధాని కీర్ స్టార్మర్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఈపీఎఫ్‌వో 'పాస్‌బుక్ లైట్'!

▸ ఇక ఉద్యోగుల భవిష్యనిధి సేవలన్నింటికీ ఒకే లాగిన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) తన చందాదారుల కోసం సరికొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. 'పాస్‌బుక్ లైట్' పేరిట ప్రవేశపెట్టిన ఈ సదుపాయంతో ఉద్యోగులు ఈపీఎఫ్‌వో సేవలన్నీ ఒకే లాగిన్ ఐడీ ద్వారా సులభంగా పొందవచ్చు. ఇప్పటిదాకా వేర్వేరుగా ఉన్న లాగిన్‌లను ఒకే గొడుగు కిందకు తెస్తున్నట్లు కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. దీని వల్ల 7 కోట్ల మందికి ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రస్తుతం చందా వివరాలను తెలుసుకోవడానికి, లావాదేవీలను చూసుకోవడానికి, అడ్వాన్సు తీసుకోవడానికి, డబ్బును విత్ డ్రా చేసుకోవడానికి సభ్యులు పాస్‌బుక్ పోర్టల్‌లో లాగిన్ కావాల్సి ఉంటుంది. కొత్తగా తీసుకొచ్చిన సౌకర్యం ద్వారా సభ్యులు మెంబర్ పోర్టల్‌లో పొందుపరిచిన 'పాస్‌బుక్ లైట్ ద్వారా ఖాతా వివరాలను తెలుసుకోవచ్చు. ఇందు కోసం మెంబర్ పోర్టల్‌లోనే లింకు ఉంటుంది. దీనిద్వారా పాస్‌బుక్ వివరాలను సులభంగా పొందవచ్చు. పాస్‌బుక్ పోర్టల్‌లో లాగిన్ కావాల్సిన అవసరం లేదు.



ఓట్ల చోరీని భారత జెన్-జీ అడ్డుకుంటుంది!

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని యువత, విద్యార్థులే కాపాడుకుంటారు

▸ వారి పోరాటానికి అండగా ఉంటా: రాహుల్.. ఇది అంతర్యుద్ధాన్ని ప్రేరేపించడమే: బీజేపీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: భారత్‌లోనూ జెన్-జీ ఓట్ల చోరీని అడ్డుకుంటుందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్య రాజకీయ దుమారం రేపింది. ఓట్ల దొంగలను ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ రక్షిస్తున్నారని గురువారం ప్రత్యక్ష దాడికి దిగిన ఆయన.. ఓట్ల చోరీని అడ్డుకోవాలని 2000వ సంవత్సరం దరిదాపుల్లో జన్మించిన విద్యార్థులు, జెన్-జీకి శుక్రవారం 'ఎక్స్'లో పిలుపిచ్చారు. 'ఈ దేశ యువత, ఈ దేశ విద్యార్థులు.. ఈ దేశ జెన్-జీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటారు. ఓట్ల చోరీని అడ్డుకుంటారు. నేనెప్పుడూ వారికి అండగా నిలుస్తా' అని తెలిపారు. నేపాల్లో జెన్-జీ చేపట్టిన ఉద్యమం హింసాత్మకం కావడం.. 50 మందికిపైగా విద్యార్థులు మరణించడం.. తదనంతర పరిణామాల్లో కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం కుప్పకూలడం తెలిసిందే. రాహుల్ జెన్-జీ ప్రస్తావన తేవడంపై బీజేపీ మండిపడింది. ఇది నేపాల్ తరహా సంక్షోభాన్ని రెచ్చగొట్టడమేనని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే 'ఎక్స్'లో విమర్శించారు. 'భారత జెన్-జీ.. కుటుంబ రాజకీయాలకు, అవినీతికి, సైద్ధాంతిక అస్పష్టతకు వ్యతిరేకం. అనువంశిక రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తారు. నెహ్రూ, ఇందిర, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీని చూసినవారు రాహుల్‌ను ఏ విధంగా భరిస్తారు? అవినీతికి వ్యతిరేకులైన యువత మిమ్మల్ని తరిమికొట్టకుండా ఉంటారా? జెన్-జీలో ఆగ్రహం పెల్లుబికితే ఈ దేశం వదిలి వెళ్లిపోవడానికి రాహుల్ సిద్ధంగా ఉండాలి. బంగ్లాదేశ్‌లో ఆందోళనకు దిగినవారు ఇస్లామిక్ రాజ్యం కోరుకుంటున్నారు. నేపాల్ యువత హిందూ రాజ్యం అడుగుతున్నారు. భారత్‌నూ వారు హిందూరాజ్యంగా మార్చవచ్చు. దేశం వీడిపోవడానికి రాహుల్ సన్నాహాలు చేసుకోవాలి' అని స్పష్టంచేశారు. అంతర్యుద్ధం రావాలని ఆయన కోరుకుంటున్నారని.. దేశాన్ని చీల్చడానికి సొరోస్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తున్నారని విమర్శించారు. మహారాష్ట్ర సీఎం, బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్ ఆయనపై మండిపడ్డారు. రాహుల్ 'అర్బన్ నక్సల్' అని.. దేశంలో అంతర్యుద్ధాన్ని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఎన్నుకోకపోతుండడంతో.. ప్రత్యామ్నాయ మార్గాల్లో అధికారంలోకి రావాలన్నది రాహుల్ ఆలోచనగా ఉందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ మండిపడ్డారు. 'ప్రపంచంలోనే మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. రాహుల్‌ను ప్రజలెన్నుకోకపోవడం మా తప్పా? భారత్‌ను నేపాల్, బంగ్లాదేశ్‌లతో పోల్చుతూ చెత్త ప్రకటనలు చేస్తున్నారు. ఇలాంటి మనస్తత్వాలను భారతీయులు అంగీకరించరు. అరాచకం సృష్టించడానికి ఆయన ఇచ్చిన పిలుపును ప్రజలు ఆమోదించరు' అని స్పష్టంచేశారు.

ఈసీ.. చునావ్ కీ చౌకీదార్: రాహుల్

ఈసీపై రాహుల్ మళ్లీ ఆరోపణలకు దిగారు. దానిని 'చునావ్ కీ చౌకీదార్ (ఎలక్షన్ వాచ్‌మన్)'గా అభివర్ణించారు. 'వేకువన 4 గంటలకు నిద్ర లేస్తారు.. 36 సెకన్లలో రెండు ఓట్లు తొలగిస్తారు.. తర్వాత మళ్లీ నిద్రపోతారు.. ఓట్ల చోరీ జరుగుతున్నది ఇలాగే. చునావ్ కీ చౌకీదార్ మెలకువగానే ఉంటారు. ఓట్ల దొంగతనాన్ని చూస్తూనే ఉంటారు.. మళ్లీ దొంగలనే కాపాడుతుంటారు' అని శుక్రవారం 'ఎక్స్'లో ధ్వజమెత్తారు. ఓట్ల దొంగతనం ఎలా జరుగుతోందో గురువారం తాను చెప్పిన 36 సెకన్ల వీడియోను ఈ సందర్భంగా ఆయన షేర్ చేశారు.

నా ఫోన్ నంబర్‌ను రాహుల్ ఎలా బహిరంగపరుస్తారు?

ఆయనపై కేసు పెడతా: అంజనీ మిశ్రా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: ఓటు చోరీ అంశంపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ నిర్వహించిన విలేకరుల సమావేశంలో తన ఫోన్ నంబర్‌ను వెల్లడించడంపై అంజనీ మిశ్రా అనే వ్యక్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఓటు తొలగింపునకు గురైనట్టు, దీనిపై తాను ఈసీకి ఫిర్యాదు చేసినట్టు రాహుల్ చెప్పడం అవాస్తవమన్నారు. తాను ఎప్పుడూ ఈసీకి ఫిర్యాదు చేయలేదని తెలిపారు. పైగా, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన తనను మహారాష్ట్ర ఓటరుగా రాహుల్ చెప్పారని, తన జీవితంలో ఏనాడూ ఆ రాష్ట్రానికి కూడా వెళ్లలేదని అన్నారు. తన ఫోన్ నంబర్‌ను బహిరంగపరచడం వల్ల తనకు పెద్దసంఖ్యలో ఫోన్ కాల్స్ వస్తున్నాయని, తన ప్రైవసీకి భంగం వాటిల్లిందని పేర్కొన్నారు. ఈ అంశంపై రాహుల్‌గాంధీపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు.


పాక్-సౌదీ రక్షణ ఒప్పందంలోకి మరిన్ని దేశాలు?

ఖతార్, యూఏఈ చర్చలు జరుపుతున్నట్టు కథనాలు



న్యూఢిల్లీ, ఇస్లామాబాద్, సెప్టెంబరు 19 : పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య జరిగిన వ్యూహాత్మక పరస్పర రక్షణ ఒప్పందంలో మరిన్ని అరబ్ దేశాలు భాగమయ్యే అవకాశాలను కొట్టిపారేయలేమని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నారు. నాటో తరహాలో పాక్, సౌదీ దేశాలు ఇటీవల ఓ ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగమయ్యేందుకు ఇతర అరబ్ దేశాలు.. ముఖ్యంగా ఖతార్, యూఏఈ ఇప్పటికే చర్చలు జరుపుతున్నట్టు కథనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జియా న్యూస్‌తో మాట్లాడిన పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్.. ఇతర అరబ్ దేశాలు పాక్-సౌదీ ఒప్పందంలో చేరుతాయా అనే ప్రశ్నకు స్పందించారు. "ఈ అంశంపై ఇప్పుడే మాట్లాడలేను. కానీ, వేరే దేశాలు భాగమయ్యేందుకు ద్వారాలు మూసుకుపోలేదని మాత్రం కచ్చితంగా చెప్పగలను" అని వ్యాఖ్యానించారు. సౌదీతో తాము చేసుకున్న ఒప్పందంలో మరో దేశం చేరకూడదనే షరతు లేదని వివరించారు. ముస్లిం ప్రజలు, ముస్లిం దేశాలు ఉన్నచోట సమష్టిగా దేశాలను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే, ఈ ఒప్పందం కింద అణ్వాయుధాలు వాడకూడదనే నిబంధన కూడా లేదని ఆసిఫ్ తెలిపారు. అఫ్ఘానిస్థాన్ నుంచి అమెరికా వెళ్లిపోయాక తాలిబన్లు, బీఎల్ఏవంటి వారితో తాము పోరాడుతున్నామని వెల్లడించారు. అఫ్ఘాన్‌ను తమకు శత్రుదేశంగా అభివర్ణించారు. ఇదిలా ఉండగా సౌదీతో తమ వ్యూహాత్మక భాగస్వామ్యం ఎప్పట్లాగే కొనసాగుతుందని ఆశిస్తున్నట్లు భారత్ శుక్రవారం పేర్కొంది.


లోకం తీరు



పాక్‌కు వెళ్తే సొంతింట్లో ఉన్నట్టుంది!

శాంతి, సామరస్యంతో ఎలా జీవించాలో నేపాల్, బంగ్లాదేశ్‌ను చూసి నేర్చుకోవాలి

శామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 19: "పాకిస్థాన్‌కు వెళ్తే.. సొంతింట్లో ఉన్నట్టుగా ఉంటుంది. నేపాల్, బంగ్లాదేశ్‌లలోనూ అలాంటి అనుభూతే కలుగుతుంది." అని కాంగ్రెస్ పార్టీ విదేశీ వ్యవహారాల నాయకుడు శామ్ పిట్రోడా వ్యాఖ్యానించారు. అంతేకాదు, పొరుగు దేశాలతో సఖ్యతగా మెలిగేలా భారత విదేశాంగ విధానంలో మార్పు రావాలని ఉచిత సలహా ఇచ్చారు. వాస్తవానికి ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడంతోపాటు పాక్ వారిని భారత్‌పైకి ఉసిగొల్పుతున్న విషయం తెలిసిందే. ఇక, ప్రజలు, విద్యార్థుల తిరుగుబాట్లతో నేపాల్, బంగ్లాదేశ్‌లలో ప్రభుత్వాలే కుప్పకూలాయి. అలాంటి దేశాలను ప్రశంసిస్తూ తాజాగా పిట్రోడా చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పిట్రోడా మాట్లాడుతూ.. "ఉగ్రవాదం, విధ్వంసాలు వంటి విషయాలను పక్కన పెట్టి పాకిస్థాన్, బంగ్లాదేశ్‌తో భారత్ చర్చించాలి. మన విదేశాంగ విధానం ఆయా దేశాలపై దృష్టి సారించాలి. నిజానికి మనం పొరుగు దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకున్నామా?. ఆయా దేశాలు ఇప్పటికే సమస్యలు ఎదుర్కొంటున్నాయి. అలాంటి వాటితో యుద్ధం అవసరం లేదు." అని వ్యాఖ్యానించారు. రాజకీయ దుమారంపై పిట్రోడా స్పందించారు. పొరుగుదేశాలతో భారత్‌కు ఉన్న ఉమ్మడి చరిత్రను నొక్కి చెప్పాలన్నదే తన ఉద్దేశమన్నారు.

అభయ్ ఎక్కడ!?



▸ పోలీసుల అదుపులో ఉన్నారా?

▸ వారి ఒత్తిడితోనే లేఖ రాశారా?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ఆయుధాలు వదిలేందుకు సిద్ధంగా ఉన్నాం. మాకు నెలరోజులు గడువు ఇవ్వండి' అంటూ సంచలన ప్రకటన చేసిన మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పార్టీ అధికార ప్రతినిధి సోను అలియాస్ అభయ్ ఎక్కడ? ఆయన దండకారణ్యంలో ఉన్నారా? లేక భద్రతా బలగాల అదుపులో ఉన్నారా? పార్టీ పద్ధతులు, విధానాలకు పూర్తి విరుద్ధంగా ఆయన ప్రకటన విడుదలైన నేపథ్యంలో ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్న ప్రశ్న ఇది. కరీంనగర్ జిల్లాకు చెందిన మల్లోజుల కోటేశ్వర్‌రావు (కిషన్‌జీ) సోదరుడు వేణుగోపాలరావు కొంతకాలంగా 'అభయ్' పేరుతో పార్టీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. పార్టీలో కీలక స్థానంలో ఉన్న ఆయన ఇటీవల విడుదల చేసిన సాయుధ పోరాట విరమణ ప్రకటన సంచలనం సృష్టిస్తోంది. ఇది మావోయిస్టు పార్టీ మూల సిద్ధాంతానికే పూర్తి విరుద్ధం. నిజానికి, బస్వరాజ్ ఎన్‌కౌంటర్ తర్వాత ఇప్పటి వరకు పార్టీ కొత్త ప్రధాన కార్యదర్శిని ఎన్నుకోలేదు. పొలిట్‌బ్యూరో సమావేశం జరగలేదు. కనీసం కేంద్ర కమిటీ సమావేశం జరగలేదు. అలాంటప్పుడు, సాయుధ పోరాట విరమణ ప్రకటన ఎలా చేశారనే సందేహాలను మావోయిస్టు పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఆయన ఉనికిపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అభయ్ భద్రతా బలగాల అదుపులో ఉన్నారా? వారి ప్రభావంతోనే 'సాయుధ పోరాట విరమణ' ప్రకటన విడుదల చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ ప్రకటనల్లో ఎప్పుడూ అధికార ప్రతినిధులు, నేతల ఫొటోలు ఉండవు. కానీ, అభయ్ యూనిఫామ్‌లో ఉన్న స్పష్టమైన ఫొటోను ప్రకటనకు జత చేశారు. పోలీసుల వద్ద ఆయనకు సంబంధించి 1986 నాటి ఫొటో మాత్రమే ఉంది. దాంతో, ఇదంతా పోలీసుల ఎత్తుగడలో భాగంగానే జరిగి ఉంటుందని పార్టీ, ప్రజా సంఘాల నేతలు అనుమానిస్తున్నారు.

బస్వరాజ్ ఉన్నప్పటి నిర్ణయమేనా?

పార్టీ సాయుధ పోరాట విరమణ ప్రకటనకు, అభయ్ ఉనికికి సంబంధం ఉండదని కీలక ప్రజాసంఘం నేత ఒకరు అభిప్రాయపడ్డారు. "అభయ్ ప్రకటనలో కీలక అంశాలున్నాయి. పార్టీ ప్రధాన కార్యదర్శిగా బస్వరాజ్ ఉన్న సమయంలోనే శాంతి చర్చలపై కీలక చర్చ జరిగిందని ఆయన రాశారు. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. అంటే, ఇది తన సొంత నిర్ణయం కాదని అభయ్ స్పష్టం చేశారు. బస్వరాజ్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న 2024 సెప్టెంబరు, 2025, ఫిబ్రవరిలో రెండు కీలక సమావేశాలు జరిగాయి. అందుబాటులో ఉన్న పొలిట్‌బ్యూరో సభ్యులు హాజరయ్యారు. కేడర్, నాయకత్వాన్ని కాపాడుకునేందుకు కేంద్రంతో శాంతి చర్చలకు వెళ్లాల్సిందేనని, అవసరమైతే కొంత కాలంపాటు సాయుధ పోరాట విరమణకు ఒప్పుకొందామని అప్పట్లోనే నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఈ ఏడాది మే 10న అభయ్ పేరిట స్వయంగా బస్వరాజ్ ప్రకటన విడుదల చేశారు కూడా" అని వివరించారు. ఇదే విషయాన్ని అభయ్ తన ప్రకటనలో తెలిపారని, ఈ విషయం తెలిసిన పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ కీలక నేతలు స్పందించాలని కోరారు. అభయ్ పోలీసుల అదుపులో లేరని కచ్చితంగా చెప్పగలమని తెలంగాణకే చెందిన మరో కీలక ప్రజాసంఘం నేత చెబుతున్నారు. సాయుధ పోరాట విరమణ ప్రకటనకు ముందే.. ఆగస్టులోనే సోను పేరిట కేడర్‌కు ఓ అంతర్గత లేఖ వచ్చిందని, పోరాట విరమణను పెద్ద మనసుతో అర్థం చేసుకోవాలని, పోరాటం మరో రూపంలో ఉంటుందని, లేఖను అపరాధ భావనతో రాస్తున్నట్లుగా అందులో పేర్కొన్నారని వివరించారు.

కేంద్ర మంత్రితో చర్చలకు రాయబారం

పార్టీ ప్రధాన కార్యదర్శి బస్వరాజ్ ఎన్‌కౌంటర్‌కు ముందు కేంద్రంతో శాంతి చర్చలకు రెండు దఫాలుగా ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ బీజేపీ నేతల ద్వారా ప్రయత్నించారని తెలిసింది. బస్వరాజ్ ఎన్‌కౌంటర్ తర్వాత కూడా మరికొన్ని యత్నాలు చేసినట్లు సమాచారం. దక్షిణాదికే చెందిన కీలక కేంద్ర మంత్రి ద్వారా రాయబారం నడిపినట్లు తెలిసింది. సదరు మంత్రి నేరుగా అమిత్ షాను కలిసి మావోయిస్టుల ప్రతిపాదనలను వివరించినట్లు సమాచారం. శాంతి చర్చలకు అవకాశమే లేదని, అయితే, ఆయుధాలతో సహా సరెండర్ కావాలని, లేదంటే బలగాలను ఎదుర్కోవాల్సిందేనని షా స్పష్టం చేసినట్లు సమాచారం. దాంతో, తాము కోరుకున్నట్లుగా చర్చలు జరగవని మావోయిస్టులకు అర్థమైంది. ఆ తర్వాతే సాయుధ పోరాట విరమణ ప్రకటన వచ్చి ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

అది అభయ్ వ్యక్తిగతం!

▸ మావోయిస్టు పార్టీతో సంబంధంలేదు: తెలంగాణ కమిటీ ప్రతినిధి జగన్

హైదరాబాద్/చర్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'ఆయుధాలు వదిలి వేయడానికి సంసిద్ధంగా ఉన్నాం' అంటూ మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోను అలియాస్ అభయ్ రాసిన లేఖలోని అభిప్రాయాలు ఆయన వ్యక్తిగతమని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధి జగన్ ప్రకటించారు. అది పార్టీ నిర్ణయం ఏ మాత్రం కాదని ఒక లేఖ విడుదల చేశారు. అభయ్ పేరిట వచ్చింది అధికారిక ప్రకటన కాదని... విప్లవ శిబిరం, మిగిలిన అన్ని రాజకీయ పార్టీలు దానిని అధికారిక ప్రకటనగా గుర్తించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మావోయిస్టు పార్టీ నాయకత్వాన్ని, క్యాడర్‌ను నిర్మూలించేందుకు కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీతో చర్చించకుండా సోను ఈ ప్రకటనను విడుదల చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. "బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ కొనసాగిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది మార్చిలో కొంతమంది ప్రజాస్వామిక మేధావులు శాంతి చర్చల కమిటీగా ఏర్పడ్డారు. యుద్ధ కాండను నిలిపి వేయాలని దేశంలోని ఎందరో ప్రముఖులు కోరారు. కూంబింగ్, హత్యాకాండను ఆపాలని, కొత్త క్యాంపుల నిర్మాణాన్ని నిలిపి శాంతియుత వాతావరణంలో చర్చలు జరపాలని కేంద్ర కమిటీ కూడా ప్రకటించింది. అయినా కేంద్రం ఎలాంటి సడలింపులు లేకుండా రక్తపుటేరులు పారిస్తూనే ఉంది. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు మావోయిస్టు పార్టీని నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి ప్రకటించారు. మరోవైపు, ఇటీవలి ఎన్‌కౌంటర్లలో అనేకమంది అమరులయ్యారు. అనారోగ్య సమస్యలతో పార్టీ అనుమతి తీసుకుని కొందరు సరెండరయ్యారు. ఇలాంటి సమయంలో... సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నామంటూ ఎక్కడెక్కడో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకోవడానికి నెలరోజులు సమయం కావాలని ప్రకటించడం ఏ పద్ధతో అర్థం కావడం లేదు" అని జగన్ తప్పుబట్టారు. ఉద్యమాన్ని వదిలి జన జీవన స్రవంతిలో కలిసి చట్టబద్ధంగా పని చేయాలని అనుకున్నప్పుడు పార్టీ కమిటీలో చర్చించి అనుమతి పొందవచ్చని, తన అభిప్రాయాన్ని పార్టీ చానల్‌లో పంపించినప్పుడు ఆయన ప్రశ్నలకు జవాబులు దొరికేవని సూచించారు. అది చేయకపోగా కీలక విషయాన్ని బహిరంగంగా ప్రకటించడం ద్వారా పార్టీ శ్రేణులు, విప్లవ శిబిరంలో గందరగోళం తలెత్తుతుందని, సోను అనుసరించిన పద్ధతి ఉద్యమానికి ఉపయోగపడకపోగా నష్టం చేస్తుందని స్పష్టం చేశారు. దేశంలోని ఏ పార్టీ కూడా ఇటువంటి నిర్ణయాలను ఇంటర్నెట్ ద్వారా బహిరంగ చర్చకు పెట్టి పరిష్కరించాలని చూడదని, అటువంటిది తీవ్రమైన దమనకాండ అమలు జరుగుతున్న సమయంలో రహస్య, కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడిన పార్టీలో సరిగ్గా ఆలోచించే వాళ్లు ఇలా చేయరని అభయ్‌ని తప్పుబట్టారు. భయంకరమైన దమనకాండలో జరుగుతున్న నష్టాలను అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమస్యకు ఇప్పటికిప్పుడు పరిష్కారం దొరక్క పోవచ్చునని, గత ఏడాది పొలిట్‌బ్యూరో విడుదల చేసిన ఉత్తర్వు (సాయుధ పోరాటంతోనే ముందుకు)ను అమలు చేయడమే తక్షణ కర్తవ్యమని అభిప్రాయపడ్డారు.

రూ.50 కోట్ల బ్లాక్‌మనీ ఉంది.. మారుస్తారా?

▸ ఓ ఐఏఎస్ ఆఫర్.. అధికారుల్లో హాట్ టాపిక్‌గా ఆయన శైలి

హైదరాబాద్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): నా దగ్గర రూ.50 కోట్ల నల్ల డబ్బు (బ్లాక్‌మనీ) ఉంది.. ఎవరైనా వైట్‌గా మారిస్తే రూ.కోటి ఇస్తా. కొందరు వ్యాపారులకు ఓ ఐఏఎస్ అధికారి ఇచ్చిన ఆఫర్ ఇదీ! ఓ కీలక శాఖలో అత్యంత కీలక స్థానంలో పని చేస్తున్న సదరు ఐఏఎస్ అధికారి, ఆ బాధ్యతల్లోకి వచ్చిన 4నెలల్లో ఇంత పెద్ద మొత్తం వెనుకేసుకోవడంపై ఉన్నతస్థాయి అధికారుల్లోనూ గుసగుసలు మొదలయ్యాయి. అనుమతుల పేరుతో అడ్డగోలుగా వసూళ్లకు దిగారన్న ఆరోపణలపై ప్రభుత్వం కూడా అంతర్గత విచారణ చేపట్టినట్లు తెలిసింది. అనుమతల కోసం ఓ వ్యాపారి ఇటీవల ఆ అధికారిని ఆశ్రయించగా రూ.3 కోట్ల ప్యాకేజీ తీసుకుని అనుమతులు ఇచ్చారనేది వ్యాపారవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అదే వ్యాపారులను తన వద్ద ఉన్న రూ.50 కోట్ల నల్ల ధనం మార్చి ఇవ్వాలని తొలుత ఆశ్రయించారని.. అందుకు ప్రతిఫలంగా రూ.కోటి ఇస్తానని ఆఫర్ చేసినట్లు.. అది ఆనోటా ఈనోటా బయటపడి అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో గత నాలుగు నెలల్లో ఇచ్చిన అన్ని రకాల అనుమతుల్లో ఆయన సొంత ఖాతాలో ఉన్నవి ఎన్ని? ఇతరత్రా మార్గాల ద్వారా అనుమతులు కావాలని వచ్చిన ప్రతిపాదనలు ఎన్ని అనే కోణంలో ప్రభుత్వం లెక్కలు తీస్తున్నట్లు తెలిసింది.

'విగ్రహం'పై ఎందుకీ రాద్ధాంతం?

▸ వివాదాస్పద వ్యాఖ్యలెందుకు చేశారు?

▸ భూమనను ప్రశ్నించిన పోలీసులు

▸ 4.20 గంటల్లో దాదాపు 35 ప్రశ్నలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వివాదాస్పద వ్యాఖ్యలతో రాద్ధాంతం ఎందుకు చేశారని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని పోలీసులు ప్రశ్నించారు. తిరుపతి అలిపిరి వద్ద శ్రీమహావిష్ణువుకు అపచారమంటూ ఆయన చేసిన తీవ్ర విమర్శలపై టీటీడీ ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణకు రావాలని పోలీసులు 41ఏ నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం 3.55 గంటలకు తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఎదుట భూమన హాజరయ్యారు. సుమారు 4.20 గంటల పాటు సాగిన విచారణలో అలిపిరి సీఐ రాంకిశోర్, ఎస్ఐ అజిత కలిసి భూమనను దాదాపు 35 ప్రశ్నలు వేసినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. అలిపిరి వద్ద శ్రీమహావిష్ణువు విగ్రహం ఉందని మీకెవరు సమాచారమిచ్చారని పోలీసుల ప్రశ్నకు.. తన అనుచరులు, శిష్యులు చెప్పడంతో వెళ్లానని భూమన సమాధానం చెప్పారు. అది శ్రీమహావిష్ణువు విగ్రహమని ఎలా నిర్ధారించారన్న ప్రశ్నకు.. విగ్రహంపై ఆనవాళ్లను బట్టి గట్టిగా చెబుతున్నానని తెలిపారు. ఆ విగ్రహం ఎప్పటి నుంచి అక్కడ ఉందో తనకు తెలియదని చెప్పారు. విగ్రహం గురించి మాజీ చైర్మన్ హోదాలో మీ ఆవేదనపై టీటీడీకి ఎందుకు లేఖ రాయలేదని పోలీసు అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఇలాంటి విషయాలపై టీటీడీ స్పందించడం లేదని, ఆ విగ్రహం పడున్న తీరు తన మనసును కలచి వేసిందని భూమన తెలిపినట్లు సమాచారం. విచారణ అనంతరం భూమన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం, టీటీడీ కుట్రపూరిత రాజకీయాలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. విగ్రహం పట్ల టీటీడీ నిర్లక్ష్యంతో ఒక హిందువుగా బాధపడ్డానన్నారు. తాను చెప్పిన మాటలకు నూటికి 1000 శాతం కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం ఆపి, బలోపేతానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఆయన శుక్రవారం విశాఖపట్నంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

హెచ్‌పీసీఎల్‌లో పేలుడు

» హైడ్రోజన్ లీక్ అవ్వడంతో ఎగసిపడిన మంటలు

» తప్పిన పెను ప్రమాదం

మల్కాపురం (విశాఖపట్నం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం మల్కాపురం ప్రాంతంలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) కంపెనీలో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. అయితే ఆ సమయంలో సమీపంలో కార్మికులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. రిఫైనరీ విస్తరణలో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న యూనిట్-1లో కంప్రెసర్‌లో స్టాటిక్ విద్యుత్ కారణంగా మంటలు చెలరేగాయి. 3/4 అంగుళాల హైడ్రోజన్ పైపు లైన్ వాల్వ్ బాడీ నుంచి 50 కిలోల పీడనం వద్ద హైడ్రోజన్ లీక్ అయింది. సాధారణంగా చమురు ప్రవహించే పైపులకు లీకులున్నాయా? అని తెలుసుకునేందుకు హైడ్రోజన్ పంపే క్రమంలో అది లీకైంది. అయితే ఆ ప్రాంతంలో హైడ్రోజన్‌ను మండించే పదార్థం ఉండడంతో మంటలు వచ్చాయని కంపెనీ అధికారులు అంచనాకు వచ్చారు. ఇదే విషయాన్ని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ముకుందరావుకు హెచ్‌పీసీఎల్ కంపెనీ అధికారులు నివేదించారు. ఈ మేరకు కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్టు తెలిపారు. కాగా.. మంటలతో పాటు పెద్ద శబ్దం రావడంతో కొద్దిదూరంలో పనిచేస్తున్న కార్మికులు, అప్పుడే పనుల్లోకి వస్తున్న కార్మికులు అప్రమత్తమై వెంటనే ప్రధాన గేటు వైపు పరుగులు తీశారు. ప్రమాదం జరిగిన వెంటనే సంస్థ యజమాన్యం అప్రమత్తమైంది. అగ్నిమాపక శకటాలు నిమిషాల వ్యవధిలో ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశాయి. అయితే ప్రమాదం జరిగిన ఘటన ప్రాంతం నుంచి భరించలేని దుర్వాసన వ్యాపించింది. మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు ఘటన స్థలాన్ని పరిశీలించి, ప్రమాదంపై దర్యాప్తు జరుపుతున్నామని ప్రకటించారు.



యూనిట్-1లో అగ్ని ప్రమాద దృశ్యం



శాలివాహన కార్పొరేషన్ చైర్మన్‌గా

పేరేపి బాధ్యతల స్వీకరణ

గొల్లపూడి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాలివాహన సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పేరేపి ఈశ్వర్ గొల్లపూడి బీసీ సంక్షేమ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు 15 మంది డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించారు. ఈశ్వర్ మీడియాతో మాట్లాడుతూ తనను చైర్మన్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆచార్య నాగార్జున విద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సులలో ప్రవేశానికి ఈ నెల 21వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా 10 కేంద్రాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు పరీక్ష జరగనుంది.



అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న టీటీడీ ఈవో సింఘాల్

రూ.18.5 కోట్లతో వైభవంగా బ్రహ్మోత్సవాలు

» 24న శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం

» 25న తిరుమలలో పీఏసీ-5 ప్రారంభించనున్న చంద్రబాబు

» భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు: టీటీడీ ఈవో సింఘాల్

తిరుమల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సూక్ష్మ, క్షేత్రస్థాయిలో ప్రణాళికలు రూపొందించామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేమని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం సమీక్షా సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాల వివరాలు వెల్లడించారు. సీఎం చంద్రబాబు 24న శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని, మరుసటి రోజు తిరుమలలో నిర్మించిన పీఏసీ-5ను ప్రారంభిస్తారని తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు రూ.9.50 కోట్లతో ఇంజినీరింగ్ పనులు, రూ.5.50 కోట్లతో విద్యుద్దీపాలంకరణలు చేశామన్నారు. దాతల సహకారంతో రూ.3.50 కోట్లతో పుష్పాలంకరణ చేస్తున్నామని తెలిపారు. తిరుమలలోని 3,500 గదులు సామాన్య భక్తులకు అందుబాటులో ఉంచుతామన్నారు. 1.16 లక్షల ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు, రోజూ 25 వేల ఎస్ఎస్‌డీ(స్లాటెడ్ సర్వదర్శనం) టోకెన్లు (గరుడ సేవ మినహా)విడుదల చేస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో 2 వేల మంది టీటీడీ భద్రతా సిబ్బంది, 4,700 మంది పోలీసులు, 450 మంది సీనియర్ అధికారులు, మరో 3,500 మంది శిక్షణ ఇచ్చిన శ్రీవారి సేవకులతో భక్తులకు సేవలందిస్తామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 28 రాష్ట్రాల నుంచి 298 బృందాలు కళాప్రదర్శనలు ఇస్తాయని తెలిపారు.

వైభవంగా కసుమూరు గంధ మహోత్సవం

» పాల్గొన్న సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్

వెంకటాచలం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కసుమూరులోని మస్తాన్ వలి 248వ గంధ మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. గురువారం అర్ధరాత్రి బంగళా (చందన్ మహల్)లో గంధాన్ని ఉంచి ముజావర్లతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం గంధాన్ని గుర్రంపై ఉంచి ఊరేగించారు. శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో దర్గా వద్దకు గంధం చేరుకోగా, మస్తాన్ వలి సమాధిపై పూల చద్దర్లు, దుప్పట్లను కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ సిజారా (వంశస్థుల పేర్లు) చదివి, గంధాన్ని సమాధికి పూశారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ గంధ మహోత్సవంలో పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ముజావర్లు గంధాన్ని భక్తులకు పంచి పెట్టారు.



మస్తాన్ వలి సమాధి వద్ద కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీతో ఏఆర్ రెహమాన్

23 నుంచి జ్యోతిర్లింగ టూర్

» అక్టోబరు 7 నుంచి 'భవ్య గుజరాత్'

» అందుబాటులో ఐఆర్‌సీటీసీ ప్యాకేజీ టూర్లు

నెల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక టూర్ ప్యాకేజీలతో రైళ్లను నడుపుతున్నట్టు ఐఆర్‌సీటీసీ విజయవాడ, తిరుపతి ఏరియా మేనేజర్లు వేణుగోపాల్, రాజా తెలిపారు. నెల్లూరులో శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూర్ ప్రాంతాలకు ప్రత్యేక టూర్ ప్యాకేజీ అందజేస్తున్నట్టు తెలిపారు. 7 రాత్రులు, 8 పగళ్లకు గాను రైళ్లలో స్లీపర్‌కు రూ.14,100, థర్డ్ ఏసీ రూ.22,500, సెకండ్ క్లాస్ ఏసీ రూ.29,500 చార్జీ ఉంటుందని వెల్లడించారు. అక్టోబరు 7 నుంచి 16వ తేదీ వరకు భవ్య గుజరాత్ పేరుతో ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు ద్వారక, సోమనాథ్ ఆలయం, సబర్మతి ఆశ్రమం, మొధేరా (సూర్య దేవాలయం), సర్దార్ వల్లభాయ్ పటేల్ (ఏక్తానగర్) విగ్రహం ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేశారన్నారు. 9 రాత్రులు, 10 పగళ్లకు స్లీపర్‌కు రూ.18,400, థర్డ్ ఏసీ రూ.30,200, సెకండ్‌క్లాస్ ఏసీ రూ.39,900 ఉంటుందని తెలిపారు. 9281495853, 9281495848, 9281030714 ఫోన్ నంబర్లు లేదా ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ సంప్రదించాలని కోరారు.



టీటీడీ బెంగళూరు పాలకవర్గ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న అక్కడి టీడీపీ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కనకమేడల వీరాంజనేయులు

ఆంగ్ల 'డి' అక్షరం పలకలేదని చావబాదాడు!

» విద్యార్థిపై హెడ్ మాస్టర్ పైశాచికం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంగ్లంలో 'డి' అక్షరం పలకలేదని ఆగ్రహించిన ఒక ప్రైవేటు స్కూలు హెడ్ మాస్టర్ 11 ఏళ్ల విద్యార్థిని వెదురు కర్రతో చావబాదాడు. బాధితుల కథనం మేరకు.. ఏలూరుకు చెందిన ఇద్దం అహిల్.. ఏలూరు జిల్లా ఏలూరు దాదా పలావ్ సెంటర్ సమీపంలో ఉన్న శ్రీసరస్వతి విద్యానికేతన్ హైస్కూలులో ఆరో తరగతి చదువుతున్నాడు. ఆ విద్యార్థి కొన్ని పదాలు సరిగా పలకలేడు. ఈ నెల 18న అహిల్ ఇంగ్లీషులో 'డి' అనే అక్షరం పలకలేకపోవడంతో స్కూలు హెడ్ మాస్టర్ ఉదయ్ వెదురు బెత్తంతో చేతులు, వీపుపై విపరీతంగా కొట్టడంతో శరీరం అంతా కమిలి పోయింది. శుక్రవారం ఉదయం బాలుడు స్నానం చేసే సమయంలో తల్లిదండ్రులు గమనించి ప్రశ్నించడంతో హెచ్ఎం కొట్టారని చెప్పాడు. నేరుగా పాఠశాలకు వెళ్లి ప్రశ్నించగా హెడ్ మాస్టర్ దుర్భాషలాడి ఎదురు తిరగడంతో అక్కడ నుంచే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఉదయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



దెబ్బలు చూపిస్తున్న ఇద్దం అహిల్

కుండపోత వర్షానికి నలుగురి బలి

రాయచోటి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో దారుణం చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా రెండు వేర్వేరు సంఘటనల్లో నలుగురు దుర్మరణం పాలయ్యారు. ఈ దుర్ఘటనలో 8 ఏళ్ల బాలిక మృతదేహం ఆచూకీ తెలియలేదు. దీంతో అర్ధరాత్రి దాటినా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. సాయంత్రం రాయచోటిలో కుండపోత వర్షం మొదలైంది. స్థానిక కొత్తపేట రామాపురం నాలుగు కుళాయిల వద్ద విద్యార్థులతో వెళుతున్న ఆటోలోకి నీళ్లు వచ్చేశాయి. భయాందోళనకు గురై పిల్లలు ఒక్కసారిగా కిందకు దిగేశారు. దీంతో యామిని(8) అనే బాలిక మురుగు కాలువలో పడిపోయింది. నీటి ఉధృతికి అందరూ చూస్తుండగానే కొట్టుకుపోయింది. మరో ఘటనలో ఎస్ఎన్ కాలనీ గుండ్లకుంట రోడ్డు ప్రాంతంలో మున్ని (27), ఆమె కుమారుడు ఇలియాస్(6) ఇంటి ముందు మురుగు కాలువపై బండలపై నిలబడి ఉండగా.. ఆ బండలు కూలిపోవడంతో ఇద్దరూ నీళ్లలో కొట్టుకుపోయారు. వీరిని రక్షించేందుకు ప్రయత్నించి గణేశ్(30) అనే వ్యక్తి కూడా మృతిచెందాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

లద్దాఖ్‌పై 'చిన్నచూపు'

కోట్లాది ప్రజలకు జీవధారను అందిస్తున్న నదులకు జన్మ స్థలంగా ఉన్న లద్దాఖ్ 'మూడో ధ్రువం'గా పేరుపొందింది. అటువంటి సున్నిత కీలక ప్రాంతంలో పర్యావరణ పరంగా, జీవనరీతుల పరంగా తమ ప్రత్యేకతలను కాపాడుకునేందుకు దశాబ్దాలుగా లద్దాఖీలు స్వతంత్ర అస్తిత్వానికి ఆరాట పడుతున్నారు. దేశ సరిహద్దుల్లో, అందునా చైనా, పాకిస్థాన్ నడుమ ఉన్న ప్రాంతం కావడంతో పాలకులు వారి ఆకాంక్షను నెరవేర్చేందుకు సుముఖత చూపలేదు. 2019 అనంతరం మారిన పరిస్థితుల్లో వారి అస్తిత్వ ఆరాటాలు కొత్త శక్తిని సంతరించుకున్నాయి.

నిన్న మొన్నటి దాకా జమ్మూ–కశ్మీర్‌లో భాగంగా ఉండి ఇప్పుడు కేంద్ర ప్రాంతం (యుటి)గా ఉన్న లద్దాఖ్ ప్రజలు నాలుగు డిమాండ్లు చేస్తున్నారు: లద్దాఖ్‌కు ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి; భారత రాజ్యాంగం ఆరవ షెడ్యూల్‌లో లద్దాఖ్‌ను చేర్చడం; లద్దాఖ్‌కు ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు; లద్దాఖ్‌కు రెండు పార్లమెంటరీ సీట్లు (ఒకటి లేహ్‌కు, మరొకటి కార్గిల్‌కు) కోరుతున్నారు. విద్యా సంస్కర్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నాయకత్వంలో ఈ డిమాండ్లపై గత రెండు సంవత్సరాలుగా లద్దాఖ్ ప్రజలు పోరాడుతున్నారు. అవి న్యాయబద్ధమైన ఆకాంక్షలేనని, వాటిని నెరవేరుస్తామని భారతీయ జనతా పార్టీ 2019 సార్వత్రిక, 2020 స్థానిక కౌన్సిల్స్ ఎన్నికలకు తన మ్యానిఫెస్టోలలో వాగ్దానం చేసింది. ఆ హామీ ఒట్టి మాటగా మిగిలిపోయింది. రాజ్యాంగ నైతికతకు రాజకీయ అనైతికత గ్రహణం పట్టింది.

వాంగ్‌చుక్ ఈ నెల 10 నుంచి లేహ్‌లో 35 రోజుల నిరాహారదీక్ష చేస్తున్నారు. ఇది ఆయన ఐదవ నిరశన వ్రతం. ప్రతిసారీ తన దీక్షా వ్యవధిని ఒక వారం రోజుల చొప్పున పెంచుతూ వస్తున్నారు. వచ్చే నెలలో లేహ్, కార్గిల్ అటానమస్ హిల్ డెవెలప్‌మెంట్ కౌన్సిల్స్‌కు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో లద్దాఖ్ ప్రజలు మళ్లీ ఉద్యమిస్తున్నారు. కేంద్రం నుంచి సానుకూల ప్రతిస్పందన వచ్చే అవకాశాలు లేవు. నిజానికి లద్దాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి ఇచ్చే ప్రసక్తే లేదని రెండేళ్ల క్రితమే కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెగేసి చెప్పారు. లద్దాఖ్‌ను ఆరవ షెడ్యూల్‌లో చేర్చకుండా యుటిగా కొనసాగిస్తే బయటి నుంచి వచ్చిన బ్యూరాక్రాట్లు ఇక్కడి కొండలు, లోయలు, విలక్షణ పర్యావరణ వ్యవస్థను కార్పొరేట్లకు విక్రయిస్తారని, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కింలో సంభవించిందే ఇక్కడా వాటిల్లడం ఖాయమని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. రాజ్యాంగ న్యాయం కోసం లద్దాఖ్ ప్రజల పోరాటం పూర్తిగా గాంధేయ పద్ధతులలో జరుగుతోంది. అయినా కేంద్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరి భారత ప్రజాస్వామ్యానికి మేలు చేస్తుందా? శోభనిస్తుందా?


విద్యారంగంలో, వాతావరణ మార్పు వైపరీత్యాలను అరికట్టడంలో ప్రశస్త కృషి ద్వారా అనేక అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్న ప్రజా మేధావి సోనం వాంగ్‌చుక్ తమకు ప్రత్యర్థి అయిన ఒక ప్రతిపక్ష నాయకుడులా కేంద్ర ప్రభుత్వం ఆయన పట్ల వ్యవహరించడం గర్హనీయం. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేయడాన్ని నేరంగా పరిగణించడం ఎలా రాజ్యాంగ బద్ధం? దేశ పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను జాతీయ భద్రత, పర్యావరణంపరంగా కీలక ప్రాంతమైన లద్దాఖ్ వాసులకు ఎందుకు కల్పించరు? రాష్ట్ర ప్రతిపత్తి కల్పించని పక్షంలో లద్దాఖ్‌లో ప్రజాస్వామ్యం ఎలా వర్ధిల్లుతుంది?

లద్దాఖ్ ప్రజల రాజ్యాంగ న్యాయ ఆరాటం పట్ల దేశ పాలకులు తమ ఉదాసీనతను కొనసాగిస్తే అది ఒక మహాతప్పిదమూ మహాపరాధమూ అవుతుంది. లద్దాఖీలకు సహానుభూతి, సంఘీభావం తెలుపడం సమస్త భారతీయుల నైతిక కర్తవ్యం. ఈ కర్తవ్యపాలన సరిగా లేకపోవడం కూడా దేశ పాలకుల ఇష్టారాజ్యం యథేచ్ఛగా కొనసాగడానికి కారణమవుతోంది. రాజ్యాంగ ధర్మాన్ని గౌరవించడమనేది ప్రతి పౌరుని అంతరంగిక ప్రేరణ కావాలి. ఈ నైతిక నియమంతోనే రాజ్యాంగ న్యాయం సమస్త ప్రాంతాలకు, సకల సామాజిక వర్గాలకు సమరీతిలో లభించేందుకు ఆస్కారముంటుంది.

'అణు మహర్షి' ఎ.ఎస్.రావు

'దేశ అభివృద్ధికి, పురోగతికి శాస్త్ర, సాంకేతిక రంగాలు అత్యంత కీలకం. ఈ రంగాల్లో స్వావలంబన సాధించాలి. విదేశీ టెక్నాలజీపై ఆధారపడటం శ్రేయస్కరం కాదు'. ఇది భారతదేశం గర్వించదగిన ఒక అగ్రశ్రేణి ప్రభుత్వ అణుశాస్త్రవేత్త పద్మభూషణ్ డాక్టర్ అయ్యగారి సాంబశివ రావు (ఎ.ఎస్.రావు) ఆకాంక్ష. దేశంలో జరిగే అణు ప్రయోగాలు కేవలం అణ్వాయుధాల తయారీకే పరిమితం కాకుండా మానవ కళ్యాణానికి, వ్యవసాయ, ఔషధ రంగాలకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వానికి విలువైన సూచనలు చేసిన దార్శనికుడు ఆయన.

భారతదేశంలోని అన్ని రంగాలకు అవసరమైన కీలక ఉత్పత్తులు, వైద్య రంగానికి అవసరమైన కీలక పరికరాలు, పార్లమెంట్, అసెంబ్లీ, విమానాశ్రయాలు, కీలక ప్రదేశాల్లో వాడే భద్రతా వస్తువులను రూపొందించడంలో ఎ.ఎస్.రావు ముఖ్య భూమిక నిర్వహించారు.



థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో, అణు ధార్మిక సంబంధిత కర్మాగారాల్లో కార్మికుల భద్రత, రక్షిత పరికరాల రూపకల్పనలో మంచి దిట్టగా పేరుగాంచారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కంప్యూటర్లు తయారు చేయడంలో, ప్రతిష్ఠాత్మక ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తయారీలోనూ ఆయన శ్రమ ఇమిడి ఉంది. బుల్లితెర బొమ్మ అందాలు చూపిన తొలి రోజుల్లో రూపొందించిన ఈసీ టీవీ ఆయన ముద్దుబిడ్డే. ఈసీఐఎల్ ప్రగతిలో అణువణువునా ఎ.ఎస్.రావు కృషి ఉంది. 1955లో హోమీజె బాబాతో కలిసి రూపొందించిన తొలి అణు రియాక్టర్ 'అప్సర' ఎ.ఎస్.రావు సారథ్యంలో శాస్త్రవేత్తలు రూపొందించినదే. ఆ తర్వాత 'సైరస్', 'జెర్లిన్' వంటి న్యూక్లియర్ రియాక్టర్ల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారు.

అల్లూరి సీతారామరాజు జన్మించిన పశ్చిమగోదావరి జిల్లా మొగల్లు గ్రామంలోనే సెప్టెంబర్ 20, 1914న డాక్టర్ ఎ.ఎస్.రావు జన్మించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ (ఫిజిక్స్) పూర్తి చేశారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం నుంచి 1947లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పొందారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో డాక్టర్ రావు కృషికి గాను 1960లో పద్మశ్రీ అవార్డుతో సత్కరించారు. 1972లో పద్మభూషణ్, తర్వాత నాయుడమ్మ మెమోరియల్ స్వర్ణపతకంతో పాటు పలు అవార్డులు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీని ఒప్పించి హైదరాబాద్‌లో ఈసీఐఎల్ స్థాపించడంలో ఎ.ఎస్.రావు పట్టుదలతో కూడిన కృషే కారణం.

అనేక అత్యున్నత పదవులు, బాధ్యతలు నిర్వహించినా, ప్రపంచ ప్రఖ్యాతి పొందినా ఆయనలో గర్వం అణుమాత్రం కూడా ఉండేది కాదు. నమ్మిన ఆదర్శాలకే కట్టుబడ్డారు. ఉత్తమ సంస్కారిగా నిలబడ్డారు. సైన్సు నాలుగు గోడల మధ్య బోధించే ప్రక్రియ కాదు, పరిసరాలను నిర్దేశించి, నియమాలను శోధించడమే సైన్సు లక్ష్యమని బలంగా విశ్వసించిన శాస్త్రవేత్త ఎ.ఎస్.రావు. మూఢ నమ్మకాల జాడ్యం పోవాలంటే సైన్సు జనాదరణ పొంది అన్ని రంగాల్లోనూ ప్రవేశించాలి. సామాజిక, రాజకీయ, ఆర్థిక విప్లవాలకు సైన్సు మూలాధారం, దాని బీజాలు పాఠశాలల్లోనే వేయాలి అంటారు డాక్టర్ రావు. తన జీవితంలో శాస్త్ర, సాంకేతిక ప్రగతి కోసం కృషి చేసి, కొత్తతరం శాస్త్రవేత్తలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఆయన 2003 అక్టోబర్ 31న కనుమూశారు. అవనిపై అణుశాస్త్ర విజ్ఞానంలో విప్లవం సృష్టించి, న్యూక్లియర్ ఎనర్జీతో శాంతి సాధించవచ్చు అని ప్రపంచానికి చాటి చెప్పిన ఎ.ఎస్.రావు 'అణు మహర్షి' అయినారు.

– పెన్మత్స శ్రీహరిరాజు
సీనియర్ పాత్రికేయులు

(నేడు డాక్టర్ ఎ.ఎస్.రావు జయంతి)

'వక్ఫ్' గ్రహణంలో భారత్ కీర్తి చంద్రికలు



■ పి. చిదంబరం

'పళని' పలుకు

భారత జాతీయ చట్టసభ పార్లమెంటు ఆమోదించిన ఒక చట్టంలోని వొక నిబంధనను సుప్రీంకోర్టు గానీ లేదా హైకోర్టు గానీ కొట్టివేస్తే అది ప్రభుత్వానికి గానీ, పార్లమెంటు సభ్యులకు గానీ ప్రతిష్ఠాకరమేనా? శాసన నిర్మాణ బాధ్యతలను వారు నిర్వర్తించిన తీరును ఆక్షేపించడమే కాదూ ఆ న్యాయ నిర్ణయం? ఒక బిల్లులోని నిబంధనలు రాజ్యాంగ నిర్దేశాలకు విరుద్ధంగా ఉన్నట్టయితే శాసన నిర్మాతలు ఆ బిల్లును తప్పక వ్యతిరేకిస్తారు. అయినా ప్రభుత్వం ఆ బిల్లును పార్లమెంటులో మళ్లీ ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకోవచ్చు. అయినా ఉన్నత న్యాయస్థానాలు అంతిమంగా ఆ బిల్లును కొట్టివేస్తే అది ప్రభుత్వానికి ఎంత అవమానం, ఎన్ని తలవంపులు?! అంతకంటే అధ్వానకరమైన పరిస్థితిని పరిశీలనలోకి తీసుకోండి: పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లుకు తీవ్ర వ్యతిరేకత వస్తుంది. అప్పుడు ఆ బిల్లును సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ)కి పరిశీలనకు నివేదిస్తారు. జేపీసీలోని పలువురు సభ్యులు ఆ బిల్లు పట్ల తమ తీవ్ర అసమ్మతి తెలుపుతారు. పార్లమెంటు ఆమోదించేందుకు ఆ బిల్లు అర్హమైనది కాదని స్పష్టం చేస్తారు. సభ్యుల ఆక్షేపణలు, అభ్యంతరాలను తోసిపుచ్చి ప్రభుత్వం ఆ బిల్లును ఆమోదింప చేసుకుంటుంది. ఆ తరువాత ఉన్నత న్యాయస్థానాలు ఆ బిల్లులోని నిబంధనలను కొట్టివేయడమో లేక వాటి అమలును తాత్కాలికంగా నిలిపివేయడమో చేస్తాయి. ప్రభుత్వానికి ఇంతకంటే ఘోరమైన అవమానం మరేముంటుంది? న్యాయ మంత్రిత్వశాఖ విధి నిర్వహణా దక్షత ఎంత సమర్థంగా ఉన్నదో అది తెలియజేస్తుంది!


ఇదీ వక్ఫ్ (సవరణ) చట్టం–2025 కథ. సెప్టెంబర్ 15, 2025న ఆ చట్టంలోని కొన్ని కీలక నిబంధనలపై సుప్రీం స్టే విధించింది. అయినప్పటికీ ప్రభుత్వం గంభీరంగా తనను తాను అభినందించుకున్నది. 'ముస్లిమ్ పర్సనల్ లా'లోని ప్రధాన భాగాన్ని సంస్కరించేందుకు తాము చేసిన ప్రయత్నాలను సుప్రీంకోర్టు ఆమోదించిందని ప్రభుత్వం చెప్పుకున్నది. పార్లమెంటులో లేవనెత్తిన అనేక ప్రశ్నలను ఏప్రిల్ 5, 2025న ఇదే కాలమ్‌లో నేను రాసిన వ్యాసం ('ముస్లింలపై మరో దాడి!')లో ప్రస్తావించాను. విపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సమాధానాలు రాలేదు. ఆ బిల్లులోని వివిధ నిబంధనలను ప్రభుత్వం మొండిగా సమర్థించుకున్నది అయితే మా ప్రశ్నలకు సుప్రీం కోర్టు మధ్యంతర సమాధానాలు ఇచ్చింది:

1) వక్ఫ్ సవరణ చట్టం కింద 'ఒక వక్ఫ్‌ను సృష్టించే వ్యక్తి తాను కనీసం ఐదు సంవత్సరాలుగా ఇస్లాంను అనుష్ఠానిస్తున్నానని నిరూపించుకోవాలి'. తాను ఇస్లాంను అనుసరిస్తున్నానని ఒక వ్యక్తి ఎలా 'నిరూపించాలి' అని మేము ప్రశ్నించాము. చట్టంలోని 3వ సెక్షన్‌లో 'ఆర్' అనే నిబంధనపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆస్తిని వక్ఫ్‌గా ప్రకటించే ముందు ఐదేళ్ల పాటు ఇస్లాం మతాన్ని అనుసరించి ఉండాలన్న షరతుకు కొత్త నియమాలు రూపొందించేంత వరకు ఈ స్టే వర్తిస్తుందని కోర్టు పేర్కొంది. ఆ షరతుకు వర్తించే నియమాలను రూపొందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉన్నది. ఇతర మతాల పర్సనల్ లాస్ (వివాహం, ఆస్తుల వారసత్వం మొదలైన కొన్ని వ్యక్తిగత విషయాలకు సంబంధించి ఆయా వ్యక్తులకు సంబంధించిన మతాచారం ప్రకారం వర్తించే శాసనపరంగా గుర్తింపు కలిగిన నియమ నిబంధనలు)లో ఇటువంటి నిబంధనేదీ లేదు.

> భారతీయులమైన మనం లౌకికవాదులమని, సహనశీలురమని ప్రగాఢంగా విశ్వసిస్తాం. అయితే ప్రపంచం మాత్రం భారత్‌ను భారత పార్లమెంటు చట్టాలు, భారత ప్రభుత్వ చర్యలు, భారత ప్రజల సామాజిక ప్రవర్తనారీతుల ప్రాతిపదికన చూస్తుంది. మన దేశం పట్ల అభిప్రాయాలు ఏర్పరచుకుంటుంది. ప్రపంచం దృష్టిలో భారత్‌కు ఇంతకు ముందున్న సమున్నత గౌరవ ప్రతిష్ఠలు వక్ఫ్ (సవరణ) చట్టంతో క్షీణించాయి.

2) వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తి ప్రభుత్వ ఆస్తి అవునో కాదో అనేది నిర్ణయించడానికి జిల్లా మెజిస్ట్రేట్‌కు అధికారం ఉన్న సెక్షన్‌ను కూడా సుప్రీంకోర్టు నిలిపివేసింది. పౌరుల వ్యక్తిగత హక్కులపై నిర్ణయం తీసుకోవడానికి జిల్లా మెజిస్ట్రేట్‌కు అనుమతి లేదని తెలిపింది. అది అధికారాల వికేంద్రీకరణను ఉల్లంఘిస్తుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. నిర్దిష్ట వక్ఫ్ ఆస్తి 'ప్రభుత్వ ఆస్తి అవునో కాదో నిర్ణయించేందుకు నియుక్తుడైన అధికారి నిర్ణయం తీసుకునేవరకు ఆ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించకూడదు. అది ప్రభుత్వ ఆస్తి అని ఆ అధికారి నిర్ణయిస్తే ఆ ప్రకారం అతడు రెవెన్యూ రికార్డులను సవరించాలి? అని చట్టం నిర్దేశించింది. అయితే ఇది తన సొంత వ్యవహారంలో ప్రభుత్వమే న్యాయమూర్తి పాత్ర వహించడం కాదా అని మేము ప్రశ్నించాము. సెక్షన్ 3సి లోని సబ్ సెక్షన్లు 2, 3, 4పై సుప్రీంకోర్టు స్టే విధించింది.

3) రెవెన్యూ రికార్డులు 'సవరించిన 'తరువాత వక్ఫ్ ఆస్తిగా పరిగణింపబడే హక్కును కోల్పోతుంది. కార్యనిర్వాహక చర్య ద్వారా వక్ఫ్ ఆస్తిపై హక్కును తొలగించడం కాదా అని మేము ప్రశ్నించాము. ఈ అంశంపై అప్పిలేట్ ట్రిబ్యునల్, సంబంధిత హైకోర్టు నిర్ణయం తీసుకునేంతవరకు రెవెన్యూ రికార్డుల సవరణను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.



రాష్ట్ర వక్ఫ్ బోర్డులలోను, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్స్‌లోను ముస్లిమేతరులను నియమించవచ్చని, సీఈఓగా కూడా ముస్లిమేతరులను నియమించవచ్చని వక్ఫ్ సవరణ చట్టం నిర్దేశించింది. మరి హిందూమతానికి చెందిన ట్రస్టులో ముస్లిం లేదా హిందూయేతర వ్యక్తికి స్థానం కల్పించేందుకు వీలుగా ఇటువంటి నిబంధనలను సంబంధిత చట్టాలలో చేరుస్తారా అని మేము ప్రశ్నించాము. సుప్రీంకోర్టు సైతం ఇదే విషయాన్ని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లోని 11 మంది సభ్యులలో ముస్లిమేతరుల సంఖ్య ముగ్గురికి మించకూడదని, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లోని 22 మంది సభ్యులలో ముస్లిమేతరులు నలుగురికి మించి ఉండ కూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సీఈఓగా ముస్లింను నియమించేందుకు అవసరమైన ప్రతి ప్రయత్నమూ చేయాలని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

వక్ఫ్ (సవరణ) చట్టంపై మొత్తంగా కానీ లేదా కనీసం అందులోని కొన్ని కీలక నిబంధనలపై తాత్కాలిక స్టే ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ దాఖలైన దరఖాస్తుపై వాదనలను సుప్రీంకోర్టు మూడు రోజుల పాటు విన్నది. చట్టం అమలు నిలుపుదలకు దాఖలైన ఒక దరఖాస్తుపై మూడు రోజుల పాటు విచారణ జరపడం అసాధారణం. ఈ కేసు అంతిమ విచారణకు వచ్చినప్పుడు మరిన్ని వాదనలను సుప్రీంకోర్టు విననున్నది. సరే, ఈ లోగా ఈ ప్రభుత్వం తన హిందుత్వ అజెండాను మరింత ముందుకు తీసుకువెళుతూ మైనారిటీల ప్రయోజనాలకు విఘాతం కలిగించే నిర్ణయాలు తీసుకుంటుంది, చర్యలు చేపడుతుంది, సందేహం లేదు.

వక్ఫ్(సవరణ) చట్టంను కించిత్ పరిశీలిస్తే దాని దురుద్దేశం, మైనారిటీల పట్ల ద్వేషభావం ఇట్టే విశదమవుతుంది. ప్రభుత్వం నిష్ఠగా పాటించవలసిన రాజ్యాంగ అధికరణ 26 'మతపరమైన వ్యవహారాలను నిర్వహించుకునే హక్కు' అన్ని మతాలవారు తమ మతసంస్థలను స్వేచ్ఛగా నిర్వహించుకోవచ్చునని స్పష్టం చేస్తున్నది. ఆ అధికరణ ఇంకా నాలుగు విషయాలు పేర్కొంది. అవి: 1) సంస్థలను ఏర్పాటు చేసుకొనుట; 2) నిర్వహించుకొనుట; 3) సంస్థల కొరకై చర స్థిరాస్తులను సేకరించుకొనుట; 4) సేకరించిన ఆస్తుల నిర్వహణ, ఇవన్నీ మత స్వేచ్ఛలో అంతర్భాగాలు. ఈ హక్కులను నిర్వహించుకొనుటలో శాంతిభద్రతలను, నీతిని, ప్రజారోగ్యాన్ని భంగపరచరాదు. భారతదేశ మత, సాంస్కృతిక జీవనంలో విశిష్టమైన, విలక్షణమైన వైవిధ్యాన్ని సంరక్షించుకుని మరింత దృఢతరం చేసుకోదలిచినవారు మరీ ముఖ్యంగా హిందువులు వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలి, పోరాడి తీరాలి.

భారతదేశ జనాభాలో ముస్లిం మతస్థులు 20.20 కోట్ల మంది కాగా క్రైస్తవులు 3.20 కోట్ల మంది ఉన్నారని ఈ ఏడాది సాధికారిక అంచనాలు నిర్ధారించాయి. హిందూధర్మం ప్రపంచ అత్యంత పురాతన మతం కాగా క్రైస్తవం, ఇస్లాం ప్రపంచ వ్యాప్తంగా అత్యధికులు అనుసరించే మతాలుగా విలసిల్లుతున్నాయి. భారతీయులమైన మనం లౌకికవాదులమని, సహనశీలురమని ప్రగాఢంగా విశ్వసిస్తాం. అయితే ప్రపంచం మాత్రం భారత్‌ను భారత పార్లమెంటు చట్టాలు, భారత ప్రభుత్వ చర్యలు, భారత ప్రజల సామాజిక ప్రవర్తనారీతుల ప్రాతిపదికన చూస్తుంది. మన దేశం పట్ల అభిప్రాయాలు ఏర్పరచుకుంటుంది. ప్రపంచం దృష్టిలో భారత్‌కు ఇంతకు ముందున్న సమున్నత గౌరవ ప్రతిష్ఠలు వక్ఫ్ (సవరణ) చట్టంతో క్షీణించాయి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి,
కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

పురాణాలకు చరిత్రకు తేడా లేదా?!

ఆధునిక విజ్ఞానం ఒకవైపు అప్రతిహతంగా దూసుకుపోతుంటే మరోవైపు అహేతుకత్వం, ఆలోచనారాహిత్యం, అంధ విశ్వాసాలు అంతకంటే వేగంగా విస్తరిస్తూ, సమాజాన్ని ఆటవికదశకు చేరువ చేస్తున్నాయి. దీనికితోడు ఆధ్యాత్మికవాదాలు, ఆత్మ సిద్ధాంతాలు, కర్మవాదాలు, పునర్జన్మ వాదాలు ప్రజలను పీల్చి పిప్పిచేస్తున్నాయి. తమ కష్టనష్టాలకు అసలైన భౌతిక కారణాలను ప్రజలు తెలుసుకోనీయకుండా ఇవి అడ్డుపడుతున్నాయి.

రెండు వేల సంవత్సరాలుగా ఈ దేశాన్ని మనుధర్మశాస్త్రమే శాసిస్తోంది, పాలిస్తోంది. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగం అమలుతో కూడా పెద్దగా ఫలితమేమీ కన్పించడం లేదు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ వ్యవస్థలు సైతం నిర్వీర్యమవుతున్నాయి. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఓటర్ల జాబితాలో జరుగుతున్న అవకతవకలే ఇందుకు తాజా నిదర్శనం.



నేడు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో అసమానతలు, నిరంకుశ వైఖరులు, దోపిడీ పీడనలు కొనసాగుతూనే ఉన్నాయి. అన్యాయాలను, అక్రమాలను ఎదురించే, ప్రశ్నించేవారి గొంతులు నొక్కేస్తున్నారు. ఈ దేశంలో అనాదిగా కొనసాగుతున్న కుల వ్యవస్థ కోరలు చాచి కరాళ నృత్యం చేస్తోంది. అగ్రకులాలవారు అహంకారంతో రెచ్చిపోతున్నారు. దళిత కులాలవారిపై దౌర్జన్యాలను నూరిపోస్తూనే ఉన్నారు.

ఈ దేశంలో పురాణాలకు, చరిత్రకు తేడా తెలియకుండా పోతోంది. పచ్చి అబద్ధాలతో, కల్పనలతో కూడిన పౌరాణిక కథలన్నీ వాస్తవ చారిత్రక సంఘటనలుగా కీర్తించబడుతున్నాయి. పురాణాల దుష్ప్రభావం నుంచి ఇప్పటికైనా మనం బయటపడకపోతే, హేతువాద దృష్టిని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోకపోతే మనదేశం మరింత వెనక్కుపోవడం ఖాయం. సామాన్యుల దగ్గర నుంచి మేధావుల వరకు ఈ అబద్ధాల సంస్కృతిని కాపాడుతున్నవారే. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో కూడా మూఢనమ్మకాల ప్రచారం జోరుగా సాగుతోంది. సినిమాలు, సీరియళ్లు అదే బాటలో ఉన్నాయి. తల్లిదండ్రులు పిల్లలకు బాల్యం నుంచే మత విశ్వాసాలను, మూఢనమ్మకాలను నూరిపోస్తున్నారు. విద్యాలయాల్లోనూ ఈ భావాలే రాజ్యమేలుతున్నాయి. శాస్త్రీయ విజ్ఞానానికి అవకాశం లేకుండా పోతోంది. కేవలం మార్కులు, ర్యాంకులు, ఉద్యోగాల కోసమే విద్య అన్నట్లుగా వ్యాపార ధోరణిలో విద్యావిధానం కొనసాగుతోంది. కానీ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాలి.

రానున్న కాలంలో గోదావరి పుష్కరాలను మహా కుంభమేళా స్థాయిలో జరపాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. దానికోసం వందల కోట్ల రూపాయలను ఖర్చు చేయడానికి సిద్ధపడుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా తానేమీ తక్కువ తినలేదన్నట్లుగా.. పుట్టపర్తి సాయిబాబా శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వ పండుగగా జరపాలని ఉత్తర్వులు జారీ చేయడమేగాక, దానికోసం కోట్లాది రూపాయల బడ్జెట్‌ను కేటాయించినట్లు తెలుస్తోంది. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బును గుళ్లూ గోపురాలు నిర్మించడానికి, యజ్ఞయాగాలు నిర్వహించడానికి ఖర్చు చేయడం భారత రాజ్యాంగం నిర్దేశించిన లౌకిక వాదాన్ని మంటగలపడమే అవుతుంది. 'శాస్త్రీయ స్పృహను, మానవవాదాన్ని ప్రజల్లో పెంపొందించడం ప్రతి భారతీయ పౌరుడి ప్రాథమిక విధి' అని రాజ్యాంగంలో పేర్కొన్న నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుంది.

మనుషులను కులాలు, మతాలు, వర్గాలు, ప్రాంతాల వారీగా విభజించి, వారి మధ్య అసూయ, ద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉపన్యాసాలివ్వడం, తద్వారా తమ రాజకీయాధికారాన్ని నిలబెట్టుకోడానికి ప్రయత్నించడం బీజేపీ వంటి మతతత్వ పార్టీలకు వెన్నతోపెట్టిన విద్య. ఇప్పుడు ప్రజలు పార్టీల పరంగా కూడా చీలిపోయారు. మతాలు, రాజకీయాలు కలిసిపోయి మతరాజకీయాలే దేశాన్ని ఫాసిజం వైపు నడిపిస్తున్నాయి. మత నియంతృత్వం వైపు లాక్కెళుతున్నాయి.

ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజల్లో హేతువాదాన్ని రగిలించి, ఇంగితజ్ఞానాన్ని పెంచి, చైతన్యవంతం చేయవలసిన బాధ్యత అభ్యుదయకాముకులైన హేతువాదులు, మానవవాదుల మీద ఉంది. ఆ దిశగా జరుగుతున్న కృషిలో భాగంగానే భారత హేతువాద సంఘం గత 95 సంవత్సరాలుగా భావ విప్లవపోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంది. దాదాపు రెండు వందలకు పైగా హేతువాద, మానవవాద పుస్తకాలను ప్రచురించింది. నిరంతరం సభలు, సమావేశాలు, అధ్యయన తరగతులు నిర్వహిస్తోంది.

ప్రస్తుతం తెలంగాణ హేతువాద సంఘ 5వ ద్వైవార్షిక మహాసభలు, అధ్యయన తరగతులు సెప్టెంబరు 21వ తేదీ ఆదివారం పాల్వంచలోని కొమురం భీం మీటింగ్ హాలులో ఉదయం పది గంటలకు జరుగనున్నాయి. ఈ సభలో 'మత విశ్వాసాలు–హేతువాదం', 'భౌతిక వాస్తవికవాదం–మానవవాదం' అనే అంశాలపై అడియాల శంకర్, గడీల సుధాకర్‌రెడ్డి, శశీంద్రన్ కక్కోడి, జానీమియా, నబీసాబ్ తదితరులు ప్రసంగిస్తారు.

– డా. గుమ్మా వీరన్న
భారత హేతువాద సంఘం అధ్యక్షుడు

జీఎస్టీ వ్యవస్థలో విప్లవం

నిజాయితీ, పరిపాలనలో అసాధారణ దక్షత, దేశం పట్ల స్పష్టమైన దార్శనికత– నాయకుడికి ఉండాల్సిన లక్షణాలు. ఇవి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యక్తిత్వంలో సహజంగా కనిపిస్తాయి. గతంలోని సంక్లిష్టమైన, అవినీతికి ఆస్కారమిచ్చే పన్నుల వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి, జీఎస్టీ వంటి పారదర్శక, ఏకీకృత వ్యవస్థను ప్రవేశపెట్టడం ఆయన బలమైన సంకల్పానికి స్పష్టమైన నిదర్శనం. ఒక ఇంటిని నిర్మించేటప్పుడు ఇటుక మీద ఇటుకను జాగ్రత్తగా ఎలా పేరుస్తారో, అంతకన్నా శ్రద్ధగా మోదీ దేశ ఆర్థిక రంగాన్ని పునర్నిర్మిస్తున్నారు. ఆ అభివృద్ధి ఫలాలను ప్రతి పౌరుడికీ సమానంగా అందించాలన్నదే ఆయన అంతిమ లక్ష్యం. విమర్శలు చేసేవారు, గులామీ మనస్తత్వంతో ఉండే మేధావులు ఈ నిర్మాణాత్మక మార్పులను గుర్తించకపోవచ్చు, కానీ వాస్తవానికి విద్య, వైద్యం, రక్షణ, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు– ప్రతి దాంట్లోనూ మోదీ ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. పన్ను చెల్లించే సామాన్యుడికి భారాన్ని తగ్గిస్తూ, అదే సమయంలో దేశ ఖజానాను బలోపేతం చేసి, అభివృద్ధి ప్రయోజనాలను సమాజం దిగువ వర్గాల వరకు చేర్చడం ఆయన పరిపాలనా దక్షతకు నిదర్శనం. ద్వేషపూరిత దూషణలు, హేళనల కన్నా, దేశ ప్రజల ఆశీర్వాదాలు, అభిమానమే గొప్ప శక్తి అని మోదీ పాలన పదే పదే నిరూపిస్తోంది. ఇది కేవలం రాజకీయ విజయం కాదు. దేశాభివృద్ధికి అంకితమైన ఒక నిజమైన నాయకుడి విజయగాథ.

> విద్య, వైద్యం, రక్షణ, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం ఇలా... ప్రతి రంగంలో మోదీ ముద్ర కనిపిస్తుంది. కాంగ్రెస్ అధిక పన్నులు, అవినీతితో దేశాన్ని దెబ్బతీసింది. మోదీ ప్రభుత్వం పన్నుల సంస్కరణలు దేశానికి ఆర్థిక ఊతం, ప్రజలకు లాభం అందిస్తున్నాయి.



భారతదేశ ఆర్థిక వ్యవస్థలో పన్నుల విధానం ఒక కీలక అంశం. ఇది కేవలం ప్రభుత్వ ఖజానాను నింపే మార్గం మాత్రమే కాదు, దేశ ప్రగతిని, పౌరుల జీవన ప్రమాణాలను నిర్దేశించే శక్తిమంతమైన సాధనం కూడా. ఈ నేపథ్యంలో మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పన్నుల సంస్కరణలు, గత కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో పోల్చి చూసినప్పుడు, ఒక సాహసోపేతమైన, దూరదృష్టితో కూడిన మార్పుగా స్పష్టంగా కనిపిస్తుంది. కాంగ్రెస్ చేసే విమర్శలకు అతీతంగా, వాస్తవాలను పరిశీలిస్తే, మోదీ ప్రభుత్వం పన్నుల వ్యవస్థను సరళీకరించి, పారదర్శకంగా మార్చి, దేశ ప్రజలకు, ఆర్థిక వ్యవస్థకు ఎలా లబ్ధి చేకూర్చిందో అర్థమవుతుంది.

మోదీ అధికారంలోకి రాకముందు, యూపీఏ ప్రభుత్వ హయాం(2004–2014)లో పన్నుల వ్యవస్థ బహుళ పన్నులు, అధిక రేట్లు, సంక్లిష్టతలతో నిండి ఉండేది. 'పన్ను మీద పన్ను' అనేది సర్వసాధారణం. ఈ విధానం కేవలం వ్యాపారులకే కాక, అంతిమంగా వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలపై తీవ్ర భారం మోపేది. అంతేకాకుండా, ప్రత్యక్ష పన్నుల విషయంలో, ముఖ్యంగా ఆదాయపు పన్నులో కాంగ్రెస్ హయాంలో పన్ను మినహాయింపు పరిమితి చాలా తక్కువగా ఉండేది. ఉదాహరణకు– ఒకప్పుడు కేవలం రూ.2 లక్షల వార్షిక ఆదాయం దాటితేనే పన్ను పరిధిలోకి వచ్చేవారు. ఇది మధ్యతరగతి, వేతన జీవులకు భారంగా ఉండేది. అయితే, నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పన్నుల సంస్కరణలతో దేశాన్ని సరికొత్త మార్గంలో నడిపించింది. జీఎస్టీ వంటి ఏకీకృత పన్ను వ్యవస్థ, ఆదాయపు పన్ను రాయితీలు, రాష్ట్రాలకు నిధుల పంపిణీలో పారదర్శకత తీసుకురావడం... మోదీ ప్రభుత్వం తీసుకున్న ముఖ్యమైన సానుకూల నిర్ణయాలు.

మోదీ ప్రభుత్వం వచ్చాక, ఇప్పుడు రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్నవారు పన్ను కట్టకుండా సేవింగ్స్ చేసుకోవచ్చు. కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేస్తున్నప్పటికీ, ఈ సంస్కరణలు దేశ ఆర్థిక ఊతానికి దోహదపడ్డాయి. మోదీ దూరదృష్టి వల్ల ప్రజలు తక్కువ పన్ను భారంతో జీవిస్తున్నారు. మోదీ ప్రభుత్వం 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టి, బహుళ పన్నులను ఒకే వ్యవస్థగా మార్చారు. దీని వల్ల వ్యాపారాలు సులభతరమయ్యాయి, ఆర్థిక వృద్ధి పెరిగింది. ప్రారంభంలో స్లాబ్‌లు 5, 12, 18, 28 శాతంగా ఉండేవి.

మోదీ ప్రభుత్వం కేవలం పన్నుల వ్యవస్థను సంస్కరించడమే కాకుండా, ఆ ఫలాలను సామాన్య ప్రజలకు అందించడంలో చిత్తశుద్ధితో పనిచేస్తోంది. ఈ నెలలో మోదీ ప్రభుత్వం జీఎస్టీ 2.0ను తీసుకొచ్చి, స్లాబ్‌లను కేవలం రెండుకు (5, 18 శాతానికి) తగ్గించింది. గతంలో 18 లేదా 28 శాతం పన్ను శ్లాబులలో ఉన్న నూనెలు, సబ్బులు, టూత్‌పేస్టులు వంటి అనేక నిత్యావసర వస్తువులను 5 లేదా 12 శాతం శ్లాబులలోకి మార్చారు. ఎలక్ట్రానిక్ వస్తువులపై పన్నును 28 నుంచి 18 శాతానికి తగ్గించారు. అంటే నిత్యావసరాలపై సున్నా పన్ను విధించారు. ప్యాక్ చేయని ఆహారధాన్యాలు, పాలు, కూరగాయలు వంటి వాటిపై జీఎస్టీ ఉండదన్నమాట. విద్యకు అవసరమైన పుస్తకాలు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లపై పన్నును జీరో చేశారు. అలాగే, ఆరోగ్య, వ్యక్తిగత ఇన్సూరెన్స్ ప్రీమియంలపై పన్ను తొలగించడం, వైద్య పరీక్షల కిట్లపై పన్నును 5 శాతానికి తగ్గించడం వంటి చర్యలు ప్రజారోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను చాటుతున్నాయి.

జీఎస్టీలో సగం రాష్ట్రాలకు, సగం కేంద్రానికి వెళ్తుంది. కేంద్రానికి వచ్చిన పన్నుల్లో 42 శాతం మళ్లీ రాష్ట్రాలకు ఇస్తుంది. జీఎస్టీని కాంగ్రెస్ 'గబ్బర్ సింగ్ టాక్స్' అని విమర్శించింది, రేట్లు అధికమని చెప్పింది. కానీ బీజేపీ స్పందిస్తూ, కాంగ్రెస్ పార్టీయే జీఎస్టీని ఆలస్యం చేసిందని, ఇప్పుడు రాహుల్‌గాంధీ ఒత్తిడి వల్లే సంస్కరణలు వచ్చాయని చెప్పడం హాస్యాస్పదమని అంటోంది. వాస్తవానికి, మోదీ నాయకత్వంలోనే జీఎస్టీ సఫలమైంది.

కాంగ్రెస్ హయాంలో 13వ ఫైనాన్స్ కమిషన్ ప్రకారం రాష్ట్రాలకు 32 శాతం టాక్స్ డెవల్యూషన్ ఉండేది. మోదీ ప్రభుత్వంలో 14వ ఫైనాన్స్ కమిషన్ దానిని 42శాతానికి పెంచింది (ఎఫెక్టివ్ 41శాతం). రూపాయి టాక్స్‌లో కేంద్రానికి సుమారు 26 పైసలు మాత్రమే వస్తాయి, మిగతా 74 పైసలూ రాష్ట్రాలకు వెళ్తాయి. పెట్రోల్, డీజిల్‌పై రాష్ట్రాలు 20–30శాతం వ్యాట్ వేస్తాయి, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ తక్కువ (పెట్రోల్‌పై రూ.19.90/లీ, డీజిల్‌పై రూ.15.80/లీ). రాష్ట్రాలు దోపిడీ చేస్తున్నప్పటికీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు కేంద్ర ప్రభుత్వం దోచుకుంటోందని ప్రచారం చేస్తున్నారు. కానీ వాస్తవమేమిటంటే, మోదీ ప్రభుత్వం ఫెడరలిజాన్ని బలోపేతం చేసింది. విద్య, వైద్యం, రక్షణ, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం ఇలా... ప్రతి రంగంలో మోదీ ముద్ర కనిపిస్తుంది. కాంగ్రెస్ అధిక పన్నులు, అవినీతితో దేశాన్ని దెబ్బతీసింది. మోదీ ప్రభుత్వం పన్నుల సంస్కరణలు దేశానికి ఆర్థిక ఊతం, ప్రజలకు లాభం అందిస్తున్నాయి.

■ జయప్రకాశ్ నారాయణ వల్లూరు
బీజేపీ అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్



కళ మరుగై..

నాటి దసరా ఉత్సవాల్లో పగటి వేషగాళ్లే హైలైట్

- వివిధ వేషాల్లో వచ్చి హాస్యం
- పద్యాలు, వ్యంగ్యాస్త్రాలతో సామాజిక చైతన్యం
- ధాన్యం, డబ్బు సంభావనగా..
- ప్రస్తుతం కనుమరుగైన కళలు

శక్తి, వీర, భేతాళ, గంగిరెద్దులు, అర్ధనారీశ్వర, బుడబుక్కల, పిట్టలదొర.. ఒకప్పుడు దసరా సంబరాలు మొదలైతే వీరిదే హవా. పద్యాలు, వ్యంగ్యాస్త్రాలు, హాస్యంతో అందరినీ ఆనంద పరిచేవారు. ధాన్యం, డబ్బు సంభావనగా అందుకుని సామాజిక చైతన్యానికి పూనుకునేవారు. ఇప్పుడు ఆ కళలు, కళాకారులు కనుమరుగయ్యారు. దసరా ఉత్సవాలు మొదలవుతున్న నేపథ్యంలో నాటి కళా వైభవంపై కథనం..

6


గతంలో కంటే ఘనంగా దసరా ఉత్సవాలు

- సమీక్షా సమావేశంలో మంత్రి ఆనం

6

దేశంలోనే అత్యంత సుందర నగరంగా అమరావతి

- అమరావతి ప్రాపర్టీ షోలో ఎంపీ కేశినేని చిన్ని, మంత్రి నారాయణ, గద్దె రామ్మోహన్



● ఇంద్ర వైభవం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిని శుక్రవారం విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

మళ్లీ మట్టి దందా

పోలవరం కుడి కాల్వకట్ట వెంబడి మట్టిపై మళ్లీ వైసీపీ గద్దల కన్నుపడింది. ఇసుక అక్రమ దందాలో ఆరితేరిన మాజీమంత్రి కొడాలి నానీకి సన్నిహితమైన ఓ సంస్థ, ఆయన అనుచరులు ఈ దారుణాలకు పాల్పడుతున్నారు. పోలవరం కుడికాల్వ కట్ట మట్టిని అక్రమంగా తరలించుకుపోతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ తవ్వకాలపై ఇటీవలే విజిలెన్స్ విచారణ జరగ్గా, మళ్లీ అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. కూటమి ప్రభుత్వంలోనే కాంట్రాక్టులను పొంది యథేచ్ఛగా విక్రయించుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వంలోనూ చెలరేగుతున్న వైసీపీ మాఫియా



పోలవరం కాల్వగట్టును తవ్వేస్తున్న కొడాలి నాని అనుచరులు

- ఇసుక అక్రమ దందాలో ఆరితేరిన సంస్థ నిర్వాకం
- బుడమేరు కట్ట పనుల పేరిట అనుమతులు
- పాతపాడులోని రియల్ వెంచర్‌కు మట్టి తరలింపు
- నానాటికీ ప్రమాదకరంగా మారుతున్న కాల్వకట్ట

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రభుత్వం మారినా వైసీపీ అక్రమార్కుల మట్టి దోపిడీ మాత్రం ఆగట్లేదు. వైసీపీ నేత, మాజీమంత్రి కొడాలి నానీకి అత్యంత సన్నిహితంగా ఉండే ఓ కంపెనీ ఇటీవల మళ్లీ రంగంలోకి దిగింది. అనుమతులు ఉన్నాయన్న పేరుతో విజయవాడ రూరల్ మండల పరిధిలోని పోలవరం కుడికాల్వ వెంబడి అడ్డగోలుగా మట్టిని తవ్వేస్తున్నారు. భారీ ఎత్తున తవ్వకాలు జరుగుతున్నా యంత్రాంగం పట్టించుకోవట్లేదు. మొదట్లో అనుమతులు ఉన్నాయని మిగతా 6లో..

విజయవాడ, గుంటూరుల్లోని రోడ్ల టెండర్ల రద్దు

- సీఆర్డీఏ చర్యతో కంగుతిన్న కాంట్రాక్టు సంస్థలు 6

ఈ-దసరా

పూర్తి టెక్నాలజీతో..

- రంగంలోకి 42 డ్రోన్లు.. భక్తుల లెక్కింపు
- రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో హెడ్‌కౌంట్ కెమెరాలు
- మోడల్ గెస్ట్‌హౌస్‌లో సీసీసీకి అనుసంధానం

శరన్నవరాత్రుల 11 రోజులూ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఎంతమంది భక్తులు వస్తారు? మూలానక్షత్రం, విజయదశమి రోజున రద్దీ ఎలా ఉంటుంది? ఏ ప్రాంతం వైపు నుంచి అధిక సంఖ్యలో భక్తులు చేరుకుంటున్నారు? ఈ ప్రశ్నలన్నింటికీ టెక్నాలజీ ద్వారా సమాధానం చెప్పాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఏడాది జరగబోయే ఉత్సవాలకు టెక్నాలజీని విరివిగా ఉపయోగించి సాఫ్ట్‌గా బందోబస్తును నిర్వహించాలని యోచిస్తున్నారు.



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : గత ఏడాది సెప్టెంబరులో వచ్చిన వరదల సమయంలో పోలీసులు డ్రోన్లను ఉపయోగించడం మొదలుపెట్టారు. ఆ తర్వాత దసరా ఉత్సవాల్లో వాటి వినియోగాన్ని కొనసాగించారు. ముఖ్యంగా మూలానక్షత్రం, విజయదశమి రోజున భక్తులు భారీగా ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. ఆ సమయంలో రద్దీని డ్రోన్ల ద్వారా తెలుసుకుని అప్పటికప్పుడు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పోలీసు కమిషనరేట్‌కు మొత్తం ఆరు డ్రోన్లు ఉన్నాయి. ఇవికాకుండా ప్రభుత్వం కొద్దినెలల క్రితం అత్యాధునిక టీథర్డ్ డ్రోన్‌ను కేటాయించింది. వాటితో పాటు మరో 42 డ్రోన్లను రంగంలోకి దించాలని మిగతా 6లో..

మ్యూజిక్ మ్యాజిక్

విజయవాడ ఉత్సవ్‌లో ఉర్రూతలూగించే ఈవెంట్లు

- సంగీత దర్శకులు మణిశర్మ, ఆర్పీ పట్నాయక్ సందడి
- ప్రముఖ గాయనీ గాయకులతో మ్యూజికల్ నైట్స్
- పున్నమి ఘాట్, గొల్లపూడి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, ఇందిరాగాంధీ స్టేడియం, ఘంటసాల సంగీత కళాశాల వేదికలుగా హంగామా
- నోరూరించే ఫుడ్ స్టాళ్లు, ప్రదర్శనలు అనేకం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : విజయవాడ ఉత్సవ్-2025లో భాగంగా 11 రోజుల పాటు నగరవాసులు సంగీత ప్రపంచంలో ఓలలాడనున్నారు. యువతను మిగతా 6లో..



కౌంట్‌డౌన్ 2

ఓం శక్తి

దసరాలో పగటి వేషాలే హైలైట్

- పగటి వేషాలతోనే.. 'దసరా' సందడి ప్రారంభం
- శక్తి, భేతాళ, అర్ధనారీశ్వర, బుడబుక్కల, పిట్టలదొరల విన్యాసాలు
- నాటి కళాకారుల అభినయాలకు ప్రజల నుంచి ఆదరణ
- నేడు జీవన మార్పులతో కనుమరుగవుతున్న పగటి వేషగాళ్లు
- అంతరించిపోతున్న కళా సంస్కృతిని కాపాడుకుందాం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ కల్చరల్)

ఒకప్పుడు వీధుల్లో పదులసంఖ్యలో కన్పించే పగటి వేషాలు వేసే కళాకారులు ప్రస్తుతం అక్కడక్కడ ఒకరో, ఇద్దరో కనిపిస్తున్నారు. పగటి వేషాలు అప్పట్లో సంప్రదాయ కళగా ఆదరించే వాళ్లు. ఇప్పుడు కేవలం వారిని డబ్బులు ఆశించే బిక్షగాళ్లుగా భావిస్తున్నారు. ఈ క్రమంలో క్రమేణా పగటి వేషాలు తగ్గుతూ వచ్చాయి. ఓ రకంగా చూస్తే ఈ జానపద కళ అంతరించిపోతోందనే చెప్పాలి. ఇప్పుడు చూద్దామన్నా దసరా పండుగకు పగటి వేషాలు కనిపించడం లేదు. తెలుగు సంస్కృతిలో మాయమౌతున్న పగటివేషాల జానపద కళలను పరిశీలిద్దాం.

చారిత్రక వారసత్వం.. పగటి వేషాల మూలాలు

పగటి వేషాలు జానపద కళారూపంగా శాతవాహనుల కాలం నుంచి ఉన్నాయని హాలుని గాధా సప్తశతి, భరత కోశం వంటి గ్రంథాల్లో పేర్కొన్నారు. పగటిపూట ప్రదర్శనల వల్ల "పగటి వేషాలు"గా పేరు వచ్చింది. కాకతీయుల కాలంలో యుగంధరుడు పిచ్చి యుగంధరుడిగా వేషం ధరించి శత్రువులను జయించిన కథలు ఈ కళ చారిత్రక ప్రాముఖ్యతను తెలియజేస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లోని గడ్డిపాడు వంటి ప్రాంతాలు 60 రకాల వేషాలతో ప్రసిద్ధి చెందాయి. ఇవి పౌరాణిక, హాస్య, నిత్యజీవిత కథలను ప్రదర్శించాయి. రాజు కళింగ గంగు, సంబెట గురవ రాజు వంటి కథలు పండుగల్లో సామాజిక సందేశాలను అందించాయి.

పూర్వం పండుగల సమయంలో తెలుగునాట గ్రామ వీధులు పగటి వేషగాళ్ల సందడితో కళకళలాడేవి. దసరాకు నెలరోజుల ముందే సంచార కళాకారులు విచిత్ర వేషధారణలతో ఊరూ వాడా తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి తమ హావభావాలతో అలరిస్తూ.. ఆకట్టుకునేవారు. శక్తి, వీర, భేతాళ, గంగిరెద్దులు, అర్ధనారీశ్వర, బుడబుక్కల, పిట్టల దొర తదితర వేషాలతో కళాకారులు ఇంటింటికి వెళ్లి అభినయం ప్రదర్శించేవారు. విచిత్ర వేషధారణలతో అలరించేవారు. కొందరు పద్యాలు, వ్యంగ్యాలు, హాస్యంతో ప్రజలను ఆనందపరిచేవారు. ధాన్యం, డబ్బులు సంభావనలుగా తీసుకునే ఈ సంప్రదాయం సామాజిక సమస్యలను వినోదపూర్వకంగా చర్చించే వేదికగా ఉండేది.

వేషాల వైవిధ్యం.. సమాజ దర్పణం

పగటి వేషాలను మతపరమైన (శక్తి, హరిదాసు, పకీరు, దేవతారూపాలు), కులపరమైన (గొల్లబోయిడు, బుడబుక్కల), పౌరాణిక (అర్ధనారీశ్వర), జంతు ప్రదర్శన (గంగిరెద్దుల), ఇతర (పిట్టలదొర) రకాలుగా విభజించవచ్చు. దసరాలో శక్తి వేషం చాలా ముఖ్యమైనది. దసరా చివరి రోజున దీనిని ప్రదర్శిస్తారు. పిల్లలు భయపడేవారు. డప్పుల వాయిద్యాల నడుమ శక్తి పరుగులు తీస్తుంటే ప్రజలు భయపడి తలుపులు వేసుకునేవారు. అర్ధనారీశ్వర వేషం మరో ప్రత్యేక ఆకర్షణ. ఒకే వ్యక్తి శివుడు, పార్వతిగా మూడు గంటల మేకప్‌తో ప్రదర్శన ఇస్తాడు. ఈ వేషాలు వీధులు, ఇంటి గడపలను రంగస్థలంగా మార్చి, సంభాషణలు, పద్యాలు, హార్మోనియం, తబలా వాయిద్యాలతో ప్రజలను అలరించాయి. గ్రామాల్లో సంచార కళాకారులు నెలరోజుల పాటు ప్రదర్శనలు ఇచ్చి సంభావన అందుకునేవారు. సమాజంలోని కుల, మత విమర్శలను వ్యంగ్యంగా చూపేవారు.



కనుమరుగయ్యే దశలో..

ఇప్పుడు పండుగల్లో ఈ సందడి కనిపించట్లేదు. ఒకప్పుడు 64 వేషాలు ఉండగా, ఇప్పుడు 32కి తగ్గాయి. అవి కూడా దాదాపుగా కనుమరుగయ్యే దశలో ఉన్నాయి. ఇప్పుడు చెప్పుకోవడానికి అరడజను కూడా కనిపించటం లేదు. టీవీ, సోషల్ మీడియాకు ప్రజలు ఆకర్షితులౌతున్నారు. యువత ఈ కళలు నేర్చుకోవట్లేదు. 'జీవన మార్పులు' కారణమని గడ్డిపాడు కళాకారులు చెబుతారు. బోడి బాపనమ్మ వంటి వేషాలను ప్రజలు తిరస్కరించడం, ఆర్థిక సమస్యలు, పట్టణాల్లో అడ్డంకులు కళాకారులను ఇతర వృత్తులకు మార్చాయి. రెండు దశాబ్దాల క్రితమే చాలామంది దేశంలో ఉన్న పెద్ద పట్టణాలకు వలసలు వెళ్లి సినిమాలలో పనిచేస్తున్నారు. మరికొందరు వ్యవసాయం, చిన్న వ్యాపారాలకు మారారు. వందలాది కళాకారులు ఉండే గ్రామాల్లో ఇప్పుడు పదుల సంఖ్యలో కూడా లేరు. ఒక్కరు కూడా కనిపించని ఊళ్లు ఉన్నాయి.

పగటి వేషాల సంప్రదాయాన్ని కాపాడాలి

పగటి వేషాలు కేవలం వినోదం కాదు. సామాజిక దర్పణం, చారిత్రక వారసత్వం. దాదాపుగా 80కి పైగా జానపద కళలు మన దగ్గర అంతరించిపోతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ప్రభుత్వం, సాంస్కృతిక సంస్థలు ప్రత్యేక వేదికల ద్వారా ఈ కళలను రక్షించాలి. లేకపోతే, గడ్డిపాడు, కూచిపూడి వంటి ప్రాంతాల సంప్రదాయం గ్రంథాల్లోనే మిగిలిపోతుంది. వీధుల్లో మాయమౌతున్న పగటి వేషాల సంస్కృతిని తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు

సీఎం, డిప్యూటీ సీఎంలకు 'విజయవాడ ఉత్సవ్' ఆహ్వానం

వన్‌టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : 'విజయవాడ ఉత్సవ్'కు విచ్చేయవలసిందిగా కోరుతూ శుక్రవారం విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ప్రముఖ వ్యాపారవేత్త, ముత్తవరపు మురళీకృష్ణ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఉమ్మడి కృష్ణాజిల్లా ఎమ్మెల్యేలతో కలిసి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దే రామ్మోహన్, వసంత కృష్ణప్రసాద్, బోడె ప్రసాద్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు పాల్గొన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు విజయవాడ ఉత్సవ్ కమిటీ సభ్యులు ఎంపీ కేశినేని శివనాథ్, ముత్తవరపు మురళీ కృష్ణ శుక్రవారం కలిసి విజయవాడ ఉత్సవ్‌కు ఆహ్వానించారు.

విజయవాడ ఉత్సవ్‌పై సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైబ్రెంట్ విజయవాడ ఉత్సవాలపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. దేవదాయ శాఖకు చెందిన స్థలంలో విజయవాడ ఉత్సవ్ నిర్వహణ సరికాదని, దైవ కార్యకలాపాలు మినహా ఎలాంటి కార్యక్రమాలు చేయడానికి లేదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని కోరుతూ వారి తరపు న్యాయవాదులు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయి నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట మెన్షన్ చేశారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, పిటిషన్‌ను సోమవారం విచారణకు స్వీకరిస్తామని తెలిపింది.

పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌లకు దసరా ఉత్సవాలకు ఆహ్వానం

వన్‌టౌన్ : ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్‌లకు శుక్రవారం దుర్గగుడి ఈవో శీనానాయక్ దేవస్థానం అర్చక బృందంతో కలిసి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారికి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

ఉమ్మడి జిల్లా వినియోగదారుల కమిషన్ అదనపు బెంచ్ అధ్యక్షుడిగా పద్మారెడ్డి




విజయవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వినియోగదారులు కమిషన్ విజయవాడ అదనపు బెంచ్ అఫిషియేట్ అధ్యక్షుడిగా నందిపాటి పద్మారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నంలోని వినియోగదారుల కమిషన్ బెంచ్ నుంచి విజయవాడ అదనపు బెంచ్‌కు పద్మారెడ్డి బదిలీ అయ్యారు. ఆయనకు విజయవాడ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు నేలపూడి చిరంజీవి, సభ్యులు వెంకట రమణ, శశికళ అభినందనలు తెలిపారు.

ఎగ్జిబిషన్‌కు పకడ్బందీ ఏర్పాట్లు : ఎంపీ శివనాథ్

ఇబ్రహీంపట్నం / గొల్లపూడి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎగ్జిబిషన్‌కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని విజయవాడ ఉత్సవ్ కమిటీ సభ్యుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గొల్లపూడిలోని దేవస్థానం భూమిలో ఏర్పాటయ్యే ఎగ్జిబిషన్ పనుల్ని ఆయన శుక్రవారం శ్రేయాస్ మీడియా వారితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 12 ఏళ్ల తర్వాత నగరంలో ఎగ్జిబిషన్ మొదలు కానుండటంతో ప్రజలు ఎక్కువగా వస్తారని, తగినట్లు ఏర్పాట్లు ఉండాలన్నారు.

జీవీ పూర్ణచందుకు బోయి భీమన్న పురస్కారం



విజయవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రచనలతో సమాజ రుగ్మతలను ఎత్తిచూపిన మహాకవి డాక్టర్ బోయి భీమన్న అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన నిర్వహించిన డాక్టర్ బోయి భీమన్న 114వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ జీవీ పూర్ణచందుకు బోయి భీమన్న పురస్కారం ప్రదానం చేశారు. మంత్రి కందుల దుర్గేష్ జీవీ పూర్ణచందును శాలువాతో సత్కరించి, రూ.2 లక్షల నగదు పురస్కారం అందజేశారు. బోయి భీమన్న సతీమణి, రచయిత్రి బోయి హైమావతి మాట్లాడుతూ, భీమన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ డీఆర్వో లక్ష్మీ నరసింహం, సాంస్కృతిక శాఖ సంచాలకులు మల్లికార్జునరావు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ వి.గంగులయ్య, భాషా సాంస్కృతిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముద్దాయిలకు పదేళ్ల జైలు శిక్ష

జి.కొండూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వెలగలేరులో 2021 డిసెంబర్ 11న ప్రభుత్వ మద్యం దుకాణం వాచ్‌మెన్ చట్టు సోమయ్య (63)ను దొంగతానికి వచ్చి హత్య చేసిన కేసులో ముద్దాయిలు రాపూరి రమేష్ (కందుకూరు), తిరుమలశెట్టి హరిబాబు (నాగరికల్లు)లపై నేరం రుజువు కావడంతో శుక్రవారం నూజివీడు 15వ ఏడీజె న్యాయమూర్తి ఎ.నాగ శైలజ పదేళ్ల పాటు జైలు శిక్ష, రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువడించారు. మొత్తం 25 మంది సాక్ష్యాన్ని పరిగణలోకి తీసుకొని న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

గతంలో కంటే ఘనంగా దసరా ఉత్సవాలు

- దేవదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



సమీక్ష అనంతరం మాట్లాడుతున్న మంత్రి రామనారాయణరెడ్డి

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో దసరా ఉత్సవాలు గతంలో కంటే ఘనంగా నిర్వహిస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. దసరా మహోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం మోడల్ గెస్ట్‌హైస్‌లో మంత్రుల బృందం సమీక్షా సమావేశం నిర్వహించింది. దేవదాయమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్, సమాచార పౌరసంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఎన్టీఆర్ కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, దుర్గగుడి ఈవో శీనానాయక్ పాల్గొన్నారు. పలు అంశాలు చర్చించి ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. అధునాతన క్యూలైన్లు, హోల్డింగ్ ఏరియాలు, తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, భక్తుల భద్రత, స్నానఘాట్ల వద్ద ఏర్పాట్లు, ప్రసాదం పంపిణీ, అన్న ప్రసాదం, కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు, ప్రోటోకాల్ దర్శన సమయాలు అంశాలపై చర్చించారు. అనంతరం దేవదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడారు. సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తూ సంతృప్తికరంగా అమ్మవారి దర్శన భాగ్యం కల్పించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. వీఐపీ, వీవీఐపీ దర్శనాలను తగ్గిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ప్రోటోకాల్ పరిధిలోకి వచ్చే ప్రముఖులకు మాత్రమే అంతరాలయ దర్శనం కల్పిస్తామన్నారు. రిఫరెన్స్ లేఖలపై వచ్చేవారు బంగారు వాకిలి నుంచి అమ్మవారిని దర్శనం చేసుకోవాలన్నారు. ఉత్సవాలలో అన్ని రోజులు రూ.500 టికెట్‌ను రద్దు చేశామన్నారు. మూలానక్షత్రం, విజయదశమి పర్వదినాల రోజులలో పూర్తిగా ఉచిత దర్శనాలే ఉంటాయన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహకరించాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కోరారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రావు, సుజ నా చౌదరి, బొండా ఉమామహేశ్వరరావు, ముఖ్య ఉత్సవ అధికారిణి డి.భ్రమరాంబ, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, పాల్గొన్నారు.

దసరా ఏర్పాట్లపై అధికారుల పరిశీలన

దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ దుర్గగుడి ఈవో శీనానాయక్, ఈఈ కోటేశ్వరరావు తదితరులతో కలిసి శుక్రవారం దసరా మహోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందిని అప్రమత్తం చేసి, దిశా నిర్దేశం చేశారు.

కనకదుర్గమ్మ సేవలో ఎంపీ కేశినేని శివనాథ్

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను శుక్రవారం ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) విజయవాడ ఉత్సవ సభ్యులు ముత్తవరపు మురళీకృష్ణ తదితరులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా 'విజయవాడ ఉత్సవ్' ఆహ్వాన పత్రికను అమ్మవారి చెంత ఉంచారు. దసరా, విజయవాడ ఉత్సవ్ విజయవంతం కావాలని కోరారు. ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ తదితరులు ఉన్నారు.

దేశంలోనే అత్యంత సుందర నగరంగా అమరావతి



ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, స్టాల్ ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

లబ్బీపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమరావతి రాజధాని దేశంలోనే అత్యంత సుందర నగరంగా మారనుందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఎ కన్వెన్షన్‌లో నరెడ్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమరావతి ప్రాపర్టీ షోను శుక్రవారం ఆయన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మంత్రి నారాయణతో కలిసి ప్రారంభించారు. సొంతింటి కలను సాకారం చేసుకోవాలనే వారికి ఇది అద్భుతమైన వేదికగా ఉపయోగపడుతుందన్నారు. అమరావతి నగరం భవిష్యత్తులో భారతదేశంలోనే అత్యంత సుందర నగరంగా మారబోతోందని, ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడం వలన మంచి భవిష్యత్తు లభిస్తుందని అన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ అమరావతి ప్రాపర్టీ షో కేవలం ప్రదర్శన మాత్రమే కాదని, రాజధాని భవిష్యత్ ఎలా ఉండబోతోందో చూపిస్తుందన్నారు. రియల్ ఎస్టేట్ అంటే కేవలం భవనాలు కాదని, ఉపాధి కల్పిస్తుందని, ఆర్థిక వృద్ధికి ఊత మిస్తుందన్నారు. అనంతరం ఆయన మా లక్ష్మీ గ్రూప్ స్టాల్‌ను ప్రారంభించారు. నరెడ్కో ఏపీ ప్రెసిడెంట్ గద్దె చక్రధర్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పరుచూరి కిరణ్, ఏపీ సెక్రటరీ మామిడి సీతారామయ్య, సెంట్రల్ జోన్ ప్రెసిడెంట్ సందీప్ మండవ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల టెండర్ల రద్దు

- సీఆర్డీఏ చర్యతో కంగుతిన్న కాంట్రాక్టు సంస్థలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడ - గుంటూరు నగరాల రోడ్ల అభివృద్ధి పనుల టెండర్ల విషయంలో సీఆర్‌డీఏ వ్యవహరిస్తున్న తీరు తీవ్ర వివాదానికి దారితీస్తోంది. ఇప్పటికే విజయవాడలోని మూడు ప్రధాన రోడ్ల టెండర్లను రద్దు చేసిన సీఆర్‌డీఏ శుక్రవారం గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు మూడో దశ విస్తరణ పనులను కూడా రద్దు చేసింది. విజయవాడలో మూడు రోడ్ల పనులకు టెక్నికల్ బిడ్లను తెరవకుండా రద్దు చేస్తే.. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు విస్తరణ పనులు మాత్రం టెక్నికల్ బిడ్లు పిలిచినప్పటికీ రద్దు చేయటం గమనార్హం. ఇన్నర్ రింగ్ రోడ్డు విస్తరణ పనుల టెండర్లలో పాలు పంచుకున్న ఆరు కాంట్రాక్టు సంస్థలకు టెండర్‌ను రద్దు చేస్తున్నట్టుగా శుక్రవారం సీఆర్‌డీఏ ఈ - మెయిల్ పంపింది. కోర్టుకు వెళతామని కాంట్రాక్టు సంస్థలు చేసిన హెచ్చరికలను కూడా సీఆర్‌డీఏ పట్టించుకోలేదు. సీఆర్‌డీఏ పరిధిలోని గుంటూరులో ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ - 3 పనులను రూ.34 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. జేకేసీ కాలేజీ (స్వర్ణభారతినగర్) నుంచి పెదపలకలూరు వరకు రోడ్డును విస్తరించేందుకు సీఆర్‌డీఏ ఆగస్టు నెలలో టెండర్లు పిలిచింది. ఆగస్టు 7వ తేదీ సాయంత్రం టెక్నికల్ బిడ్లను తెరిచారు. మొత్తం ఆరు సంస్థలు పాలు పంచుకున్నాయి. యూబీఎస్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్, ఎస్‌సీసీ లిమిటెడ్, భవానీ కన్‌స్ట్రక్షన్స్, బీఎస్ఆర్ ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, మాధవి ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్స్, శ్రీసాయినాథ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు టెండర్లలో పాలుపంచుకున్నాయి. మరుసటి రోజు ఆగస్టు 8వ తేదీన ఫైనాన్షియల్ బిడ్లను తెరవాల్సి ఉండగా.. అప్పటి నుంచి వాటిని ఓపెన్ చేయటం లేదు. ఫైనాన్షియల్ బిడ్లలో ఎల్-1 గా నిలిచిన సంస్థకు పనులను అప్పగించాల్సి ఉంటుంది. ఫైనాన్షియల్ బిడ్లనే ఓపెన్ చేయకపోతే ఎవరు ఎల్-1గా నిలిచారో తెలియదు. కాంట్రాక్టు సంస్థలు అభ్యంతరాలు తెలిపితే గడువు పొడిగించవచ్చు. కాంట్రాక్టు సంస్థల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. అంతకు ముందు ప్రీబిడ్ మీటింగ్‌లో కాంట్రాక్టు సంస్థల నుంచి కూడా ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. అసలు కాంట్రాక్టు సంస్థలే ముందుకు రాకపోతే ఆపారనుకోవచ్చు. టెక్నికల్ బిడ్లలో ఆరు సంస్థలు పాలు పంచుకున్నాయని తెలుస్తూనే ఉంది. ఇలాంటపుడు ఫైనాన్షియల్ బిడ్లను తెరిస్తే సరిపోతుంది. ఫైనాన్షియల్ బిడ్లను తెరవకుండా గడువుల మీద గడువు పొడిగిస్తూ అర్ధాంతరంగా శుక్రవారం రద్దు చేసింది. రద్దు చేస్తున్నట్టు సమాచారం ఇచ్చిన గంటలోనే ఆయా కాంట్రాక్టు సంస్థలు ఈఎండీలు, ఇతర చార్జీల కింద చెల్లించిన డబ్బును సీఆర్‌డీఏ రిఫండ్ చేసింది. ఇంత వేగంగా కాంట్రాక్టర్లు డబ్బును రిఫండ్ చేయటం వెనుక.. కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయిస్తారేమోనన్న ఉద్దేశ్యం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. విజయవాడలో మూడు రోడ్ల పనుల టెండర్లకు వస్తే వాటికి టెక్నికల్ బిడ్లనే తెరవలేదు. టెక్నికల్ బిడ్లను తెరవకపోవటం వల్ల కాంట్రాక్టు సంస్థలు కోర్టుకు వెళ్లే అవకాశం ఉండదు. అభివృద్ధి పనుల విషయంలో సీఆర్‌డీఏ అధికారులు ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారో అర్థం కావటం లేదు. పెద్ద కాంట్రాక్టర్ల కోసమే టెండర్లను రద్దు చేశారని చిన్న కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.

ఈ-దసరా

(5వ పేజీ తరువాయి)

అధికారులు నిర్ణయించారు. వీటన్నింటినీ క్యూలైన్ల ప్రారంభం పాయింట్ నుంచి ఎగరేస్తారు. భక్తుల తలలను లెక్కించేలా డ్రోన్లలోని కెమెరాలకు సాఫ్ట్‌వేర్‌ను జత చేయాలని భావిస్తున్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి బయటకొచ్చేవారిని, స్నానపు ఘాట్ల వద్ద ఉన్నవారి లెక్కలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటారు. ఇందుకోసం దుర్గాఘాట్ పక్కన ఉన్న మోడల్ గెస్ట్‌హౌస్‌లో అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)ను ఏర్పాటు చేస్తున్నారు. డ్రోన్లు చిత్రీకరించిన దృశ్యాలను సీసీసీలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లపై అధికారులు వీక్షిస్తారు. పరిస్థితిని బట్టి బందోబస్తులో మార్పులు చేస్తారు. దుర్గమ్మను రోజుకు ఎంతమంది దర్శించుకున్నారన్న లెక్కలు తెలియడానికి ప్రధానాలయం నుంచి బయటకొచ్చే ప్రదేశంలో హెడ్‌కౌంట్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎంతమంది భక్తులు దర్శనం క్యూల్లోకి వెళ్తారన్న లెక్కలను ముందే తెలుసుకోవడానికి రైల్వేస్టేషన్‌లో 10, బస్టాండ్‌లో 10 ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు వచ్చే రైళ్లు, బస్సుల సమాచారాన్ని మొత్తం సీసీసీకి అనుసంధానం చేశారు. మూలానక్షత్రం ముందురోజు రాత్రి నుంచి మొదలయ్యే హోల్డింగ్ పాయింట్లలో అధికారులు మార్పులు చేశారు. ఈ ఏడాది హోల్డింగ్ పాయింట్లను పెంచడంతో పాటు తిరుమల మాదిరిగా తాత్కాలికంగా కంపార్టుమెంట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఒకరి వెనుక ఒకరు నడిచేలా కాకుండా నలుగురైదుగురు నడిచేలా వెడల్పు చేశారు.

మ్యూజిక్ మ్యాజిక్

(5వ పేజీ తరువాయి)

ఉర్రూతలూగించే సంగీత విభావరులు, దాండియాలు ఉత్సాహాన్ని నింపనున్నాయి. పున్నమి ఘాట్‌లో ఈ నెల 22న మూన్‌లైట్ సింపోనీ, 23న అభిజిత్ నెయర్ లైవ్, 24న గీతామాధురి లైవ్, 25న కామాక్షి లైవ్, 27న బీట్‌గురూ లైవ్, 28న సందీప్ నారాయణ లైవ్.. వంటి సంగీత కార్యక్రమాలు ఉంటాయి. గొల్లపూడి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో.. ఈనెల 22న ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మణిశర్మ లైవ్, 23న ఆర్పీ పట్నాయక్ లైవ్, 24న కార్తీక్ లైవ్, 26న థాయిక్కుడమ్ బ్రిడ్జి లైవ్, 28న సింగర్ సునీత లైవ్, రామ్ మిరియాల లైవ్, 30న కాప్రిషియో లైవ్, అక్టోబరు 1న గీతామాధురి లైవ్, బ్యాండ్ రుద్ర లైవ్ కార్యక్రమాలు జరుగుతాయి. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో.. సాంస్కృతిక ప్రదర్శనలు, కూచిపూడి, భరతనాట్యం, భక్తి సంగీతం, సాంఘిక నాటకాలు, హరికథలు, బుర్రకథలు, తోలుబొమ్మలాట, పద్య నాటకాలు, పౌరాణిక నాటకాలు.. ఇలా వందకుపైగా ఈవెంట్లు జరుగుతాయి. ఈనెల 25న గొల్లపూడి ఎక్స్‌పోలో క్రౌన్ ఆఫ్ విజయవాడ, 27న ఎంజీ రోడ్డులో మెగా కార్నివాల్ వాక్, 29న గొల్లపూడిలో విజయవాడ ఐడల్, 30న పున్నమి ఘాట్‌లో అగ్ని అవార్డ్స్, అక్టోబరు 1న పున్నమి ఘాట్‌లో సోషల్ మీడియా అవార్డ్స్, 2న ఇందిరాగాంధీ స్టేడియంలో స్వచ్ఛథాన్ నిర్వహిస్తారు. దాండియా, దేవీ దర్శనం, లైవ్ బ్యాండ్స్, క్లాసికల్ ఎంటర్‌టైన్‌మెంట్, ఫుడ్‌కోర్టులు, ఫ్లీ మార్కెట్లు, వాటర్ స్పోర్ట్స్, డ్రోన్ షో, ఫైర్ వర్క్స్.. ఇలా 60కి పైగా ఈవెంట్లు జరుగుతాయి.

మళ్లీ మట్టి దందా

(5వ పేజీ తరువాయి)

బుకాయించారు. ఆ తర్వాత ఎలాంటి అనుమతులు లేవని వెలుగుచూసింది. కాల్వగట్టు వెంబడి మట్టితో పాటు కొండ దిగువన గ్రావెల్‌నూ తవ్వేస్తున్నారు. దీనివల్ల ఈ ప్రాంతమంతా గోతులమయంగా మారింది. పోలవరం కట్టకు కూడా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఏర్పడింది. కట్ట కుంగితే, గోతుల వెంబడి పోలవరం నీరు పొలాలను ముంచెత్తే ప్రమాదం ఉంది. కట్ట తెగితే విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలోని గ్రామాలకు ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతుంది. కొత్తూరు రిజర్వు ఫారెస్టులోకి కూడా వెళ్లి గ్రావెల్ మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నారు. బుడమేరు కట్టరోడ్డు పేరు చెప్పి ఈ సంస్థ పోలవరం కట్ట వెంబడి మట్టిని తోడేస్తోంది. బుడమేరు కాల్వగట్టు పనులకు మట్టి వేయటానికి అని చెప్పి పెద్దసంఖ్యలో లారీల్లో తరలిస్తున్నారు. కాల్వగట్టుపై పలుచోట్ల ఎక్స్‌కవేటర్లు పెట్టి తవ్వుతున్నారు. ఈ కట్ట మీదుగానే లారీలు బుడమేరు కట్టకు చేరుకుని మట్టిని నింపుతున్నాయి. పగటి సమయంలో బుడమేరు కట్టరోడ్డుకు, రాత్రిపూట పాతపాడులోని శ్రీసిటీకి మట్టిని తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్, ఫారెస్ట్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవట్లేదు. కొడాలి నానీకి అత్యంత సన్నిహితమైన అనుచరులకు ఈ పనులు చేసుకునే అవకాశం ఎలా వచ్చిందన్నది ప్రశ్నార్థకంగా మారింది. బుడమేరు పనుల కాంట్రాక్టును ఎలా పొందారన్నది చర్చనీయాంశమైంది.

విజయ పాలు, పాల పదార్థాల ధరల తగ్గింపు

చిట్టినగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పాలఉత్పత్తులపై జీఎస్టీ తగ్గించడంతో కృష్ణామిల్క్ యూనియన్ జీఎస్టీ వర్తించే పాలు, పాలపదార్థాల ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం దేశ పాడి రంగానికి మేలు చేస్తుందన్నారు. తగ్గిన ధరలను సెప్టెంబరు 22 నుంచి అమలు చేయాలని కృష్ణామిల్క్ యూనియన్ నిర్ణయం తీసుకుందని చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. యూహెచ్‌టీ పాలు (టెట్రా ప్యాక్) లీటరుకు రూ.5, పన్నీరు కిలోకు రూ.20, వెన్న కిలోకు రూ.30, నెయ్యి కిలోకు రూ.30, ఫ్లేవర్డ్ మిల్క్ లీటరకు రూ.5 తగ్గిస్తున్నట్టు పేర్కొన్నారు.

ప్రభుత్వ అండతో నా హత్యకు కుట్ర : కేఏ పాల్

గాంధీనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అండతో తనను హతమార్చేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ ఆరోపించారు. గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను కష్టపడి సంపాదించిన చారిటీ, సొసైటీల ఆస్తులను తన సోదరుడు భార్య, కుమారులు అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని, మిగిలిన ఆస్తులను కూడా స్వాధీనం చేసుకునేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తమకు అండగా ఉన్నారని వారు చెబుతున్నారన్నారు. తమ చారిటీల జోలికి వచ్చిన వారి పతనం ఖాయమని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, అవినీతిపై న్యాయపోరాటం చేస్తానన్నారు. మాజీ సీఎం జగన్‌తో కలిసి టీడీపీ ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.

గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గాంధీనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే నిరసన కార్యక్రమాలు చేపడతామని ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎండీ. పాషా స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని గురువారం సచివాలయంలో కలిసి ముందస్తు నోటీసు అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విప్పర్తి నిఖిల్‌కృష్ణ, రాష్ట్ర కన్వీనర్ రజాక్ పాల్గొన్నారు.

శాప్ వైస్ చైర్మన్, ఎండీగా భరణి



విజయవాడ(స్పోర్ట్స్) : ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, ఎండీగా ఎస్.భరణి నియమితులయ్యారు. శాప్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. శాప్ ఏవో రమావత్ నాయక్, ఇతర ఉద్యోగులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. శాప్ వీసీ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు.

లాటరీ పేరుతో రూ.38 లక్షలు కొట్టేశారు!

గుడివాడ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి ఓ వ్యక్తి రూ.38 లక్షలు పోగొట్టుకున్న ఘటన నూజెళ్ల లో జరిగింది. గ్రామానికి చెందిన దాసరి హరి గంగాధర్‌కు 2024, జూన్ 13వ తేదీన దుబా య్ ఫౌండేషన్/దుబాయ్ ఇస్లామిక్ బ్యాంకు పేరుతో ఫోన్ సందేశం వచ్చింది. గవర్నమెంట్ ఆఫ్ దుబాయ్ లాటరీలో రూ.1.86 కోట్లు గెలుచుకున్నట్లు ఉంది. లాటరీలో గెలిచిన మొత్తం రావాలంటే కొంతమేర ఖర్చు అవుతుందని, తమ బ్యాంకు ఖాతా, ఫోన్‌పేలకు నగదును పంపాలంటూ సందేశాలు పంపించారు. లాటరీ తగిలిందనే ఆనందంతో గంగాధర్ వచ్చిన సందేశాలపై ఎటువంటి ఆరా తీయకుండా, వారు చెప్పిన విధంగా రూ.5 వేల నుంచి రూ.3 లక్షల వరకు విడతల వారీగా వారి ఖా తాలకు ఏడాదిగా రూ.38 లక్షలు చెల్లించాడు. నెల రోజుల క్రితం మళ్లీ రూ.1.85 లక్షలు చెల్లించాలని సైబర్ నేరగాళ్లు కోరడంతో, అనుమానం వచ్చి తాను మోసపోయినట్లు గ్రహిం చి గుడివాడ రూరల్ పోలీసులను బాధితుడు ఆశ్రయించాడు. ఎస్సై ఎస్.చంటిబాబు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133,142, 153
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

సిద్ధార్థ మెడికల్ కాలేజీలో వాక్‌థాన్

విజయవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):ప్రజల్లో ఔషధ భద్రపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో సిద్ధార్థ మెడికల్ కాలేజీలోని ఫార్మకాలజీ విభాగం శుక్రవారం వాక్‌థాన్ నిర్వహించారు. వాక్‌థాన్‌ను ప్రిన్సిపాల్, ఏడీఎంఈ డాక్టర్ ఏ.వై.రావు, సూపరింటెండెంట్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రజల్లో ఔషధ ప్రభావం, వాటి ప్రాముఖ్యత, సమర్థవంతమైన ఔషధ వినియోగం, ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన వంటి అంశాలపై కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.వై.రావు వివరించారు. వాక్‌థాన్‌లో విద్యార్థులు అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వనర్సింగ్ కాలేజీ, విజయ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు దత్తపీఠంలో ఏర్పాట్లు

రామలింగేశ్వరనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దత్తపీఠం పటమట మరకత రాజరాజేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు, పురోహితులు తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆవిష్కరించారు. 11 రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేస్తామని, ప్రతి రోజూ అభిషేకం, లలితా సహస్రనామాలతో కుంకుమమార్చన, శ్రీ చక్రపూజ, సుహాసినీ పూజ చేస్తామన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కరెన్సీనగర్ దాసాంజనేయ దేవాలయంలో ...

భారతీనగర్:మూడో డివిజన్ పరిధిలోని కరెన్సీనగర్ దాసాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు రామభక్తి సేవాసమితి ఆధ్వర్యంలో ఆలయంలో దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవరాత్రులు అన్ని రోజులు ఆలయంలో పూజలు జరుగుతాయన్నారు.

22 నుంచి శతచండీయాగం, రుద్రాభిషేకం

మొగల్రాజపురం: స్థానిక పిన్నమనేని రోడ్డులో ఉన్న సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు విశ్వమాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శత చండీహోమం, రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

పీబీ సిద్ధార్థలో మ్యూజ్‌క్రేజ్ పోటీలు

మొగల్రాజపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదన్ మోహన్ మాలవ్య 1016లో కాశీలో నెలకొల్పిన బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నేపథ్యం, 1975లో మొదలైన పీబీ సిద్ధార్థ విద్యాసంస్థల ప్రస్థానం గుర్తు చేస్తోందని కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. ఉషా తెలిపారు. పీబీ సిద్ధార్థ కళాశాల, దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల ఆంగ్ల విభాగాల ఆధ్వర్యంలో మ్యూజ్‌క్రేజ్ పోటీలు పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పీబీ సిద్ధార్థ ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ కళాశాల పూర్వ ఆంగ్ల విభాగాధిపతి కవి వేగుంట మోహన్‌ప్రసాద్, విశ్రాంత తెలుగు శాఖాధిపతి, సిద్ధార్థ కళాపీఠం పూర్వకార్యదర్శి నాగళ్ల గురుప్రసాద్‌కు నివాళులర్పించారు. కన్వీనర్ నిమ్మగడ్డ లలిత్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తకపఠనం అలవరచుకోవాలని కోరారు. వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ రూపకల్పన, స్కిట్‌ప్రదర్శన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ శ్రీలలిత, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. ఉషా తదితరులు

స్మార్ట్ హ్యాక్‌థాన్ 2025 పోటీలు

పీబీ సిద్ధార్థ కళాశాలలో డేటా సైన్స్ ఏఐ విభాగం ఆధ్వర్యంలో స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ -2025 పోటీలు శుక్రవారం నిర్వహించారు. మొత్తం 21 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో ఏఐ, వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, సస్టైనబుల్ డెలవప్‌మెంట్ తదితర విభాగాలలో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించారు. క్లౌడ్‌నెస్ట్, లాజిక్ లార్డ్స్, అగ్రోవర్స్ ప్రాజెక్టులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షణ డేటా సైన్స్ ఏఐ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ ఉదయశ్రీ చేయగా స్టూడెంట్ కో ఆర్డినేటర్‌లు యశస్వీ చౌదరి, సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సవ్‌పై అవగాహనకు ఫ్లాష్‌మాబ్



రాణిగారితోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఉత్సవ్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తున్న ఫ్లాష్‌మాబ్ ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. రాణిగారితోటలోని వైట్‌హౌస్ వద్ద శుక్రవారం విజయవాడ ఉత్సవ్ టీమ్ నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ ఆ ప్రాంత వాసులను ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, తెలుగు యువత అధ్యక్షుడు నాగూర్, ఉపాధ్యక్షుడు పులిపాటి రాజా, 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గద్దెను విమర్శించే స్థాయి పోతినకు లేదు

- కూటమి నాయకులు

మొగల్రాజపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను గురించి మాట్లాడే స్థాయి, అర్హత పోతిన మహేశ్‌కు లేదని కూటమి నేతలు స్పష్టం చేశారు. జనసేన తూర్పు ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసు కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ మొన్నటి వరకు జగన్‌ను, దేవినేని అవినాష్‌ను తిట్టి ఇపుడు పొగడటం చూస్తే అసలు పోతిన మహేష్ నిజస్వరూపం తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆ వీడియోలను ప్రదర్శించారు. టీడీపీ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చూసి వైసీపీ నాయకులకు నిద్రపట్టడం లేదని, దాని పర్యవసానమే దిక్కుమాలిన ఆరోపణలని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు కోలపల్లి గణేష్ మాట్లాడుతూ గద్దె రామ్మోహన్ గురించి మాట్లాడే స్థాయి లేదని గుర్తుంచుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు షేక్ షఫీ, గాదిరెడ్డి అమ్ములు, వటాల హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణంపై బహిరంగ చర్చకు సిద్ధం

- టీడీపీ కార్పొరేటర్లు, పార్టీ నాయకుల సవాల్

లబ్బీపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లబ్బీపేటలోని షాదీఖానా నిర్మాణ అంశంపై నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో తాము బహిరంగ చర్చకు సిద్ధమని టీడీపీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు సవాల్ చేశారు. గురువారం 19వ డివిజన్‌లోని షాదీఖానా నిర్మాణం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో బుధవారం వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాపై మండిపడ్డారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ నగర ప్రథమ పౌరురాలు రాయన భాగ్యలక్ష్మి ధర్నాలో పాల్గొని పదవికి ఉన్న స్థాయిని తగ్గించారని, మేయర్ పదవికి రాజీనామా చేసి ధర్నాలో పాల్గొనాలని అన్నారు. కార్పొరేషన్‌లో అధికారంలో ఉండి పనులు చేయించలేని అసమర్థ పాలన వైసీపీ సాగిస్తుందన్నారు. ఇటువంటి నాయకులకు, పార్టీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని అన్నారు. కార్పొరేటర్ దేవినేని అపర్ణ, పొట్లూరి సాయిబాబు, చెన్నుపాటి గాంధీ, డివిజన్ అధ్యక్షుడు సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

డైరెక్టర్ డాక్టర్ హసీమ్ బేగ్‌కు సత్కారం

చిట్టినగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా డాక్టర్ హసీమ్ బేగ్ నియమితులైన సందర్భంగా, గౌసియా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మచిలీపట్నంలో ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. కమిటీ సభ్యులు, స్థానిక ముస్లిం పెద్దలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హసీమ్ బేగ్‌ని శాలువా కప్పి, గజమాలతో సత్కరించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాల అమలులో డాక్టర్ హసీమ్ బేగ్ నియామకం మంచి నిర్ణయమని అభిప్రాయపడ్డారు. డాక్టర్ హసీమ్ బేగ్ మాట్లాడుతూ, మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎంపీ బాలశౌరి, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు పారదర్శకత, సమర్పణ, సేవా భావంతో పని చేస్తానన్నారు. గౌసియా మస్జిద్ కమిటీ చేసిన సన్మానం తనకు మరింత బాధ్యతను గుర్తు చేసిందన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గుల్జార్, మసీదు ప్రెసిడెంట్ సర్దారీ, వైస్ ప్రెసిడెంట్ హబ్బు, సెక్రటరీ ఇక్బాల్, ట్రెజరర్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.


డైరెక్టర్ డాక్టర్ హసీమ్‌బేగ్‌ను సత్కరిస్తున్న గౌసియా మసీద్ కమిటీ సభ్యులు

మర్యాదపూర్వక కలయిక

పెనమలూరు, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. తాడిగడపలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సుజనాను కలిసి వివిధ అంశాలను చర్చించారు. వారితో పాటు బీజేపీ మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, కోమటి జయరాం, ముత్తవరపు మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.● దుర్గగుడి నూతన చైర్మన్‌గా ఎంపికయిన బొర్రా రాధాకృష్ణ(గాంధీ) శుక్రవారం తాడిగడపలోని ఎమ్మెల్యే సుజనాచౌదరి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన చైర్మన్‌ను ఎమ్మెల్యే సుజనా అభినందించి అధికారులందరి సమన్వయంతో ఇంద్రకీలాద్రి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

రోబో ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

- ముగింపు సభలో వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ వేణుగోపాల్ విద్యార్థులకు సూచన



ప్రసంగిస్తున్న వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ వేణుగోపాల్

కానూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రోబో ఆవిష్కరణలపై దృష్టి సారిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వరంగల్ నిట్ ప్రొఫెసర్ ఎ. వేణుగోపాల్ అన్నారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో గత రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి రోబోటిక్స్ పోటీలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి.వర్సిటీ వైస్ చాన్స్‌లర్ పరుచూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్‌లు అందజేశారు. వేణుగోపాల్ మాట్లాడుతూ రోబోల ప్రాధాన్యతను వివరించారు. వర్సిటీ ప్రొఫెసర్ ఏవీ రత్నప్రసాద్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.రవికుమార్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్‌లు డాక్టర్ జి.ఢిల్లీబాబు, డాక్టర్ ఎం.సుమలత, డాక్టర్ బి. సుప్రజారెడ్డి, విద్యార్థి కోఆర్డినేటర్‌లు జె.తేజ అమరేశ్వర్, ఎండీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అతిథులను పాలకవర్గం సత్కరించారు.

ఆకట్టుకున్న రోబోటిక్ వర్క్‌షాప్

సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో గత రెండు రోజులగా నిర్వహించిన రోబోఎక్స్-2025 ఆకట్టుకుంది. జాతీయ స్థాయి రోబోటిక్స్ పోటీల్లో ఇన్నోవేట్, ఆటోమేట్, డామినేట్ థీమ్స్‌లో ఆరు అంశాల్లో పోటీలు నిర్వహించగా దేశంలోని పలు కళాశాలల నుంచి 70 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. అద్భుతమైన ఆవిష్కరణలతో పోటీలు ముగిశాయి. సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థుల జట్లు మిషన్ రెస్క్యూ, ప్రెసిషన్ పిక్ అండ్ ప్లేస్‌లో ప్రథమ, ఇండస్ట్రీ-4.0 చాలెంజ్‌లో ద్వితీయ స్థానం సాధించాయి. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థుల జట్లు రోబోవర్ చాలెంజ్‌లో మొదటి స్థానాలను కైవసం చేసుకుంది. విశాఖపట్నంలోని ఎస్ఎస్ఆర్ఐటీ కళాశాల జట్లు అగ్రిబాట్ చాలెంజ్, ఇండస్ట్రీ 4.0 అంశాల్లో ప్రథమ బహుమతులను గెలుచుకున్నాయి. ఉషా రామా కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు అగ్రిబాట్ చాలెంజ్ అంశంలో రెండో స్థానం, నందమూరు శ్రీవాసవి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థుల జట్టు ప్రెసిషన్ పిక్ అండ్ ప్లేస్‌లో రెండో బహుమతిని సాధించాయి. పాత్ ఫైండర్ చాలెంజ్‌లో గంగూరులోని ధనేకుల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థుల జట్టు ప్రథమ స్థానాన్ని, కాకినాడ జిల్లా సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయం జట్టు ద్వితీయ స్థానం పొందాయి. ఈపోటీలకు ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ స్పెషలిస్ట్ కె. చంద్రనీల్ న్యాయనిర్ణేతగా వ్యవహరించి మూల్యాంకనం చేశారు.

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగం కావాలి

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

లబ్బీపేట,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగం కావాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. సిద్ధార్థ మహిళ కళాశాల రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో భవిష్యత్ గ్రీన్ హైడ్రోజెన్ ఇంధనం అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రీన్ హైడ్రోజన్ తయారీ విధానాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం గ్రీన్ హైడ్రోజన్‌పై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ మండవ బసవేశ్వర రావు, డాక్టర్ సుంకర మహేంద్ర, ఎన్ జానీభాషా, ప్రిన్స్‌పాల్ వి.వి.ఎస్ కుమార్, కార్యక్రమం కన్వీనర్ ఎస్. కల్పన పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

లయోలలో బిజినెస్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన


మాట్లాడుతున్న అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శౌర్య

భారతీనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సర విద్యార్థులకు బిజినెస్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు చెందిన ఐసీఎఫ్ఏఐ బిజినెస్‌స్కూల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శౌర్య పాల్గొని, విద్యార్థులకు ఆధునిక పరిజ్ఞానం, మెళుకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.మహేష్, డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధిపతి ఫాదర్ డాక్టర్ ఎస్.ఇమ్మానుయేల్, ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ ఎం.విజయ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనమిత్ర ప్రకటనతో ఆటో డ్రైవర్లలో ఆనందం

లబ్బీపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన వాహనమిత్ర పథకంతో రాష్ట్రవ్యాప్తంగా ఆటో, క్యాబ్ డ్రైవర్లలో ఆనందం నెలకొందని హజ్ కమిటీ చైర్మన్ హజి హసన్ బాషా పేర్కొన్నారు. లబ్బీపేటలోని హజ్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల పక్షపాతి అని మరోసారి నిరూపించిందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టేసిందని అయితే చంద్రబాబు ఎన్ని ఇబ్బందులు ఉన్నా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు పరుస్తూ వారి కళ్ళల్లో ఆనందం చూస్తున్నారన్నారు. కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీఖాన్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు నూకరాజుకు నివాళి

మొగల్రాజపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకుడు నూకరాజు ప్రథమ వర్ధంతి ఏడో డివిజన్ బోయపాటి మాధవరావు రోడ్డులో సీపీఐ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగింది. ఏడో డివిజన్ బోయపాటి మాధవరావు రోడ్డులో సీపీఐ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు నూకరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ సహ కార్యదర్శులు లంకా దుర్గారావు, నక్క వీరభద్రరావు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి గద్దె క్రాంతికుమార్ పరామర్శ

భారతీనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కత్తిగాట్లతో ఆంధ్ర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాలుడిని టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతికుమార్ శుక్రవారం పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, వైద్యులతో సమగ్రంగా చర్చించారు .బాలుడి వైద్య ఖర్చులన్నీ తామే భరిస్తామని, అవసరమైతే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కూడా నిధులు అందించేలా చూస్తామని తెలిపారు. గణేష్‌నగర్‌కు చెందిన బాలుడు(14) విజయవాడలో అదృశ్యమై ఏలూరు శివారులో కత్తిగాట్లతో కనిపించాడు. ఈ ఘటనపై ఇప్పటికే స్థానిక పోలీసులతో గద్దె క్రాంతి కుమార్ మాట్లాడి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. గద్దె రమేష్, యలమంచిలి రాజేంద్రప్రసాద్, తాడి బాబురావు, తదితరులు వెళ్లి బాలుడిని పరామర్శించారు.

నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 20 సెప్టెంబరు 2025

వంటిల్లు

చాలామంది చేపలతో తయారుచేసిన వంటకాలను ఇష్టంగా తింటూ ఉంటారు. ఏడాది పొడవునా చేపలు లభిస్తాయి కానీ వర్షాకాలంలో మాత్రం కొన్ని ప్రత్యేక రకాలు దొరుకుతుంటాయి. అలాంటి అరుదైన చేపలతో తయారుచేసే వంటకాలు మీకోసం...

వర్షంలో పసందుగా.. చేపల విందు..!



పులస చేపల పులుసు

కావాల్సిన పదార్థాలు

• పులస చేప ముక్కలు- 20, పసుపు- అర చెంచా, ఉప్పు- మూడు చెంచాలు, కారం- అయిదు చెంచాలు, పచ్చి మిర్చి- 20, బెండకాయలు- ఆరు, వెన్న- ఒక చెంచా, ఆవనూనె- రెండు చెంచాలు, ధనియాల పొడి- రెండు చెంచాలు, వెల్లుల్లి గడ్డలు- రెండు, జీలకర్ర- మూడు చెంచాలు, ఉల్లిపాయలు- నాలుగు, వేరుశనగ నూనె- 200 గ్రాములు, పంచదార- పావు చెంచా, చింతపండు- పావు కేజీ, నీళ్లు- రెండు గ్లాసులు, కొత్తిమీర- ఒక కట్ట

తయారీ విధానం

• ఉల్లిపాయలను సన్నగా తురిమి పెట్టుకోవాలి. మిక్సీలో వెల్లుల్లి రెబ్బలు, జీలకర్ర వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇది మూడు చెంచాల వరకు ఉంటుంది. బెండకాయలను పెద్ద ముక్కలుగా కోసుకోవాలి. చింతపండును నీళ్లలో నానబెట్టి గుజ్జు తీసుకోవాలి. పచ్చిమిర్చికి మధ్యలో ఒక గాటు పెట్టుకోవాలి. కొత్తిమీరను శుభ్రం చేసి సన్నగా తరగాలి.

• అడుగు మందంగా ఉన్న వెడల్పాటి పెద్ద గిన్నె తీసుకోవాలి. ఇందులో పులస చేప ముక్కలు, పసుపు, ఉప్పు, కారం, పచ్చి మిర్చి, బెండకాయ ముక్కలు, వెన్న, ఆవ నూనె, ధనియాల పొడి, వెల్లుల్లి-జీలకర్ర ముద్ద రెండు చెంచాలు, ఉల్లిపాయ తురుము, వేరుశనగ నూనె, పంచదార, చింతపండు గుజ్జు వేయాలి. చేత్తో అన్నింటిని కలపాలి. తరవాత నీళ్లు పోసి కలపాలి. ఈ గిన్నెను స్టవ్ మీద పెట్టాలి. పెద్ద మంట మీద పది నిమిషాలు ఉడికించాలి. తరువాత మంట తగ్గించి చిన్న సెగ మీద పావు గంటసేపు మగ్గించాలి. మధ్యమధ్యలో గరిటెతో కలుపుతూ ఉండాలి. చేప ముక్కలు మెత్తబడిన తరవాత ఉప్పు, కారం సరిచూసుకోవాలి. చివరగా ఒక చెంచా వెల్లుల్లి-జీలకర్ర ముద్ద, కొత్తిమీర తరుగు చల్లాలి. రెండు నిమిషాల తరవాత స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారుచేసుకున్న పులస చేపల పులుసు వేడి అన్నం, చపాతీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

చిట్కాలు

• పులుపు తక్కువగా తినేవారు చింతపండును కొద్దిగా తగ్గించుకోవచ్చు. పులుసు ఎంత ఎక్కువగా మరిగితే అంత రుచి పెరుగుతుంది.

• పులస పులుసును తయారుచేసిన తరువాత ఒక పూట ఆగి తింటే మరింత రుచిగా ఉంటుంది.

> చేపల్లో విటమిన్లు, ఖనిజాలు, కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి. చేపలను తరచూ తినడంవల్ల శరీరంలో ఎర్ర రక్త కణాలు పెరుగుతాయి. నాడీవ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. చేపల్లో కొల్లాజెన్ అనే ప్రొటీన్ ఉంటుంది. ఇది చర్మం, కీళ్లు, శిరోజాలు, గోళ్ల ఆరోగ్యానికి తోడ్పడుతుంది.

సాల్మన్ చేపల కూర



కావాల్సిన పదార్థాలు

• సాల్మన్ చేప ముక్కలు(స్కిన్ లెస్)- 600 గ్రాములు (తొమ్మిది పెద్ద ముక్కలు), నూనె- మూడు చెంచాలు, మెంతులు- పావు చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, పచ్చి మిర్చి- రెండు, కరివేపాకు- రెండు రెమ్మలు, ఉల్లిపాయ- ఒకటి, టమాటాలు- రెండు, ఉప్పు- తగినంత, పసుపు- అర చెంచా, ధనియాల పొడి- రెండు చెంచాలు, కారం- ఒక చెంచా, కశ్మీరీ కారం- రెండు చెంచాలు, కొత్తిమీర తరుగు- కొద్దిగా

తయారీ విధానం

• ఉల్లిపాయను సన్నని చీలికల్లా కోసుకోవాలి. టమాటాలను చిన్న ముక్కలుగా తరగాలి. స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి, నూనె వేసి వేడి చేయాలి. అందులో సాల్మన్ చేప ముక్కలు పరిచి రెండు వైపులా దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. ఆ నూనెలోనే మెంతులు, కరివేపాకు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలపాలి. తరువాత ఉల్లిపాయ చీలికలు, పసుపు వేసి కొద్దిగా ఉప్పు చల్లి మరోసారి కలపాలి. ఉల్లిపాయ చీలికలు ఎర్రగా వేగాక ధనియాల పొడి, కారం, కశ్మీరీ కారం వేసి బాగా కలపాలి. తరువాత సన్నగా తరిగిన టమాటా ముక్కలు, ఒక చెంచా ఉప్పు వేసి కలిపి ఒక కప్పు నీళ్లు పోసి మూతపెట్టి ఉడికించాలి. గిన్నెలోని మిశ్రమం మెత్తగా ఉడికిన తరువాత... ముందుగా వేయించి పెట్టుకున్న సాల్మన్ చేప ముక్కలను వేసి జాగ్రత్తగా కలపాలి. గిన్నె మీద మూతపెట్టి మరో అయిదు నిమిషాలు మగ్గించాలి. తరువాత మూత తీసి కొద్దిగా కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. సాల్మన్ చేప ముక్కల కూరను వేడి అన్నంలో కలుపుకొని తింటే చాలా రుచిగా ఉంటుంది.


చిట్కాలు

• చేప ముక్కలను చిన్న మంట మీద ఎర్రగా వేపాలి. ముక్క లోపలి వరకూ మెత్తగా ఉడికేలా చూసుకోవాలి.

• టమాటా గ్రేవీలో చేప ముక్కలు వేసిన తరవాత వాటిని జాగ్రత్తగా కదపాలి. లేదంటే ముక్కలు విరిగిపోతాయి.

> చేపలను తినడం వల్ల శరీరానికి ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ లభిస్తాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. మానసిక ఆందోళనను తగ్గిస్తాయి. రక్తనాళాల్లో అడ్డంకులను తొలగిస్తాయి. చేపల్లో ఉండే కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, కాపర్, మాంగనీస్, సిలీనియం లాంటి మినరల్స్ ఎముకలను బలోపేతం చేస్తాయి.

కొరమీను చేపల వేపుడు



కావాల్సిన పదార్థాలు

కొరమీను చేప ముక్కలు- ఒక కేజీ, నూనె- అయిదు గరిటెలు, కారం- రెండుంపావు చెంచాలు, పసుపు- పావు చెంచా, ఉప్పు- ఒకటింపావు చెంచాలు, ధనియాలు- నాలుగు చెంచాలు, సోంపు- అర చెంచా, జీలకర్ర- రెండు చెంచాలు, లవంగాలు- పది, యాలకులు- మూడు, దాల్చిన చెక్క- రెండు చిన్న ముక్కలు, గసగసాలు- మూడు చెంచాలు, పచ్చిమిర్చి- అయిదు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒకటిన్నర చెంచాలు, నిమ్మకాయలు- రెండు

తయారీ విధానం

• మిక్సీలో ధనియాలు, సోంపు, జీలకర్ర, లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, గసగసాలు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పొడిని చిన్న గిన్నెలోకి తీసుకోవాలి.

• వెడల్పాటి గిన్నెలో చేప ముక్కలు, ఒక గరిటె నూనె, రెండు చెంచాల కారం, పసుపు, ఒక చెంచా ఉప్పు వేసి కలపాలి. చేప ముక్కలకు ఉప్పు-కారం మిశ్రమం బాగా పట్టేలా కలపాలి. ఈ గిన్నె మీద మూతపెట్టి అరగంటసేపు నాననివ్వాలి.

• స్టవ్ మీద వెడల్పాటి మూకుడు పెట్టి, నాలుగు గరిటెల నూనె పోసి వేడి చేయాలి. తరువాత చేప ముక్కలు వేసి వాటిని రెండు వైపులకూ తిప్పుతూ ఉండాలి. లోపలిదాకా ఉడికేలా చిన్న మంట మీద ఎర్రగా వేపాలి. మెత్తగా వేగిన చేప ముక్కలను ఒక పళ్లెంలోకి తీయాలి. అదే గిన్నెలో అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలుపుతూ పచ్చి వాసన పోయేదాకా వేపాలి. నూనె పైకి తేలుతున్నప్పుడు పచ్చి మిర్చి చీలికలు, ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న మసాలా పొడి, పావు చెంచా కారం, పావు చెంచా ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత ముందుగా వేయించి పెట్టుకున్న చేప ముక్కలు వేసి జాగ్రత్తగా కలపాలి. చేప ముక్కలకు మసాలా పూర్తిగా పట్టేలా కలిపి రెండు నిమిషాలు వేగనిచ్చి స్టవ్ మీద నుంచి దించాలి. చేప ముక్కల మీద కొద్దిగా నిమ్మరసం చల్లి సర్వ్ చేసుకోవాలి. ఇలా తయారుచేసుకున్న కొరమీను చేపల వేపుడును సాయంత్రంపూట స్నాక్‌లా వేడిగా తినవచ్చు. సాంబారు లేదా రసం అన్నంలోకి నంజుకొని కూడా తినవచ్చు. ఈ చేపల వేపుడు నాలుగు రోజులపాటు నిల్వ ఉంటుంది.

చిట్కాలు

• చేప ముక్కలను వేయించేటప్పుడు ఒక్కోదాన్ని జాగ్రత్తగా రెండోవైపునకు తిప్పాలి. లేదంటే అవి విరిగిపోతాయి.

• నూనె ఎక్కువగా ఉందనిపిస్తే కొద్దిగా తగ్గించుకోవచ్చు. ఉప్పు, కారాలను ఇష్టాన్నిబట్టి పెంచుకోవచ్చు లేదా తగ్గించుకోవచ్చు.

> వారానికి రెండుసార్లు చేపలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల పిల్లలకు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. పెద్దవారిలో అల్జీమర్స్ లక్షణాలు తగ్గుతాయి. మహిళలకు నెలసరి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

మేకప్

వానల్లో చెదరకుండా...



వానలో తడిసినప్పుడు మేకప్ చెదిరిపోతుందనే భయం మహిళలందరికీ ఉంటుంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా... అడపాదడపా వానల్లో తడుస్తూనే ఉంటాం. అయినా మేకప్ చెదిరిపోకుండా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. అవేంటంటే...

చర్మం శుభ్రంగా: ముఖాన్ని సబ్బుతో శుభ్రపరుచుకున్న తర్వాత తేలికపాటి మాయిశ్చరైజింగ్ జెల్ లేదా లోషన్‌ను పూసుకోవాలి. ఆ తర్వాత బ్లాటింగ్ పేపర్‌తో అదనపు చర్మ నూనెలు, మాయిశ్చరైజర్‌లను తొలగించుకోవాలి.

ప్రైమర్‌తో: మేకప్‌కు ముఖాన్ని సిద్ధం చేసుకునేటప్పుడు మొదట ప్రైమర్ అప్లై చేయాలి. ఫేస్, ఐ ప్రైమర్‌లను వాడుకోవడం వల్ల చర్మం నునుపుగా మారి, ఫౌండేషన్ పూతకు తగ్గట్టు తయారవుతుంది.

ఫౌండేషన్ పలుచగా: తేమతో కూడిన వాతావరణంలో ఫౌండేషన్ భారీగా వేసుకుంటే అది ముద్దలుగా మారే ప్రమాదం ఉంటుంది. కాబట్టి మాయిశ్చరైజర్, ప్రైమర్ పలుచగా పూసుకున్న తర్వాత ఫౌండేషన్ కూడా వీలైనంత పలుచగా అప్లై చేసుకోవాలి.

సెట్టింగ్ స్ప్రే: సెట్టింగ్ స్ప్రేతో, మేకప్ ముఖం మీద నిలిచి ఉంటుంది. మేకప్ పూర్తయిన తర్వాత సెట్టింగ్ స్ప్రే వాడుకుని, అది ముఖం మీదే ఆరిపోయేలా చూసుకోవాలి.

ఫిక్సింగ్ పౌడర్: ఈ కాలంలో కాంపాక్ట్ పౌడర్‌కు బదులుగా ట్రాన్స్‌ల్యుసెంట్ పౌడర్‌కు మారాలి. ముఖం తడిసినప్పుడు కాంపాక్ట్ పౌడర్ చెక్కిళ్ల పైనుంచి కారిపోయి చారికలు ఏర్పడతాయి కాబట్టి వానాకాలంలో ఈ పౌడర్ వాడకం మానేయాలి.

వాటర్‌ప్రూఫ్: వాటర్‌ప్రూఫ్ మస్కారా, కాజల్, ఐలైనర్‌లను ఎంచుకోవాలి. సాధారణ ఉత్పత్తులతో పోల్చుకున్నప్పుడు వీటిని తొలగించడం కాస్త ఇబ్బందికరమే అయినప్పటికీ మేకప్ అందవిహీనంగా మారిపోకుండా ఉండడం కోసం ఈ కాలంలో వాటర్‌ప్రూఫ్ సౌందర్య సాధనాలనే వాడుకోవాలి.

బిర్యానీ ఆకుతో బొద్దింకలు మాయం...



వర్షాకాలం వచ్చిందంటే చాలు ఇంట్లో బొద్దింకల బెడద పెరిగిపోతూ ఉంటుంది. బజారు నుంచి రసాయనాలతో కూడిన స్ప్రేలు తెచ్చి వాడినా ప్రయోజనం కనిపించదు. అలాంటప్పుడు బిర్యానీ ఆకుతో బొద్దింకలను ఎలా వదిలించుకోవచ్చో తెలుసుకుందాం...

• బొద్దింకలకు.. బిర్యానీ ఆకు వాసన పడదు. కాబట్టి వంటింట్లో ఉండే అరల్లో, సింక్ దగ్గర, బాత్రూమ్ మూలల్లో ఎండిన బిర్యానీ ఆకులను చిన్న ముక్కలుగా తుంచి ఉంచితే బొద్దింకలన్నీ బయటికి వెళ్లిపోతాయి. రెండు రోజులకోసారి ఈ ఆకులను తీసివేసి కొత్తవాటిని ఉంచుతూ ఉంటే బొద్దింకలు మళ్లీ రావు.

• బాగా ఎండిన బిర్యానీ ఆకులను పొడిలా చేసి బొద్దింకలు తిరిగే ప్రాంతాల్లో చల్లితే రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది.

• స్టవ్ మీద గిన్నె పెట్టి నిండా నీళ్లు పోసి రెండు బిర్యానీ ఆకులు వేసి బాగా మరిగించాలి. ఈ నీటిని వడబోసి ఒక స్ప్రే బాటిల్‌లో పోసి ఇంటి మూలల్లో, కిటికీల దగ్గర, సింక్‌ల దగ్గర పిచికారీ చేస్తే బొద్దింకల బెడద తగ్గుతుంది.

భోజన కుతూహలం

ప్రకృతిలోని ప్రతి ఆకుకూరకు కొన్ని ప్రత్యేకమైన గుణధర్మాలు ఉంటాయి. వీటిని మన పూర్వీకులు గమనించి గ్రంథస్తం చేశారు. ఈ విధంగా 'భోజనకుతూహలం' గ్రంథంలో శనగాకుల వల్ల కలిగే అనేక ప్రయోజనాలు మనకు కనిపిస్తాయి. శనగ ఆకులు పుల్లగా ఉంటాయి. రుచిగా ఉంటాయి. తిన్న తర్వాత ఆలస్యంగా అరుగుతాయి. కఫం, వాతం వల్ల కలిగే వ్యాధుల నుంచి ఉపశమనాన్ని కలగజేస్తాయి. ఈ ఆకులకు ఉన్న లక్షణాలు, ఔషధ గుణాలేమిటో చూద్దాం..

శక్తినిచ్చే శనగాకులు!

• శనగాకులలో ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల మిగిలిన ఆకు కూరల కన్నా వీటి వల్ల ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి.

• శనగాకులకు శరీరవేడిని తగ్గించే తత్వం ఉంది. అందువల్ల క్రమం తప్పకుండా శనగాకుల కూరను తింటే శరీర ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అయితే ఒకే రోజు ఎక్కువ పరిమాణంలో తినకూడదు. అలా తింటే మలబద్ధకం ఏర్పడే అవకాశముంటుంది.

• ముదర శనగ ఆకుల కన్నా.. లేత శనగ ఆకులలో ఎక్కువ పౌష్టిక గుణాలుంటాయి. ఒక బేసిన్‌లో లేదా కుండీలో మట్టి పోసి శనగలు చల్లితే మొలకలు వస్తాయి. ఆరు అంగుళాల ఎత్తు పెరిగిన తర్వాత వాటిని కోసి తినటం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. పాలకూర, క్యాబేజీ కన్నా శనగాకుల్లో ఎక్కువ ఖనిజాలు ఉన్నాయని పౌష్టికాహార నిపుణులు పేర్కొంటున్నారు. అందువల్ల వీటిని సలాడ్స్‌లో కూడా వేసుకొని తినవచ్చు.

> లేత శనగాకులను శుభ్రపరుచుకోవాలి. వాటిలో లేత శనగలను కలపాలి. ఈ రెండింటినీ కలిపి ఉడికించి తాలింపు పెట్టుకుంటే రుచికరమైన కూర తయారవుతుంది. కొందరు ఈ కూరలో ఎండు కొబ్బరి కూడా కలుపుతారు. దీని వల్ల కూర రుచి మరింతగా పెరుగుతుంది

> ఒక మూకుడులో నూనెను వేడిచేసి శనగాకులను వేయించాలి. వీటిలో ఉల్లిపాయలు కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక మిక్సీలో రుబ్బాలి. ఈ పచ్చడికి తాలింపు పెడితే మంచి రుచి వస్తుంది.

> శనగాకులను, కందిపప్పును కలిపి ఉడికించాలి. ఒక మూకుడులో కొద్దిగా నూనె వేడిచేసి దానిలో ఈ మిశ్రమాన్ని వేసి వేయించాలి. దానిలో తాలింపు పెట్టాలి.



• గంగరాజు అరుణాదేవి

గీతు.. ఐటీలో టాప్!

ఆ అమ్మాయి హైస్కూల్ వయసులోనే జేబు ఖర్చుల కోసం వెబ్‌సైట్స్ రూపొందించింది. 19 ఏళ్ల వయసులో హ్యాకథాన్‌లో ఉత్తమ వెబ్ డెవలపర్‌గా ముఖ్యమంత్రి నుంచి అవార్డును అందుకుంది. ఆ ప్రతిభే ఆమెను నేడు ఐదు దేశాలకు ఐటీ కంపెనీలు నడిపే స్థాయికి చేర్చింది. తిరువనంతపురానికి చెందిన గీతు శివకుమార్ ప్రస్థానమిది. ఆసక్తికరమైన ఆమె ఐటీ ప్రయాణం గురించి తెలుసుకుందాం!



ప్రేరణ

కళాశాలలో నిర్వహించిన హ్యాకథాన్‌లో ఏకైక మహిళా విజేతగా పేరు తెచ్చుకుంది గీతు శివకుమార్. ఇది పదిహేనేళ్ల నాటి సంగతి. ఇప్పుడామె మొబైల్ యాప్స్ అభివృద్ధితో పాటు డిజిటల్ మార్కెటింగ్ చేపట్టే కేరళలోని 'పేస్ హైటెక్' సాఫ్ట్‌వేర్ కంపెనీ సిఇఒ. గీతకు పట్టుదలే ప్రధానం. పరిస్థితులకు తగ్గట్టు అలవాటు పడే ధైర్యాన్ని కలిగి ఉండడం, సవాళ్లను ఎదుర్కొనే తెగువను కలిగి ఉండడం ముఖ్యమని అంటుంది గీతు.

"2015లో 'పేస్ హైటెక్'ను ప్రారంభించినప్పుడు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ఉన్నాను. హ్యాకథాన్ విజేతగా, దానికి న్యాయనిర్ణేతగా కూడా వ్యవహరించాను. అయితే ఆ ఈవెంట్ మొత్తంలో నాకు కేవలం ఇద్దరు ముగ్గురు అమ్మాయిలు మాత్రమే కనిపించారు. పరిస్థితిలో ఇంకా మార్పు రాలేదని నేనప్పుడే గ్రహించాను. అమ్మాయిలు పెళ్లి చేసుకుని, అత్తగారింటికి వెళ్లిపోవడమే సరైన మార్గమనే నమ్మకం మన సమాజంలో లోతుగా పాతుకుపోయింది. తల్లితండ్రుల ఒత్తిడి వల్ల ప్రతిభను పక్కనపెట్టిన ఎంతో మంది అమ్మాయిలను నేను చూశాను. కానీ నిజానికి ఆడపిల్లలకు తల్లితండ్రుల మద్దతు ఎంతో అవసరం. అది లేకపోతే ఆర్థిక స్వేచ్ఛను కలిగి ఉండాలి. స్వయంగా అద్దె కట్టుకుంటూ, ఖర్చులను భరించగలిగితే ఆడపిల్లలను నియంత్రించే శక్తి ఎవరికీ ఉండదు" అంటూ సమాజంలో ప్రతిభావంతులైన ఆడపిల్లల పరిస్థితి గురించి ఒక సందర్భంలో వివరించింది గీతు.

స్వయంకృషితో ఎదిగి...

గీతు స్వతంత్ర ప్రస్థానం ఎంతో చిన్న వయసులోనే మొదలైంది. హైస్కూల్‌లో ఉన్నప్పుడే వ్యక్తిగత ఖర్చులకు సరిపడా డబ్బు సంపాదించుకోవడం కోసం ఫ్రీల్యాన్సర్‌గా వెబ్‌సైట్లు రూపొందించడం మొదలుపెట్టింది. 2011లో, రాష్ట్రస్థాయి ఐటి ఫెస్ట్‌లో కేరళకు చెందిన ఉత్తమ వెబ్ డెవలపర్‌గా ముఖ్యమంత్రి ఉమేన్ చాందీ నుంచి అవార్డు కూడా అందుకుంది. కానీ ఆమె అక్కడితో సంతృప్తి చెందలేదు. "పరిశ్రమలో ఎక్కువ దోపిడీకి గురయ్యేవాళ్లు ఫ్రీల్యాన్సర్లే! అతి తక్కువ వేతనానికి ఎంతో ఎక్కువగా శ్రమ పడుతూ ఉంటారు. కాబట్టే నేను ఫ్రీల్యాన్సర్‌గా మిగిలిపోవాలనుకోలేదు. సొంతగా ఏదైనా మొదలుపెడదామని అనుకున్నాను. అది రాత్రికి రాత్రే తీసుకున్న నిర్ణయం కాదు. క్రమేపీ నా మీద నాకు స్పష్టత ఏర్పడిన తర్వాత ఆ నిర్ణయం తీసుకున్నాను. అయితే ఐటి పరిశ్రమ నుంచి ఏమాత్రం మద్దతు దక్కలేదు. అప్పటికే సేవల కంపెనీలతో నిండిపోయిన మార్కెట్లో నేను నిలదొక్కుకోలేనని ఎంతో మంది అన్నారు. కానీ మా కాలేజీ ప్రిన్సిపాల్, కాలేజీలో ఉన్న ఇంక్యుబేటర్‌ను ఉపయోగించుకోమని నన్ను ప్రోత్సహించారు. ఆ విధంగా నాదైన ఉనికిని సృష్టించుకోగలిగే అవకాశాన్ని అందుకోగలిగాను" అంటూ చెప్పుకొచ్చింది గీతు.

కృత్రిమ మేధస్సుకు ధీటుగా...

గీతు... ఇంజనీరింగ్ చివరి ఏడాది నాటికి ప్లేస్‌మెంట్ కంపెనీలు అందించే జీతం కంటే ఎక్కువ సంపాదించడం మొదలుపెట్టింది. అదే సమయంలో సొంత కంపెనీ నడపగలిగే సత్తా ఉన్నప్పుడు, ఇంకొకరి కింద పనిచేయడం ఎందుకని అనుకుంది. కానీ ఆ తర్వాత కృత్రిమ మేధ మూలంగా సాఫ్ట్‌వేర్ పరిశ్రమ వేగంగా మారిపోవడం మొదలుపెట్టింది. గీతు ఆ పరిస్థితికి బెదిరిపోకుండా, దాన్నొక సవాలుగా స్వీకరించింది. "మానవ సృష్టిని ఏదీ అధిగమించలేదని అనుకునేదాన్ని. కానీ కృత్రిమ మేధ కవిత్వం రాసేయడం, విజువల్స్‌ను రూపొందించడం చూసి, నా ఆలోచన తప్పని అర్థం చేసుకున్నాను. ఆ పరిస్థితికి అలవాటుపడకపోతే నా ఉనికి కనుమరుగైపోయే ప్రమాదం ఉందని కూడా గ్రహించాను. అలా కృత్రిమ మేధను పరిగణనలోకి తీసుకుని కంపెనీ సేవలను కొత్తగా తీర్చిదిద్దాను. కృత్రిమ మేధ చేయలేని పనులను కనిపెట్టాను. అలా ఈ రంగంలో వెనకబడిపోకుండా నిలదొక్కుకోగలిగాను" అంటూ తాను అధిరోహించిన అతి పెద్ద అవరోధం గురించి వివరించింది గీతు. నేడు గీతు సారథ్యంలోని 'పేస్ హైటెక్' కంపెనీ కార్యాలయాలు భారతదేశమంతటా విస్తరించాయి. సింగపూర్, మధ్యప్రాచ్యంలో కూడా ఈ కంపెనీ కార్యాలయాలున్నాయి. పట్టుదలతో ప్రయత్నిస్తే సాధ్యంకానిదంటూ ఉండదు. తాజా పోకడలకు తగ్గట్టు మనల్ని మనం మలుచుకుంటూ ముందుకు సాగగలిగితే ఎన్ని సవాళ్లు ఎదురైనా... విజేతగా నిరూపించుకోగలుగుతాం అనడానికి గీతు కథే ఒక ఉదాహరణ.

కొబ్బరిపీచుతో కొత్తగా...

ఒకప్పుడు కొబ్బరిపీచుతో తాళ్లు, మంచాల నులక తయారుచేసేవారు. ఇప్పుడు మాత్రం కొబ్బరికాయ కొట్టగానే దాని పీచును తీసి చెత్తబుట్టలో పడేస్తున్నాం. అలా పారేయకుండా కొబ్బరి పీచును ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకుందాం...

• కొబ్బరి పీచుతో చర్మాన్ని చక్కగా తోముకోవచ్చు. ఈ పీచు పదునుగా ఉంటుంది కాబట్టి కాస్త మెల్లగా రుద్దితే చర్మం మీద పేరుకున్న మురికి పూర్తిగా పోతుంది. మృతకణాలు ఎక్కువగా పేరుకునే మెడ, వీపు, పాదాలను కొబ్బరి పీచుతో రుద్ది కడిగితే మంచి ప్రయోజనం కనిపిస్తుంది. చర్మ రంధ్రాలు లోపలి వరకు శుభ్ర పడతాయి.


• మసిబారిన గిన్నెలు, జిడ్డు పట్టిన డబ్బాలు, దేవుడి దగ్గర ఉపయోగించే కుందులు, మూకుడు తదితరాలను కొబ్బరిపీచుతో రుద్ది శుభ్రం చేయవచ్చు. పీచు మీద కొద్దిగా డిష్ వాషింగ్ లిక్విడ్ వేసి దానితో రుద్దితే జిడ్డు, మసి లాంటివి త్వరగా వదిలిపోతాయి.

• కొబ్బరి పీచును చిన్న ముక్కలుగా కత్తిరించి కుండీల్లోని మట్టిలో కలిపితే మొక్కలకు పూలు బాగా పూస్తాయి. అంతేకాదు మట్టి ఎప్పుడూ తేమగా ఉంటుంది. ఈ పీచును ఎరువులా వాడితే నేలకు, మొక్కలకు పోషకాలు బాగా అందుతాయి. మొక్కల కాండాలు, ఆకుల మీద క్రిమికీటకాలు, ఫంగస్‌లు, ఇతర శిలీంధ్రాలు చేరవు.



• కొబ్బరిపీచుతో పక్షి గూడు, చిలకలు, పిచ్చుకలు, ఏనుగు, ఇంటి నమూనా, డోర్ మ్యాట్ లాంటి గృహాలంకరణ వస్తువులు ఎన్నో తయారుచేయవచ్చు. ఇవి ఇంటి అందాన్ని మరింత పెంచుతాయి.

• కొబ్బరి పీచును చిన్న ముక్కలుగా చేసి, ఒక గిన్నెలో వేసి దానిమీద కర్పూరం బిళ్ల ఉంచి వెలిగించాలి. ఆ గిన్నెను ఇంట్లో ఓ మూలగా ఉంచితే... ఇల్లంతా మంచి సువాసన వ్యాపిస్తుంది. దోమలు, ఈగలు బయటికి వెళ్లిపోతాయి.



స్పోర్ట్స్

ఇక.. సూపర్ సమరం

నేడు లంక-బంగ్లా తొలి పోరు
సోనీ నెట్‌వర్క్‌లో..
ఆసియాకప్

దుబాయ్: ఆసియాకప్ టీ20 టోర్నీలో శనివారం సూపర్-4 పోరుకు తెర లేవనుంది. గ్రూప్ 'ఎ' నుంచి భారత్, పాకిస్థాన్.. గ్రూప్ 'బి' నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు ఇందుకు అర్హత సాధించిన విషయం తెలిసిందే. సూపర్-4లో ప్రతీ జట్టు ఇతర మూడు జట్లతో ఆడాల్సి ఉంటుంది. ఈనెల 26 వరకు మొత్తం ఆరు మ్యాచ్‌లు జరుగనుండగా, టాప్-2లో నిలిచిన జట్లు 28న దుబాయ్‌లో జరిగే ఫైనల్లో తలపడతాయి. ముందుగా శ్రీలంక-బంగ్లాదేశ్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరుగనుంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో నెగ్గి లంక ఊపు మీదుంది. ఓపెనర్లు నిస్సాంక, మెండిస్ ఫామ్‌లో ఉన్నారు. అయితే మిడిలార్డర్ పుంజుకోవాల్సి ఉంది. అటు బంగ్లాదేశ్ జట్టు లంకపై గ్రూప్ దశలో ఎదురైన ఓటమికి ఈసారి బదులు తీర్చుకోవాలనుకుంటోంది. లిట్టన్ దాస్, హ్రిదయ్ బ్యాటింగ్‌లో కీలకం కానుండగా.. స్పిన్నర్లు తన్‌జీమ్, రిషాద్ రాణిస్తుండడం సానుకూలాంశం.

సూపర్-4 మ్యాచ్‌ల షెడ్యూల్

సెప్టెంబరు 20	శ్రీలంక x బంగ్లాదేశ్
సెప్టెంబరు 21	భారత్ x పాకిస్థాన్
సెప్టెంబరు 23	శ్రీలంక x పాకిస్థాన్
సెప్టెంబరు 24	భారత్ x బంగ్లాదేశ్
సెప్టెంబరు 25	బంగ్లాదేశ్ x పాకిస్థాన్
సెప్టెంబరు 26	భారత్ x శ్రీలంక
సెప్టెంబరు 28	ఫైనల్

(మ్యాచ్‌లన్నీ రాత్రి 8 గంటల నుంచి)

ఒమన్.. వణికించెన్!


కలీం (64)

చెమటోడ్చి నెగ్గిన భారత్


సంజూ శాంసన్ (56)

అబుధాబి: ఆసియాకప్ గ్రూప్ దశను టీమిండియా అజేయంగా ముగించింది. అయితే శుక్రవారం జరిగిన నామమాత్రపు పోరులో పసికూన ఒమన్.. భారత్‌ను వణికించింది. పాక్‌పై 67, యూఏఈపై 130 పరుగులకే కుప్పకూలిన ఈ జట్టు వరల్డ్ చాంపియన్ భారత్‌పై మాత్రం అటు బౌలింగ్‌లో.. ఇటు బ్యాటింగ్‌లోనూ బెంబేలెత్తించడం విశేషం. కాగా, ఆరంభంలో కాస్త నిదానంగా ఆడడంతో భారీ స్కోరు ఛేదనలో ఆ జట్టు వెనుకబడింది. దీంతో చివరకు భారత్ 21 పరుగుల తేడాతో గట్టెక్కింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 188 పరుగులు చేసింది. సంజూ శాంసన్ (45 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 56), అభిషేక్ (15 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 38), తిలక్ (18 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 29) రాణించారు. ఫైజల్, కలీం, జితేన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఒమన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 167 పరుగులు చేసి ఓడింది. ఆమిర్ కలీం (46 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 64), హమ్మద్ మీర్జా (33 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 51) చెలరేగారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సంజూ శాంసన్ నిలిచాడు.

ఆకట్టుకున్న కలీం, మీర్జా: భారీ ఛేదనలో ఒమన్ బ్యాటర్లు గట్టిగానే పోరాడారు. దీంతో భారత బౌలర్లు పవర్‌ప్లేలో ఒక్క వికెట్ కూడా తీయలేదు. బంతికో పరుగు చొప్పున సాధించిన జతిందర్ (32)ను తొమ్మిదో ఓవర్‌లో కుల్దీప్ అవుట్ చేశాడు. ఆ తర్వాత వికెట్ల పతనం సాగుతుందనుకున్నా.. 43 ఏళ్ల ఓపెనర్ ఆమిర్ కలీంకు హమ్మద్ మీర్జా జత కలవడంతో ఎదురుదాడి ఆరంభమైంది. 13వ ఓవర్ నుంచి లక్ష్యం వైపు వేగంగా సాగారు. అటు కలీం 38 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కుల్దీప్ ఓవర్‌లో మీర్జా రెండు సిక్సర్లతో జోరు చూపాడు. 18 బంతుల్లో 48 రన్స్ అవసరమవగా.. చేతిలో 9 వికెట్లు ఉండడంతో ఒమన్ సంచలనం చేస్తుందా? అనిపించింది. కానీ 18వ ఓవర్‌లో కలీమ్‌ను హర్షిత్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ వెంటనే 30 బంతుల్లో అర్ధసెంచరీ చేసిన మీర్జా సైతం వెనుదిరగడంతో ఒమన్‌కు ఓటమి ఖరారైంది.

శాంసన్ నిలకడగా..: బ్యాటర్లకు తగిన ప్రాక్టీస్ కోసం టాస్ గెలవగానే భారత్ బ్యాటింగ్‌ను ఎంచుకుంది. దీంతో ఒమన్‌పై సులువుగా 200 స్కోరు సాధిస్తారని అంతా భావించారు. కానీ అందరినీ ఆశ్చర్యపరుస్తూ ఆ జట్టు బౌలర్లు ఏకంగా 8 వికెట్లు పడగొట్టారు. స్లో పిచ్ కావడంతో బ్యాటర్లు స్వేచ్ఛగా ఆడలేకపోయారు. కానీ ఓపెనర్ అభిషేక్ మాత్రం సహజశైలిలో చెలరేగాడు. వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన శాంసన్ నిలకడగా ఆడి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ జోడీ తొలి వికెట్‌కు 66 పరుగులు జోడించింది. అయితే కెప్టెన్ సూర్యకుమార్ మాత్రం సహచరులనందరినీ ముందుగా పంపి తను పదకొండో నెంబర్‌గా డగౌట్‌కే పరిమితమయ్యాడు. ఇక రెండో ఓవర్‌లోనే ఓపెనర్ గిల్ (5)ను పేసర్ ఫైజల్ కళ్లుచెదిరే బంతితో బౌల్డ్ చేసి షాకిచ్చాడు. అభిషేక్ ధాటికి పవర్‌ప్లేలో జట్టు 60/1 స్కోరుతో నిలిచింది. ఏడో ఓవర్‌లో శాంసన్ 6,4తో 12 రన్స్ సాధించగా.. తర్వాతి ఓవర్‌లోనే అభిషేక్, హార్దిక్ (1) వెనుదిరిగారు. అనంతరం ఉన్న కాసేపు అక్షర్ (26) వేగంగా ఆడాలని ప్రయత్నించి శాంసన్‌తో నాలుగో వికెట్‌కు 45 పరుగులు జోడించాడు. దూబే (5) విఫలం కాగా.. తిలక్ వచ్చీ రాగానే భారీ షాట్లకు వెళ్లి 16వ ఓవర్‌లో 6,4తో స్కోరులో కదలిక తెచ్చాడు. అటు శాంసన్ ఓ ఫోర్‌తో 41 బంతుల్లో తన కెరీర్‌లో నెమ్మదైన హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కానీ ఈ ఇద్దరూ వరుస ఓవర్లలో అవుట్ కావడంతో చివరి మూడు ఓవర్లలో జట్టు 21 రన్స్ మాత్రమే సాధించింది.

స్కోరుబోర్డు

భారత్: అభిషేక్ (సి) శుక్లా (బి) రామనంది 38, గిల్ (బి) షా ఫైజల్ 5, శాంసన్ (సి) బిస్త్ (బి) షా ఫైజల్ 56, హార్దిక్ (రనౌట్) 1, అక్షర్ (సి) శుక్లా (బి) ఆమిర్ కలీం 26, శివమ్ దూబే (సి) జతిందర్ (బి) ఆమిర్ కలీం 5, తిలక్ (సి) జిక్రియా ఇస్లామ్ (బి) రామనంది 29, హర్షిత్ (నాటౌట్) 13, అర్ష్‌దీప్ (రనౌట్) 1, కుల్దీప్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 188/8; వికెట్ల పతనం:** 1-6, 2-72, 3-73, 4-118, 5-130, 6-171, 7-176, 8-179; **బౌలింగ్:** షకీల్ 3-0-33-0, షా ఫైజల్ 4-1-23-2, నదీమ్ 1-0-19-0, జితెన్ రామనంది 4-0-33-2, సమయ్ శ్రీవాత్సవ 2-0-23-0, జిక్రియా ఇస్లామ్ 3-0-23-0, ఆమిర్ కలీం 3-0-31-2.

ఒమన్: జతిందర్ (బి) కుల్దీప్ 32, ఆమిర్ కలీం (సి) హార్దిక్ (బి) హర్షిత్ 64, హమ్మద్ మీర్జా (సి/సబ్) రింకూ (బి) హార్దిక్ 51, జిక్రియా ఇస్లామ్ (నాటౌట్) 0, వినాయక్ శుక్లా (సి/సబ్) రింకూ (బి) అర్ష్‌దీప్ 1, రామనంది (నాటౌట్) 12; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 167/4; వికెట్ల పతనం:** 1-56, 2-149, 3-154, 4-155; **బౌలింగ్:** హార్దిక్ 4-0-26-1, అర్ష్‌దీప్ 4-0-37-1, హర్షిత్ 3-0-25-1, కుల్దీప్ 3-0-23-1, అక్షర్ 1-0-4-0, శివమ్ దూబే 3-0-31-0, తిలక్ 1-0-8-0, అభిషేక్ 1-0-12-0.

సెమీస్‌లో సాత్విక్ జోడీ



సింధుకు మళ్లీ నిరాశ
చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్

షెన్‌జెన్ (చైనా): గతవారం హాంకాంగ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి జోడీ వరుసగా రెండో టోర్నీలోనూ సత్తా చాటుతోంది. ఈ భారత జంట చైనా మాస్టర్స్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక, సింగిల్స్ ఏస్ షట్లర్ పీవీ సింధు మరోసారి నిరాశపరుస్తూ క్వార్టర్‌ఫైనల్‌తోనే తన పోరాటాన్ని ముగించింది. సింధు 14-21, 13-21తో టాప్ సీడ్, ఒలింపిక్ చాంపియన్ అన్ సే యంగ్ (కొరియా) చేతిలో పరాజయం పాలైంది. ఇక 8వ సీడ్ సాత్విక్/చిరాగ్ ద్వయం 21-14, 21-14తో చైనా జంట రెన్ గ్జియాంగ్ యు/గ్జీ హావోనాన్‌ను ఓడించింది. శనివారం జరిగే సెమీఫైనల్లో రెండో సీడ్, మలేసియా జంట ఆరోన్ చియా/సో వూయి యిక్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.

టాస్‌కు 4 నిమిషాల ముందు..

దుబాయ్: పాకిస్థాన్‌తో గత ఆదివారం జరిగిన ఆసియా కప్ మ్యాచ్ సందర్భంగా ఆ జట్టుతో టీమిండియా క్రికెటర్లు కరచాలనం చేయకపోవడం పెద్ద దుమారం రేపింది. కెప్టెన్లు సూర్యకుమార్, ఆఘా కరచాలనం చేసుకోరనే సమాచారం టాస్‌కు నాలుగు నిమిషాల ముందు మాత్రమే పైక్రాఫ్ట్‌కు అందిందట! ఈ విషయాన్ని ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) వేదిక మేనేజర్ ఆండీకి చేరవేశాడట. టాస్ సందర్భంగా ఒకవేళ సల్మాన్ భారత సారథికి షేక్‌హ్యాండ్ ఇవ్వబోతే.. అందుకు సూర్యకుమార్ తిరస్కరిస్తే పాకిస్థాన్ కెప్టెన్‌కు అది ఇబ్బందిగా ఉంటుందని పైక్రాఫ్ట్ భావించాడు. దాంతో సూర్యకుమార్‌తో కరచాలనం ఉండబోదని ఆఘాకు ఆండీ చెప్పాడు. కానీ పీసీబీ వేరేగా అర్థం చేసుకొని పైక్రాఫ్ట్‌పై విమర్శలు చేసింది.

భారత్ X ఆస్ట్రేలియా
మహిళల మూడో వన్డే నేడు
(మ. 1.30 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..)

వెల్లలగెకు పితృ వియోగం

అబుధాబి: ఆసియాకప్ సూపర్-4లో ప్రవేశించిన శ్రీలంక జట్టు శిబిరంలో విషాదం అలుముకొంది. 22 ఏళ్ల యువ స్పిన్నర్ దునిత్ వెల్లలగె తండ్రి సురంగ గుండెపోటుతో మరణించాడు. గురువారం అఫ్ఘాన్‌తో మ్యాచ్ జరుగుతుండగానే ఈ వార్త జట్టు సిబ్బందికి తెలిసింది. అయితే మ్యాచ్ ముగిసిన తర్వాతే ఈ విషాదాన్ని దునిత్‌కు తెలిపారు. దీంతో వెంటనే అతను జట్టును వీడి స్వదేశానికి వెళ్లాడు. కెరీర్‌లో ఐదో టీ20 మ్యాచ్ ఆడిన వెల్లలగెకు ఇదే తొలి ఆసియాకప్. మరోవైపు అఫ్ఘాన్ ఇన్నింగ్స్‌లో వెల్లలగె చివరి ఓవర్ వేయగా.. నబీ వరుసగా ఐదు సిక్సర్లు బాది 32 రన్స్ అందించిన విషయం తెలిసిందే. అయితే స్పిన్నర్ తండ్రి మరణ వార్త విని నబీ కూడా షాక్‌కు గురయ్యాడు.

ఆసియా స్కేటింగ్‌లో అర్ణవ్‌కు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా ఓపెన్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ క్రీడాకారుడు పి.అర్ణవ్ రెడ్డి కాంస్యం నెగ్గాడు. డెహ్రాడూన్‌లోని హిమాద్రి ఐస్ రింక్‌లో జరిగిన ఈ పోటీల్లోని 333 మీటర్ల రేసులో అర్ణవ్ తృతీయ స్థానంలో నిలిచాడు. కోచ్‌లు ఖదీర్, సయ్యద్ ఎహసాన్ అహ్మద్ వద్ద అర్ణవ్ శిక్షణ తీసుకున్నాడు.

పడిక్కళ్ సెంచరీ

భారత్ 'ఎ' 531/7 డిక్లేర్
ఆసీస్ 'ఎ'తో మ్యాచ్ డ్రా

బెంగళూరు: భారత్-ఆస్ట్రేలియా 'ఎ' జట్ల మధ్య జరిగిన తొలి అనధికార టెస్టు డ్రాగా ముగిసింది. దేవ్‌దత్ పడిక్కళ్ (150) భారీ శతకం సహాయంతో శుక్రవారం చివరి రోజు భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌ను 531/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. జురెల్ 140 రన్స్ చేశాడు. టీ విరామానంతరం ఒక్క పరుగు ఆధిక్యంతో ఆసీస్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. 16 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 56 రన్స్ చేశాక, వర్షం కారణంగా మ్యాచ్ ముందుకు సాగలేదు. దీంతో ఇరు జట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు.

టైటాన్స్ గెలిచింది!

జైపూర్: ఈ సీజన్ ప్రొ కబడ్డీ లీగ్‌లో వరుస వైఫల్యాలతో నిరాశపరుస్తున్న తెలుగు టైటాన్స్‌కు ఊరట లభించింది. వరుసగా మూడు ఓటముల అనంతరం విజయాన్ని నమోదు చేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 43-29తో తమిళ్ తలైవాస్‌ను చిత్తు చేసింది. ఓవరాల్‌గా 9 మ్యాచుల్లో టైటాన్స్‌కిది నాలుగో గెలుపు. మరో మ్యాచ్‌లో హరియాణా 34-30తో పుణెరి పల్టాన్‌కు షాకిచ్చింది.

బోల్ట్ సరసన లైల్స్



- నాలుగోసారి 200 మీ. టైటిల్ కైవసం
- వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

టోక్యో: అమెరికా స్టార్ నోవా లైల్స్ జమైకా దిగ్గజ స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్ రికార్డును సమం చేశాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో లైల్స్ వరుసగా నాలుగోసారి 200 మీటర్ల స్ప్రింట్ టైటిల్ కొల్లగొట్టాడు. పారిస్ ఒలింపిక్స్ ఫైనల్లో తలపడిన ఎనిమిదిమంది రన్నర్లు బరిలో దిగడంతో శుక్రవారంనాటి ప్రపంచ అథ్లెటిక్స్ 200 మీ. ఫైనల్ హోరాహోరీగా సాగింది. కానీ అందర్నీ వెనక్కునెట్టిన నోవా 19.52 సె. టైమింగ్‌తో స్వర్ణం గెలిచాడు. దాంతో గతంలో ఈ ఫీట్ సాధించిన జమైకా గ్రేట్ బోల్ట్ సరసన లైల్స్ చేరాడు. అమెరికాకే చెందిన కెన్నీ బెడ్నరెక్ (19.58 సె.), రజతం, జమైకా రన్నర్ కెన్నీ లెవెల్ (19.64సె.) కాంస్యం చేజిక్కించుకున్నారు. ఒలింపిక్ చాంపియన్ లెస్లీ టెబెగో నాలుగో స్థానంలో నిలిచాడు.


మెలిస్సా జఫర్సన్

మెలిస్సా గోల్డెన్ డబుల్: గత పోటీల మహిళల 200 మీ. విజేత షెరికా జాక్సన్ (జమైకా) టైటిల్ నిలబెట్టుకోలేకపోయింది. 22.18 సె.లలో గమ్యం చేరిన షెరికా కాంస్యానికే పరిమితమైంది. మెలిస్సా జఫర్సన్ ఉడెన్ (21.66సె.) స్వర్ణం సొంతం చేసుకోగా, అమీ హంట్ (బ్రిటన్- 22.14సె.) రజతం నెగ్గింది. ఈసారి 100 మీ. స్ప్రింట్‌లోనూ టైటిల్ అందుకున్న జఫర్సన్ 200మీ. టైటిల్‌తో 'గోల్డెన్' డబుల్ సాధించింది.

బిజినెస్

వారసులకు సులభంగా సెక్యూరిటీల బదిలీ

జనవరి 1 నుంచి అమలు : సెబీ

న్యూఢిల్లీ: నామినీల నుంచి వారసులకు షేర్లు, రుణ పత్రాలు, మ్యూచువల్ ఫండ్స్ వంటి సెక్యూరిటీల బదిలీని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ సులభతరం చేసింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం నామినీలు వీటిని చట్టబద్ధ వారసులకు బదిలీ చేస్తే కొన్ని సమయాల్లో వాటిని 'బదిలీ'గా పరిగణించి, మూలధన లాభాల పన్ను (సీజీటీ) విధిస్తున్నారు. అయితే 1961 నాటి ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 47 (ఐఐఐఎ) ప్రకారం ఇలాంటి లావాదేవీలపై చెల్లించే పన్నుపై నామినీలు రిఫండ్ క్లెయిమ్ చేసుకోవచ్చు. దీనికి వచ్చే ఏడాది జనవరి 1 నుంచి తెరపడనుంది. ఇందుకోసం టీఎల్‌హెచ్ (ట్రాన్స్‌మిషన్ టు లీగల్ హెయిర్స్) పేరుతో కొత్త కోడ్ అమలు చేస్తారు. దీనివల్ల నామినీలపైనా ఎటువంటి పన్నుల భారం పడదని సెబీ పేర్కొంది.

ఏఐఎఫ్‌ల ఎన్‌ఏవీలు

ప్రత్యామ్నాయ పెట్టుబడి పథకాల (ఏఐఎఫ్) నికర ఆస్తుల విలువ (ఎన్‌ఏవీ)ల ప్రకటనల్లో పారదర్శకత కోసం సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి శుక్రవారం ఒక సర్క్యులర్ జారీ చేసింది. ఈ సంస్థలు ఇక ప్రతి 15 రోజులకు ఒకసారి తమ డిపాజిటరీ వ్యవస్థల్లో ఆయా పథకాల ఎన్‌ఏవీలను అప్‌డేట్ చేయాలని ఆదేశించింది. ఒకవేళ ఈ సంస్థలే ఈ పథకాల పెట్టుబడుల విలువను లెక్కిస్తే ఏ తేదీన లెక్కించారనే విషయాన్ని తమ రికార్డుల్లో నమోదు చేయాలని సెబీ కోరింది. ఈ సర్క్యులర్‌ను 45 రోజుల్లో ఏఐఎఫ్‌లు అమలు చేయాలని సెబీ కోరింది.

ఏటా రూ.120 కోట్ల పెట్టుబడులు

- కొత్తగా 12-14 షోరూమ్స్ ఏర్పాటు
- లైఫ్‌స్టైల్ ఇంటర్నేషనల్ సీఈఓ దేవ్ అయ్యర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దుబాయ్‌కి చెందిన ల్యాండ్‌మార్క్ గ్రూప్ సంస్థ.. లైఫ్‌స్టైల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఏటా రూ.120 కోట్ల పెట్టుబడులతో కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. శుక్రవారం నాడిక్కడ సంస్థ సీఈఓ, ఈడీ దేవ్ అయ్యర్.. టాలీవుడ్ నటి పూజా హెగ్డేతో కలిసి దసరా కలెక్షన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అయ్యర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా లైఫ్‌స్టైల్ 124 స్టోర్లను నిర్వహిస్తోందని, విస్తరణలో భాగంగా ప్రతి సంవత్సరం కొత్తగా 12-14 షోరూమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఏటా రూ.120 కోట్ల వరకు పెట్టుబడులు పెడుతున్నట్లు ఆయన వివరించారు. కాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సంస్థ 14 స్టోర్స్‌ను నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 4 షోరూమ్స్‌ను ప్రారంభించనున్నట్లు అయ్యర్ తెలిపారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో లైఫ్‌స్టైల్ టర్నోవర్ రూ.5,000 కోట్లుగా ఉందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రెండంకెల వృద్ధిని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. లైఫ్‌స్టైల్ మొత్తం ఆదాయంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల వాటా 11 శాతంగా ఉందన్నారు. వస్త్రాలపై జీఎస్‌టీ తగ్గింపు రిటైల్ పరిశ్రమలో జోష్ నింపనుందని, దీంతో ఈ పండగ సీజన్‌లో అమ్మకాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

ప్రమోటర్ల చేతికే గాయత్రి ప్రాజెక్ట్స్

రూ.2,400 కోట్ల ఓటీఎస్‌కు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం

70% బకాయిల మాఫీ
బ్యాంకులపై రూ.5,700 కోట్ల భారం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన గాయత్రి ప్రాజెక్ట్స్‌పై దాఖలైన దివాలా పరిష్కార పిటిషన్ కొలిక్కి వచ్చింది. వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద రూ.2,400 కోట్లు చెల్లించి కంపెనీని తిరిగి సొంతం చేసుకునేందుకు సంస్థ ప్రమోటర్లయిన మాజీ ఎంపీ టీ సుబ్బరామి రెడ్డి కుటుంబ సభ్యులు చేసిన ప్రతిపాదనకు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), హైదరాబాద్ బెంచ్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా రూ.750 కోట్లను 90 రోజుల్లో చెల్లించాల్సి ఉంటుంది. కెనరా బ్యాంక్ నేతృత్వంలోని రుణదాతల కమిటీ (సీఓసీ)లోని 97 శాతం మంది ఇందుకు ఆమోదం తెలపడంతో ఎన్‌సీఎల్‌టీ ఇందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో గాయత్రి ప్రాజెక్ట్స్ నుంచి తమకు రావాల్సిన రూ.8,100 కోట్ల రుణ బకాయిల్లో రూ.5,700 కోట్లకు (70 శాతం) ఆశలు వదులుకున్నట్టయింది. గాయత్రికి రుణాలిచ్చిన బ్యాంకుల్లో కెనరా బ్యాంక్‌తో పాటు బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), ఐడీబీఐ బ్యాంక్ ఉన్నాయి. కాగా గాయత్రి ప్రాజెక్ట్స్ ఇప్పటికే రుణదాతల వద్ద రూ.115 కోట్లు డిపాజిట్ చేసినట్లు తెలిసింది.

ఇదీ కథ: సుబ్బరామి రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు గాయత్రి ప్రాజెక్ట్స్‌ను ప్రమోట్ చేశారు. ఈపీసీ రంగంలో అనేక ప్రాజెక్టులు చేపట్టిన ఈ కంపెనీ కెనరా బ్యాంక్ నేతృత్వంలోని బ్యాంకులకు రూ.8,100 కోట్ల రుణ బకాయిలు చెల్లించడంలో విఫలమైంది. దీంతో 2022 నవంబరులో బ్యాంకులు కంపెనీపై దివాలా పిటిషన్ ఫైల్ చేశాయి. అయితే ఏ కంపెనీ కూడా గాయత్రి ప్రాజెక్ట్స్‌ను కొనుగోలు చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో 2024 జనవరిలో రుణదాతలు కంపెనీ లిక్విడేషన్‌కు అనుమతి కోరుతూ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించారు. తాజాగా సుబ్బరామి రెడ్డి కుటుంబమే ఓటీఎస్ కింద రూ.2,400 కోట్లు చెల్లించేందుకు ముందుకు వచ్చింది. దీంతో బ్యాంకులు ఈ రుణ ఖాతాను క్లోజ్ చేయాలని నిర్ణయించాయి.

ఏపీలో వేదాంతకు మాంగనీస్ బ్లాక్

న్యూఢిల్లీ: వేదాంత గ్రూప్ ఆంధ్రప్రదేశ్‌లో మాంగనీస్ ఖనిజ నిక్షేపాల కోసం అన్వేషణకు సిద్ధమవుతోంది. శ్రీకాకుళం జిల్లాలోని గంగువారి సిగడం మండలంలో పున్నం గ్రామం వద్ద 152 హెక్టార్లలో ఈ అన్వేషణ జరిపే కాంట్రాక్టును కంపెనీ వేలంలో దక్కించుకుంది. 'ఏపీలోని పున్నం బ్లాకులో మాంగనీసు ఖనిజ అన్వేషణ, ఉత్పత్తి కోసం సంస్థ వేసిన బిడ్‌ను కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని గనులు, భూగర్భ శాఖ ప్రిఫర్డ్ బిడ్‌గా ఎంపిక చేసింది' అని వేదాంత గ్రూప్ శుక్రవారం బీఎస్ఈకి తెలిపింది. పెర్‌ఫార్మెన్స్ గ్యారెంటీ, చట్టబద్ధమైన అనుమతులు, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అనుమతులకు లోబడి వేదాంత ఈ బ్లాకులో మాంగనీస్ ఖనిజ అన్వేషణ, ఉత్పత్తి చేపడుతుంది.

వడ్డీ రేట్లు తగ్గించిన బీఓబీ, ఐఓబీ

న్యూఢిల్లీ: దేశంలో మరో విడత వడ్డీ రేట్ల తగ్గింపు ప్రారంభమైంది. ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) ఇందుకు శ్రీకారం చుట్టాయి. అదనపు నిధుల సమీకరణ ఖర్చుల ఆధారంగా నిర్ణయించే తమ ఎంసీఎల్ఆర్ రుణాల వడ్డీ రేట్లను 15 బేసిస్ పాయింట్లు (వంద బేసిస్ పాయింట్లు ఒక శాతానికి సమానం) తగ్గిస్తున్నట్టు ఈ రెండు బ్యాంకులు ప్రకటించాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




20వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	130
వరంగల్	115	గుంటూరు	132
కరీంనగర్	115	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	120
కర్నూలు	115	నెల్లూరు	125
విశాఖపట్నం	134	అనంతపురం	125
గోదావరి	130		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,330 ▲	1,02,050 ▲	1,43,000 ▲
విజయవాడ	1,13,250 ▼	1,07,500 ▲	1,32,150 ▲
విశాఖపట్నం	1,13,740 ▲	1,02,500 ▲	1,43,000 ▲
రాజమండ్రి	1,11,330 ▲	1,02,050 ▲	1,32,600 ▲
ప్రొద్దుటూరు	1,14,050 ▲	1,04,930 ▲	1,33,300 ▲
ముంబై	1,09,775 ▼	1,00,554 ▼	1,28,000 ▲

ఐ ఫోన్ 17 కోసం బారులు



న్యూఢిల్లీ: యాపిల్ కంపెనీ శుక్రవారం భారత మార్కెట్లో విడుదల చేసిన ఐఫోన్ 17 కోసం కస్టమర్లు దేశంలోని మూడు ప్రధాన స్టోర్ల ముందు బారులు తీరారు. కొత్త డివైస్‌ను కళ్లారా చూసి, చేజిక్కించుకోవాలన్న ఆతృతతో గురువారం అర్ధరాత్రి నుంచే కస్టమర్లు ముంబై, ఢిల్లీ, బెంగళూరు నగరాల్లోని యాపిల్ స్టోర్ల ముందు క్యూ కట్టారు. ప్రధానంగా యువత అత్యుత్సాహంతో సుమారు 21 గంటలకు పైగా ఐఫోన్ 17 పొందడం కోసం అలాగే క్యూలైన్లలోనే పడిగాపులు పడుతూ కనిపించారు. ఢిల్లీలోని సాకేత్ సిటీ వాక్ మాల్, బెంగళూరులోని హెబ్బాల్‌లో ఆసియా మాల్, ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని జియో వరల్డ్ డ్రైవ్ మాల్ ముందు ఏర్పడిన పొడవైన క్యూలు ఆ బ్రాండ్‌కు గల జనాదరణకు దర్పణం పట్టాయి. స్టోర్లన్నీ ముందుగానే ప్రకటించినట్టుగా ఉదయం 8 గంటలకు తెరిచారు. తాము ముందస్తుగా బుక్ చేసుకుని, చేతుల్లోకి తీసుకున్న ఐఫోన్ 17ను చూపుతూ కస్టమర్లు వెలుపలికి వస్తున్న దృశ్యాలు కనిపించాయి. అమ్మకాలు ప్రారంభమైన తొలిరోజు రికార్డు స్థాయిలో కస్టమర్ల రాక కనిపించిందని రిటైలర్లు ప్రకటించారు. కాగా ముంబైలో ఉదయం ఆరు గంటల ప్రాంతంలో లైన్లో ఉన్న కొందరు కస్టమర్ల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది రంగంలోకి దిగడంతో గొడవ సద్దుమణిగింది. యాపిల్ ఐఫోన్ 17 మన దేశంలో రూ.82,900 నుంచి రూ.2,29,000 ధరల శ్రేణిలో అందుబాటులో ఉంది.

సంగం ఉత్పత్తుల ధరలు తగ్గింపు

పొన్నూరు టౌన్ (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ ఉత్పత్తుల ధరలను సెప్టెంబరు 22 నుంచి తగ్గిస్తున్నట్లు చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. కేంద్రం తగ్గించిన జీఎస్‌టీకి అనుగుణంగా ఆ ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేయాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. యూఎచ్‌టీ పాలు లీటరుకు రూ. 2, పన్నీరు కేజీకు రూ. 15, నెయ్యి కేజీకి రూ. 30, వెన్న కేజీకి రూ. 30, మిల్క్ షేక్స్ రూ. 5, బేకరీ ఉత్పత్తులపై రూ. 20 మేరకు ధరలను తగ్గిస్తున్నట్లు తెలిపారు.

సహకార బ్యాంకుల్లోనూ ఆధార్ ఆధారిత చెల్లింపులు

న్యూఢిల్లీ: గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లోనూ డిజిటల్ ఆర్థిక సేవల విస్తరణకు ప్రభుత్వం మరో కీలక చర్య తీసుకుంది. ఈ ప్రాంతాల్లోని సహకార బ్యాంకులు ఆధార్ ఆధారిత చెల్లింపుల కోసం యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) కొత్త విధానాన్ని ప్రకటించింది. నాబార్డు, ఎన్‌పీసీఐ, సహకార బ్యాంకులతో కలిసి యూఐడీఏఐ ఈ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అభివృద్ధి చేసింది. దీనివల్ల సహకార బ్యాంకుల్లో ఆధార్ ధ్రువీకరణ, ఈకేవైసీ సేవలు సులభమవుతాయి.

బీహెచ్ఈఎల్‌కు రూ.586 కోట్ల జీఎస్‌టీ నోటీస్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బీహెచ్ఈఎల్ (భెల్)కు తెలంగాణ జీఎస్‌టీ అధికారులు పెద్ద షాకిచ్చారు. 2021-22 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.586.43 కోట్ల జీఎస్‌టీ చెల్లించాలని షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరాలకు సంవత్సరాలకు సంబంధించి బీహెచ్ఈఎల్ ఫైల్ చేసిన జీఎస్‌టీ రిటర్న్‌లు, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లలో తేడాల ఆధారంగా ఈ నోటీసు జారీ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా ఈ నోటీసుకు తగిన విధంగా సమాధానం ఇస్తామని బీహెచ్ఈఎల్ తెలిపింది. తెలంగాణ అధికారుల వాదన కోర్టులో నిలబడదని కూడా పేర్కొంది.

మూడు రోజుల లాభాలకు తెర

ముంబై: ఈక్విటీ మార్కెట్ మూడు రోజుల లాభాలకు తెర దించింది. హిండెన్‌బర్గ్ వ్యవహారంలో సెబీ ఇచ్చిన క్లీన్‌చిట్‌తో అదానీ గ్రూప్ షేర్లలో ర్యాలీ ఏర్పడినా బ్లూచిప్ కంపెనీలు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో లాభాల స్వీకారం మార్కెట్‌ను నష్టాల్లోకి నెట్టింది. సెన్సెక్స్ 387.73 పాయింట్ల నష్టంతో 82,626.23 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 528.04 పాయింట్ల వరకు నష్టపోయి 82,485.92 స్థాయిని తాకింది. నిఫ్టీ 96.55 పాయింట్ల నష్టంతో 25,327.05 వద్ద ముగిసింది. అయితే వారం మొత్తం మీద సెన్సెక్స్ 721.53 పాయింట్లు, నిఫ్టీ 213.05 పాయింట్లు లాభపడ్డాయి.

అదానీ షేర్లు జూమ్: సెబీ ఉత్తర్వుల నేపథ్యంలో అదానీ గ్రూప్ కంపెనీలన్నింటి ఉమ్మడి మార్కెట్ క్యాప్ రూ.69,000 కోట్ల మేరకు పెరిగి రూ.13.96 లక్షల కోట్లకు చేరింది. అదానీ పవర్ గరిష్ఠంగా 12.40% లాభపడగా అదానీ టోటల్ గ్యాస్ (7.35%), అదానీ గ్రీన్ ఎనర్జీ (5.33%), అదానీ ఎంటర్‌ప్రైజెస్ (5.04%), అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ (4.70%), సంఘీ ఇండస్ట్రీస్ (1.41%), ఏసీసీ (1.21%), అదానీ పోర్ట్స్ (1.09%), అంబుజా సిమెంట్స్ (0.28%) లాభపడ్డాయి.

'మదనపల్లె ఫైల్స్' కేసులో

మాజీ ఆర్డీవో మురళి అరెస్టు

» చిత్తూరు కోర్టులో హాజరు.. 3 వరకు రిమాండ్

తిరుపతి(నేరవిభాగం)/చిత్తూరు లీగల్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'మదనపల్లె ఫైల్స్' కేసులో మాజీ ఆర్డీవో మురళిని సీఐడీ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. ముందస్తు బెయిల్‌ను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తిరుపతిలోని ఇంట్లో ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చిత్తూరులోని సీఐడీ కోర్టులో హాజరుపరచగా, వచ్చేనెల 3వ తేదీవరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి బాబాజాన్ ఆదేశాలిచ్చారు. దీంతో పోలీసులు మురళిని చిత్తూరు సబ్‌జైలుకు తరలించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో గతేడాది జూలై 21వ తేదీ రాత్రి మంటలు చెలరేగి డాక్యుమెంట్లు కాలిపోయిన విషయం తెలిసిందే.

ధరలేక ఉల్లి రైతు దైన్యం: షర్మిల

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో బెనిఫిట్ షోలకు టికెట్ ధర రూ.వెయ్యికి పెంచడంలో ఉన్న శ్రద్ధ.. ఉల్లి రైతుకు గిట్టుబాటు ధర కల్పించడం కూటమి ప్రభుత్వానికి లేదు' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల శుక్రవారం అన్నారు. 'ఉల్లి రైతును ప్రభుత్వం నిండా ముంచేసింది. రైతుకంట కన్నీళ్లు పెట్టించిన పాపం సీఎం చంద్రబాబుదే. ధరలేక దైన్యంగా ఉన్న ఉల్లిరైతు కళ్లల్లో ఆనందం ఎక్కడుంటుంద'ని షర్మిల ప్రశ్నించారు.

పనితీరు బాలేదంటూ వీఆర్వోలతో గుంజీలు

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పనితీరు బాగలేని వీఆర్వోల చేత శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ గుంజీలు తీయించారు. ఈనెల 18న పుట్టపర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. ఆర్డీఓపై కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వీఆర్వోలు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆర్డీఓతో మాట్లాడుతానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

రాష్ట్రీయ జన సంక్షేమ సేన స్థాపన: చేగొండి

పాలకొల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణం కేంద్రంగా రాష్ట్రీయ జన సంక్షేమ సేన అనే నూతన సామాజిక సంస్థను ఏర్పాటు చేసినట్టు మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య శుక్రవారం ప్రకటించారు.

ముందస్తు బెయిల్ కోసం కింది కోర్టుకు వెళ్లండి

» వైసీపీ నేత ప్రతాప్‌కుమార్‌రెడ్డికి హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కావలి టీడీపీ ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి హత్యకు ప్రణాళిక రచించారనే ఆరోపణలపై నమోదైన కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ముందస్తు బెయిల్ కోసం కింది కోర్టును ఆశ్రయించేందుకు ఆయనకు వెసులుబాటు ఇచ్చింది. ఉత్తర్వుల ప్రతి అందిన నాలుగువారాల్లో కింది కోర్టును ఆశ్రయించాలని స్పష్టం చేసింది. అప్పటివరకు ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను జస్టిస్ వై.లక్ష్మణరావు శుక్రవారం ఆదేశించారు.

కల్తీ నెయ్యి కేసులో నిందితుల బెయిల్ పిటిషన్ల కొట్టివేత

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేయడంపై నమోదైన కేసులో ఇద్దరు నిందితుల ముందస్తు బెయిల్ పిటిషన్లను ఏసీబీ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ కేసులో ఏ13 బోలేబాబా కంపెనీ ఆపరేటర్ సంజయ్‌చౌహాన్, ఏ8 షమీ ఉల్లాఖాన్ నెల్లూరు జిల్లా ఏసీబీ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లను దాఖలు చేశారు. దీనిపై ఈనెల 16న జరిగిన విచారణలో ప్రభుత్వం తరఫున ప్రత్యేక అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయశేఖర్ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనల అనంతరం నిందితుల ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టి వేస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

శ్రీకాకుళంలో హైస్కూల్‌ను దత్తత తీసుకున్న కేంద్ర మంత్రి



శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

» అభినందనలు తెలిపిన మంత్రి లోకేశ్

శ్రీకాకుళం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఏడురోడ్ల జంక్షన్ వద్ద ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు శుక్రవారం పరిశీలించారు. చాలా సమయం పాఠశాలలో గడిపిన ఆయన స్పందిస్తూ... 'నేను ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను దత్తత తీసుకుంటున్నా. హైస్కూల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తా' అని ప్రకటించారు. విషయం తెలుసుకున్న మంత్రి లోకేశ్ ఎక్స్‌లో స్పందించారు. హైస్కూల్‌ను దత్తత తీసుకున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు అభినందనలు తెలిపారు. ఇదే రీతిన వివిధ వర్గాలు పాఠశాలల అభివృద్ధికి చేయూతనందించాలని కోరారు. అందరం కలసి ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను ఆదర్శంగా నిలుపుదామంటూ లోకేశ్ పిలుపునిచ్చారు.

సంక్షేమాధికారి బూతుపురాణం

» ఉద్యోగులకు దూషణలు, వార్నింగ్‌లు

» మహిళా అధికారులపైనా ఇదే తీరు

» వారి దుస్తులపై వ్యాఖ్యలు

» తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్‌రెడ్డి నిర్వాకం

» విద్యార్థినులపైనా హేయమైన భాష

» గూడూరు, వెంకటగిరి ఎమ్మెల్యేల ఫిర్యాదు

» శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తానన్న మంత్రి డోలా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉద్యోగులను బూతులు తిట్టడం, ఉద్యోగం తీసేయిస్తానంటూ వార్నింగ్‌లు ఇవ్వడం, మహిళా ఉద్యోగులనీ చూడకుండా అసభ్యంగా మాట్లాడటం, డ్రెస్సులపై కామెంట్లు చేయడం, చివరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపైనా నోరు పారేసుకోవడం... ఇదీ తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్‌రెడ్డి తీరు. తిరుపతి జిల్లాలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లను గాడిలో పెడతారని రాష్ట్ర ప్రభుత్వం సదుద్దేశంతో ఆ మధ్య నియమించిన ఆ అధికారి హద్దుమీరి ప్రవర్తిస్తున్నారు. ఆయన చేస్తున్న వింత, విచిత్ర విన్యాసాలు ఇటు సిబ్బందికి, అటు విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. విక్రమ్‌రెడ్డి వ్యవహారశైలిపై ఏపీ స్టేట్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ తిరుపతి జిల్లా యూనిట్ ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన మరింత రెచ్చిపోతున్నారు. ఫిర్యాదు చేసిన సిబ్బందిపైనే గాక ఎమ్మెల్యేలపైనా నోరుపారేసుకున్నారని చెబుతున్నారు. జూమ్ మీటింగ్‌ల్లో సైతం ఉద్యోగులపై బూతుపురాణాలు మొదలు పెట్టారు. హాస్టళ్లలో ఉండే బాలికలు, అధికారుల పట్ల నోటికొచ్చినట్లు దూషణలకు దిగుతున్నారు. తనపై ఫిర్యాదు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని, శాశ్వతంగా ఉద్యోగాలకు దూరమవుతారని బెదిరిస్తున్నారు. తనకు మంత్రి పేషీ అధికారులు తెలుసని, కలెక్టర్ మిత్రుడని, ఏసీబీ అధికారులు తనకు సీనియర్లని పదే పదే బెదిరిస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. తిరుపతి జిల్లాకు అధికారిగా నియమించినప్పటి నుంచి ఆయన వైఖరి ఇలాగే ఉందని అంటున్నారు. పత్రికలో రాయలేని రీతిలో బూతులు తిడుతున్నారని వాపోతున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మహిళా ఉద్యోగులు, బాలికలు మంచివాళ్లు కాదంటూ పదే పదే కించపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ హాస్టళ్లలో చదివే విద్యార్థినులు, వారి తల్లిదండ్రుల పట్ల కూడా అనుచితంగా మాట్లాడటం ఆయనకు పరిపాటిగా మారిందంటున్నారు. ప్రతి సందర్భంలోనూ కలెక్టర్ తనకు బాగా దగ్గరని, ఏసీబీ డీఎస్పీ తనకు సీనియర్ అని, అందరి జాతకాలు తీస్తానని బెదిరిస్తున్నారని, తాము ఉద్యోగాలు మానేసుకోవాలని అనిపిస్తోందని పలువురు మహిళా అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతస్థాయి సమావేశంలో కలెక్టర్ ఆయనను వెనకేసుకు రావడంతో మరింత రెచ్చిపోతున్నారు. కలెక్టర్ ఆయనకు ఎస్సీ కార్పొరేషన్ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు కూడా అప్పచెప్పడంతో దానికి సంబంధించిన పనులు కూడా హాస్టల్ అధికారులకు అప్పగిస్తూ వారిపై స్వారీ చేస్తున్నారు. ఆయన మాటకు ఎవరైనా ఎదురు తిరిగితే అంతే సంగతులు. షోకాజ్ నోటీసులు, మెమోలు ఇస్తానని, సస్పెండ్ చేస్తానని బెదిరింపులు ఎక్కువయ్యాయని చెబుతున్నారు. ఇటీవల బదిలీల సందర్భంగా కూడా సిబ్బందిని ఇష్టం వచ్చినట్లు ఆడుకున్నారని, నాలుగో తరగతి సిబ్బంది అంటే ఈ అధికారికి చిన్నచూపని, ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారని ఆరోపిస్తున్నారు. హాస్టల్ మహిళా అధికారుల డ్రెస్సులపై కామెంట్లు చేయడం, వారి వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం ద్వారా మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని చెబుతున్నారు. తన బూతుపురాణం ఎవరైనా రికార్డు చేస్తారేమోనన్న అనుమానంతో ఆయన ఆంక్షలు పెడుతున్నారు. ఈ అధికారి వద్దకు వెళ్లాలంటే ఉద్యోగులు ఫోన్లు బయట పెట్టి పోవాల్సిందేనట. తిరుపతి, చిత్తూరు జిల్లాల వారికి కలిపి జూమ్ మీటింగ్ పెట్టినప్పుడు వసతి గృహాలలో జరిగిన చిన్నచిన్న సంఘటనలు ప్రస్తావించి, సిబ్బందిని అవహేళన చేసి పైశాచిక ఆనందం పొందారని ఆరోపిస్తున్నారు. తిరుపతి జిల్లా ఏసీబీ, విజిలెన్స్ అధికారులు తనకు మిత్రులని, వారికి చెప్పి విచారణ జరిపించి అంతుచూస్తానని, ఉద్యోగాలు లేకుండా చేస్తానని బెదిరిస్తున్నారని చెబుతున్నారు. ప్రొటోకాల్ ఖర్చులు ఇవ్వని హాస్టల్ అధికారులకు చుక్కలు చూపిస్తానంటూ వార్నింగ్ ఇస్తున్నారు.

మంత్రికి ఎమ్మెల్యేల ఫిర్యాదు

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అమరావతికి వచ్చిన ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్.. సాంఘిక సంక్షేమ అధికారి విక్రమ్‌రెడ్డిపై మంత్రికి ఫిర్యాదు చేశారు. అసెంబ్లీలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి ఈ అధికారి నిర్వాకంపై ఫిర్యాదు చేశారు. పేద ఎస్సీ విద్యార్థులను పర్యవేక్షించాల్సిన అధికారిగా ఇలాంటివారిని నియమించడం వల్ల హాస్టళ్లు మరింత దిగజారుతున్నాయని ఎమ్మెల్యేలు అన్నారు. ఈ అధికారిపై శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తామని, ఆయన స్థానంలో మరో అధికారిని నియమిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు.

హాయ్‌ల్యాండ్‌లో దిద్దేందుకు కోటి!

» 62 శాతం మంది మాన్యువల్‌లో ఎంపిక కాలేదు

» ఎంపిక కాని అభ్యర్థుల తరఫు లాయర్ల వెల్లడి

» తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు ధర్మాసనం



అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేసి, తాజాగా పరీక్ష నిర్వహించాలని ఏపీపీఎస్సీ, పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన అప్పీళ్లపై శుక్రవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఈ నేపథ్యంలో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. ఇరుపక్షాలలో ఎవరైన రాతపూర్వక వాదనలు దాఖలు చేయాలనుకుంటే సోమవారంలోగా సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ నిర్వహించింది. అయితే, మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని అప్పటి విచారణలోనే న్యాయమూర్తి నిర్ధారించారు. దీంతో 2022, మే 26న ఇచ్చిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష అర్హుల జాబితాను హైకోర్టు సింగిల్ జడ్జి రద్దు చేశారు. తాజాగా మెయిన్స్ నిర్వహించాలని, ఎంపిక ప్రక్రియను ఆరునెలల్లో పూర్తి చేయాలని 2024, మార్చి 13న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ, నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన వారు అప్పీల్ చేశారు. మరికొందరు.. సింగిల్ జడ్జి తీర్పులోని కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పిటిషన్ వేశారు. ఈ అప్పీళ్లపై హైకోర్టు తుది విచారణ ప్రారంభించింది. గురువారం ప్రారంభమైన వాదనలు శుక్రవారం కొనసాగాయి. ఉద్యోగాలకు ఎంపికకాని అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాదులు జంధ్యాల రవిశంకర్, కేఎస్ మూర్తి, న్యాయవాదులు జొన్నలగడ్డ సుధీర్, షేక్ సలీమ్ వాదనలు వినిపించారు. డిజిటల్ విధానంలో జరిగిన మూల్యాంకనంలో ఎంపికైన అభ్యర్థులలో 62శాతం మంది తదుపరి జరిపిన మాన్యువల్ మూల్యాంకనంలో ఎంపిక కాలేదన్నారు. తెలుగు మాధ్యమంలో పరీక్షరాసిన అభ్యర్థులే ఎక్కువ నష్టపోయారని తెలిపారు. డిజిటల్ మూల్యాంకనంలో ఎంపికకాని అభ్యర్థులు, మాన్యువల్ మూల్యాంకనంలో మంచి పోస్టులు పొందారని పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా మాన్యువల్ విధానంలో మూల్యాంకనం చేసేందుకు జవాబు పత్రాలను 'హాయ్‌ల్యాండ్'కు తరలించారని, మాన్యువల్ మూల్యాంకనాన్ని థర్డ్ పార్టీ ఏజెన్సీకి అప్పగించారని తెలిపారు. అయితే, ఇలా ఇవ్వడాన్ని ఏపీపీఎస్సీలోని ఓ సభ్యుడు వ్యతిరేకించారన్నారు. ఈ అభ్యంతరాలను అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పట్టించుకోలేదని, స్ట్రాంగ్ రూమ్ నుండి జవాబుపత్రాలను హాయ్‌ల్యాండ్‌కు తరలించడం అనుమానించాల్సిన విషయమని వివరించారు. 2021, డిసెంబరు- 2022, ఫిబ్రవరి మధ్య హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరిగిందని, దీనికిగాను అదనంగా బార్‌కోడ్లు, ఓఎంఆర్ షీట్లు, కంట్రోల్ బండిల్స్‌ను ప్రింట్ చేయించారని తెలిపారు. అయితే ఆ ఫలితాలను ప్రకటించలేదన్నారు. "హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం కోసం మొత్తం రూ.1.19 కోట్లు ఖర్చు చేశారు. డిజిటల్ మూల్యాంకనం, మాన్యువల్ మూల్యాంకనంలో కొద్దిశాతం మాత్రమే వ్యత్యాసం ఉందని, త్వరలో ఫలితాలు ప్రకటిస్తామని అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు ప్రకటించారు. వీటన్నిటినీ పరిశీలిస్తే హాయ్‌ల్యాండ్ వేదికగా పేపర్లు దిద్దారనేది స్పష్టమవుతోంది. కొన్ని జవాబుపత్రాలలో రెండు చేతిరాతలు ఉన్న వ్యవహారంపై దర్యాప్తు కమిటీ ఏం తేల్చిందో స్పష్టత లేదు. మెయిన్స్ రద్దు చేసి తాజాగా పరీక్ష నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వండి. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి లేదా సీబీఐ లేదా ఏదైనా స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని నిర్ణయానికి వస్తే... అధికారులుగా వివిధ హోదాల్లో ఉన్న అభ్యర్థులను ఆ స్థానాల నుండి తొలగించండి." అని వాదనలు వినిపించారు.

వారు ఎంపిక కాలేదు: ఏజీ

ఈ సందర్భంగా ధర్మాసనం అడిన పలు ప్రశ్నలకు ఏపీపీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ బదులిస్తూ.. రెండు రకాల చేతిరాతలు ఉన్న జవాబుపత్రాల అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలో ఎంపిక కాలేదన్నారు. రెండు చేతిరాతల వ్యవహారాన్ని తేల్చేందుకు ఏపీపీఎస్సీ కమిటీ వేసిందని, కమిటీ నివేదికను కోర్టు ముందు ఉంచుతామని తెలిపారు. కోర్టు తుది తీర్పుకి లోబడి ఉంటామని ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు హామీ పత్రం ఇచ్చారని చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాదులు సీవీ మోహన్‌రెడ్డి, పి. శ్రీరఘురాం, ఓ. మనోహర్‌రెడ్డి రిప్లై వాదనలు వినిపించారు.

చిత్రజ్యోతి

SINCE 1965



మోటార్ బైక్ రేసర్‌గా శర్వా

శర్వానంద్ కథానాయకుడిగా అభిలాష్ కంకర దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ ఓ చిత్రాన్ని నిర్మిస్తోన్న విషయం తెలిసిందే. మాళవిక నాయర్ కథానాయిక. బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఈ చిత్రంలో శర్వానంద్ మంచి నైపుణ్యాలున్న మోటార్ బైక్ రేసర్‌గా కనిపించబోతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోన్న షూటింగ్‌లో శర్వా బృందంపై రేస్‌కు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సన్నివేశాలు సినిమాలో హైలెట్‌గా ఉండబోతున్నట్లు సమాచారం. కాగా, ఈ చిత్రానికి జె.యువరాజ్ సినిమాటోగ్రఫీని, జిబ్రాన్ సంగీతాన్ని అందిస్తున్నారు.



పవన్ గానం.. అభిమానులకు ఆనందం

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్ 'ఓజీ'. డీవీవీ దానయ్య నిర్మించారు. ఈ నెల 25న చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు సూపర్ హిట్ అయ్యాయి. శుక్రవారం ఈ చిత్రం నుంచి 'వాషి యో వాషి' అనే పాటను విడుదల చేశారు. ఈ పాటను పవన్‌కల్యాణ్ పాడడం విశేషం. పవన్ 'అత్తారింటికి దారేది', 'జానీ' తదితర చిత్రాల్లో పాడి అలరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ గీతాన్ని వింటున్న అభిమానులు తెగ ఖుషీ అయిపోతున్నారు. ప్రియాంక అరుళ్‌మోహన్ కథానాయిక. పవన్ ఓజాస్ గంభీరా అనే శక్తిమంతమైన పాత్రలో, ఇమ్రాన్ హష్మీ 'ఓమీ'గా ప్రతినాయకుడి రోల్‌లో కనిపించనున్నారు. ఈ నెల 21న ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు మేకర్స్.

ఓజీ టికెట్ ధరల పెంపునకు అనుమతి

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన ఓజీ సినిమా టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 25న విడుదల కాబోతున్న ఈ భారీ బడ్జెట్ సినిమాకు రెండు వారాల పాటు టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి కోరుతూ నిర్మాత డీవీవీ దానయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పరిశీలించిన ప్రభుత్వం పది రోజుల పాటు(అక్టోబరు 4వరకూ) అనుమతిచ్చింది. మొదటి రోజు బెనిఫిట్ షో టికెట్ రూ.1,000కి విక్రయించుకోవచ్చని తెలిపింది. రాష్ట్రంలోని అన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.125, మల్టీప్లెక్స్‌లలో రూ.150కు పెంచుకోవచ్చని ఏపీ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎన్టీఆర్‌కు స్వల్ప గాయం



హైదరాబాద్‌లో జరుగుతోన్న ఓ ప్రైవేట్ యాడ్ షూటింగ్‌లో జూనియర్ ఎన్టీఆర్ కాలికి స్వల్ప గాయమైంది. యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా ఆయన కింద పడిపోయారు. వెంటనే వ్యక్తిగత సిబ్బంది ఆయనను సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. ఈ ప్రమాదంపై ఎన్టీఆర్ బృందం ఓ ప్రకటనను విడుదల చేసింది. 'రెండు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సలహా ఇచ్చారు. ఆయన ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారు. 'ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎన్టీఆర్ ఆరోగ్యంపై వస్తున్న ఊహాగానాలను అభిమానులు నమ్మొద్దు' అని పేర్కొంది.

ఆస్కార్‌కు హోమ్‌బౌండ్



బాలీవుడ్ చిత్రం 'హోమ్‌బౌండ్' అరుదైన ఘనతను సాధించింది. 2026లో జరిగే 98వ ఆస్కార్ అవార్డుల పోటీకి భారత్ నుంచి ఈ సినిమా 'ఉత్తమ విదేశీ చిత్రం' విభాగంలో అధికారికంగా ఎంపికైంది. స్నేహం, గౌరవం, బతుకుతెరువు వంటి అంశాలతో హృదయానికి హత్తుకునేలా తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటికే పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రశంసలూ, అవార్డులూ పొందడం విశేషం. ఇషాన్ కట్టర్, విశాల్ జెత్వా, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రధారులుగా 'మసాన్' ఫేమ్ నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించారు. కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదలవుతోంది. కరన్ జోహార్, అపూర్వ మెహతా, అదర్ పూనావాల, సోమేన్ మిశ్రా నిర్మించారు.



కర్మను ఎవరూ తప్పించుకోలేరు

- నాగ్ అశ్విన్





'కల్కి-2' ప్రాజెక్టు నుంచి దీపిక నిష్క్రమించిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా దీపికా పదుకొణె వ్యవహార శైలిపై పోస్టులు కనిపిస్తున్నాయి. పారితోషికం కారణంగానే ఆమెను తప్పించినట్లు వార్తలు వస్తున్నాయి. కొందరు దీపికను సమర్థిస్తూ కామెంట్లు పెడుతుండగా, మరికొందరు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'కల్కి 2898' చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్ పెట్టిన ఓ పోస్టు వైరల్ అయ్యింది. 'కర్మను ఎవరూ తప్పించుకోలేరు... నీ కర్మను నువ్వు అనుభవించాల్సిందే' అని అశ్వత్థామకు శ్రీకృష్ణుడు చెప్పిన సందేశాన్ని షేర్ చేశారు. దానితోపాటు 'జరిగిన దాన్ని ఎవరూ మార్చలేరు. కానీ, తర్వాత ఏం జరగాలో మీరు ఎంచుకోవచ్చు' అనే క్యాప్షన్ జోడించారు. దీంతో దీపికను ఉద్దేశించే నాగ్ అశ్విన్ ఈ పోస్టు పెట్టారని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

ప్రేమకు మరణం లేదు

తేజ

రమణ సాకే, వనిత గౌడ జంటగా సత్య మార్క దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ప్రేమలో రెండోసారి'. సాకే రామయ్య సమర్పణలో సిద్ధ క్రియేషన్స్ బేనర్‌పై సాకే నీరజ లక్ష్మి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను దర్శకుడు తేజ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టీజర్ చాలా బాగుంది. ఈ భూమి ఉన్నంత వరకు ప్రేమకు మరణం లేదు, ప్రేమ కథాంశంతో వచ్చే చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ ఎప్పటికీ ఉంటుంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు సత్య మార్క మాట్లాడుతూ'ఈ సినిమా నేటి యువతకు బాగా కనెక్ట్ అవుతుంది. అక్టోబరులో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు. కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు రమణ సాకే, కథానాయిక వనిత గౌడ తదితరులు మాట్లాడారు.



ఈ విజయం కొత్తవాళ్లకు స్ఫూర్తి

- విజయ్ దేవరకొండ



'ఎవరి సహకారము లేకుండానే ఘన విజయం అందుకున్న 'లిటిల్ హార్ట్స్' చిత్ర బృందం సభ్యులు మరెంతో మంది కొత్తవాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తారు. మనమూ సక్సెస్ అందుకోవచ్చనే ఒక పట్టుదల వారిలో కలుగుతుంది. అందుకే వీళ్లకు సపోర్ట్ చేయాలని అనిపించింది' అని అన్నారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా సాయి మార్తాండ్ తెరకెక్కించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్ బేనర్‌పై ఆదిత్య హాసన్ నిర్మించారు. ఇటీవలె సినిమా విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ 'ఈ చిత్రబృందంతో ఒక సినిమా చేయాలని అనిపిస్తోంది. బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ సినిమా గురించి నాకు చెప్పారు. మా సంస్థ ద్వారా రిలీజ్ చేశాం. భారీ విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు. నిర్మాత బండ్ల గణేశ్ మాట్లాడుతూ 'నేను చాలా రోజుల తర్వాత థియేటర్‌లో చూసిన సినిమా ఇది. సినిమా అంటే ఇలా ఉండాలి అని అనిపించింది' అని చెప్పారు. కార్యక్రమంలో నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి, చిత్ర దర్శకుడు సాయి మార్తాండ్, నటుడు రాజీవ్ కనకాల, నటి అనితా చౌదరి తదితరులు మాట్లాడారు.

వినోదాత్మకం



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న చిత్రం 'కె- ర్యాంప్'. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండా, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దీపావళి సందర్భంగా అక్టోబరు 18న చిత్రం విడుదలవుతోంది. శుక్రవారం చిత్రం టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులోని ప్రేమకథ, యాక్షన్ సన్నివేశాలు, సంభాషణలు ఆకట్టుకున్నాయి. కేరళ నేపథ్యంలో సాగే పూర్తిస్థాయి ఎంటర్టైనర్‌గా సినిమా ఉంటుందని మేకర్స్ తెలిపారు. సాయికుమార్, మురళీధర్ గౌడ్, శివన్నారాయణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఛోటా కె ప్రసాద్, డీఓపీ: సతీశ్ రెడ్డి మాసం, సంగీతం: చేతన్ భరద్వాజ్.

రచయిత ఆకెళ్ల కన్నుమూత



రచయిత, దర్శకుడు ఆకెళ్ల వెంకట సూర్యనారాయణ గురువారం రాత్రి హైదరాబాద్‌లో కన్ను మూశారు. ఆయన వయసు 77 సంవత్సరాలు. చిరంజీవి నటించిన 'మగమహారాజు' రచయితగా ఆకెళ్లకు తొలి చిత్రం. అప్పటి నుంచి దాదాపు 80 చిత్రాలకు ఆయన కథ, మాటలు అందించారు. వీటిల్లో 'స్వాతిముత్యం', 'శ్రుతిలయలు', 'సిరివెన్నెల' 'శ్రీమతి ఒక బహుమతి', 'ఆయనకి ఇద్దరు', 'నాగదేవత', 'ఔనన్నా కాదన్నా' వంటి చిత్రాలు ఉన్నాయి. నరేశ్ నటించిన 'అయ్యయ్యో బ్రహ్మయ్య' చిత్రానికి ఆకెళ్ల దర్శకత్వం వహించారు కూడా. నాటక రచయితగా కూడా ఆకెళ్ల సుప్రసిద్ధులు. నాటక రచయితగా 13 సార్లు నంది అవార్డులు పొంది రికార్డులు నెలకొల్పారు. దాదాపు 200 కథలు, 20 నవలలు రాశారు. సీరియల్స్‌కు దాదాపు 800 ఎపిసోడ్స్ రాశారు. ఆకెళ్లకు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. శనివారం ఆయన అంత్యక్రియలు జరుగుతాయి.



మార్కాపురం మెడికల్ కాలేజీ ఆవరణలో హడావుడి చేస్తున్న వైసీపీ కార్యకర్తలు

'చలో మెడికల్ కాలేజీ'.. తుస్!

» జగన్ పిలుపునకు స్పందన కరువు.. ఆసక్తి చూపని వైసీపీ శ్రేణులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'చలో మెడికల్ కాలేజీ' నిరసనలకు స్పందన కరువైంది. పార్టీ అధినేత జగన్ స్వయంగా ఆదేశించినా ఆశించిన స్థాయిలో శ్రేణులు తరలి రాకపోవడంతో పార్టీ నాయకులు తీవ్ర నిరాశకు గురయ్యారు. జగన్ సహా పార్టీ ముఖ్యనేతలు ఎవరూ కనిపించకపోవడంతో పలుచోట్ల మొక్కుబడిగా నిరసనలు చేపట్టి అయ్యిందనిపించారు. వైసీపీ అధినేత జగన్ సొంతూరు పులివెందులలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనాల వద్ద చేపట్టిన నిరసన నామమాత్రంగా ముగిసింది. ఆ పార్టీ ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, గోవిందరెడ్డి, రమేశ్ యాదవ్ నిరసనలో పాల్గొనలేదు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కూడా నిరసనకు రాలేదు. ఇక.కృష్ణాజిల్లా మచిలీపట్నం, పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, బాపట్ల, ఏలూరు జిల్లా కేంద్రం, రాజమహేంద్రవరం, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం రూరల్ మండలం, పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రి, అన్నమయ్య జిల్లా ఆరోగ్యవరం, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ, నంద్యాల జిల్లాలోని నంద్యాల పట్టణం, నందికొట్కూరు, ఆళ్లగడ్డ,శ్రీశైలం, బనగానపల్లె; కర్నూలు జిల్లా ఆదోని, అన్నమయ్య జిల్లా మదనపల్లెలో వైసీపీ ఆందోళనలకు పెద్దగా స్పందన లభించలేదు. ఇదిలా ఉండగా, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రశ్నించకూడదా అంటూ ప్రభుత్వాన్ని ఉద్దేశించి శుక్రవారం రాత్రి జగన్ ట్వీట్ చేశారు. దీంతో రోజంతా కనిపించని జగన్.. పొద్దుపోయాక తాపీగా ఎక్స్ పోస్టుతో సరిపుచ్చడం ఏమిటంటూ వైసీపీ శ్రేణుల్లోనే అసహనం వ్యక్తమైంది.

ఓబుళాపురం అక్రమ మైనింగ్‌పై 'సుప్రీం' కమిటీ

» మాజీ జస్టిస్ సుధాంశు నేతృత్వంలో ఏర్పాటు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. లీజు సరిహద్దులు గుర్తించి ఎంత మేరకు అక్రమ మైనింగ్ తవ్వకాలు జరిపారో తేల్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధులియా నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. కమిటీ మూడు నెలల్లోగా నివేదిక సమర్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. కేసు తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరికి వాయిదా వేసింది.

నివేదిక ఇవ్వకుండా అభ్యంతరాలు ఎలా చెప్పగలం?

» సీబీఐ కోర్టులో ఆయేషా తండ్రి పిటిషన్

విజయవాడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'మా కుమార్తె హత్య కేసు దర్యాప్తును పూర్తిచేసినట్లు సీబీఐ చెబుతున్నా ఆ నివేదిక మా చేతికి ఇవ్వలేదు. అసలు దర్యాప్తు నివేదికలో ఏముందో తెలియకుండా అభ్యంతరాలను ఎలా చెప్పగలం' అంటూ బీఫార్మసీ విద్యార్థిని ఆయేషామీరా తండ్రి ఇక్బాల్ బాషా విజయవాడ సీబీఐ కోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న సత్యంబాబుపై నమోదైన ఐపీసీ 376, 302 సెక్షన్లలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వయంగా కోర్టుకు వచ్చి చెప్పాలని సీబీఐ కోర్టు ఆమె తల్లిదండ్రులకు కొద్దిరోజుల క్రితం వేర్వేరుగా నోటీసులు జారీ చేసింది. అయితే ఆ నోటీసులను వారు తిరస్కరించారు. శుక్రవారం ఇక్బాల్‌బాషా తరఫున న్యాయవాది పిచ్చుక శ్రీనివాసరావు పిటిషన్ దాఖలు చేశారు.

22 నుంచి అగ్రి కోర్సుల వెబ్ ఆప్షన్లు

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల్లో బైపీసీ విభాగంలో బీఎస్సీ(అగ్రికల్చర్) బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో (2025-26) ప్రవేశాలకు మొదటి దశ ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్లు ఈ నెల 20 నుంచి 22 వరకు జరుగుతాయని రిజిస్ట్రార్ ఎంవీ రమణ శుక్రవారం తెలిపారు.

పోతే పొండి..!

» ఏపీలో జనం లేరు.. అందుకే పిలుస్తున్నారు: డీకే



బెంగళూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలు ఎవరైనా బెంగళూరును వీడాలని అనుకుంటే వెళ్లిపోవచ్చని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. నాసిరకం రహదారుల కారణంగా ఇబ్బంది పడుతున్నామని, బెంగళూరును వీడతామని బ్లాక్ బక్ కంపెనీ సీఈవో రాజేశ్ యబాజీ ఎక్స్‌లో పెట్టిన పోస్టు, తదనంతర పరిణామాలపై ఆయన గురువారం స్పందించారు. 'ఇక్కడి పారిశ్రామికవేత్తలను ఏపీ ప్రభుత్వం తమ దగ్గరకు ఆహ్వానిస్తోంది కదా?' అని విలేకరులు ప్రశ్నించగా, ఏపీలో జనం లేరని....అందుకే పిలుస్తున్నారని వ్యాఖ్యానించారు. "గుంతలు అనేవి పెద్ద సమస్య కాదు. వర్షం వస్తున్నందున ఇలాంటి సమస్య తలెత్తుతోంది" అని శివకుమార్ అన్నారు. ఈ అంశంపై సీఎం సిద్దరామయ్య శనివారం ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించనున్నారని తెలిపారు. వ్యాపారం చేయడం ద్వారా లాభాలు ఆర్జించేవారే బెంగళూరులో ఉంటారన్నారు. "బెంగళూరులోనే ఎందుకు మల్టీనేషన్ కంపెనీలు ఉన్నాయి..? కాలిఫోర్నియాలో ఇంజనీర్లు కేవలం రూ.13 లక్షలకు పనిచేస్తున్నారు. కానీ బెంగళూరులో రూ.25 లక్షలు తీసుకుంటున్నారు. ఇక్కడ మౌలిక సదుపాయాలు, అన్ని సౌలభ్యాలూ ఉన్నందుకే ఇంతమంది ఉన్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. గుంతల విషయంలో కుట్రలు జరుగుతున్నాయని, విద్యార్థులతో కొందరు ప్రధానమంత్రికి లేఖలు రాయిస్తారని, ఇదో పెద్ద సమస్య అన్నట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. కాగా, బెంగళూరు ఔటర్ రింగ్ రోడ్డులో ప్రయాణం కష్టంగా ఉందని, ఇక్కడి నుంచి వెళ్లిపోతామని మూడు రోజుల క్రితం ఎక్స్‌లో పోస్టు పెట్టిన బ్లాక్ బక్ సీఈవో రాజేశ్ యూటర్న్ తీసుకున్నారు. బెంగళూరు తన సొంతూరు అని, ఇక్కడే మరో ప్రాంతానికి మారుతామని శుక్రవారం తెలిపారు.

మేం 'బ్లాక్‌మెయిల్'గా చూడం: లోకేశ్

బెంగళూరులో గుంతల విషయంలో ప్రభుత్వాన్ని బెదిరించలేరంటూ కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలపై ఏపీ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్'లో స్పందించారు. "ఎవరైనా సమస్యలతో వస్తే ఇతరుల్లా మేం వ్యవహరించం. వాటిని 'బ్లాక్‌మెయిల్'గా కొట్టివేయబోం. వారిని గౌరవించి, సమస్యలకు ప్రాధాన్యం ఇస్తాం" అని లోకేశ్ తెలిపారు.

దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ క్లస్టర్

» 2,000 ఎకరాల్లో ఏర్పాటు.. గుజరాత్‌లో ఎంవోయూ

విశాఖపట్నం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నౌకా నిర్మాణ రంగంలో మరో అడుగు ముందుకేసింది. తిరుపతి జిల్లా దుగరాజపట్నం సమీపాన 2,000 ఎకరాల్లో షిప్ బిల్డింగ్ క్లస్టర్ ఏర్పాటుకు గుజరాత్‌లోని భావనగర్‌లో శుక్రవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కేంద్ర ప్రభుత్వం నౌకా నిర్మాణ రంగాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించడంతో గుజరాత్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ముందుకువచ్చాయి. ఈ క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన భూమిని ఏపీఐఐసీ ద్వారా సమకూర్చడానికి ఏపీ ప్రభుత్వం అంగీకరించింది. ఈ భూముల విలువ రూ.750 కోట్లు. ఈ ప్రాంతంలో పోర్టు నిర్మించడానికి విశాఖపట్నం పోర్టు అథారిటీ అంగీకారం తెలిపింది. దీనికి అవసరమయ్యే పెట్టుబడి సుమారు రూ.4,000 కోట్లు పోర్టు సమకూరుస్తుంది. ఈ క్లస్టర్‌లో ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా నౌకా నిర్మాణం ప్రారంభిస్తారు. దశల వారీగా సుమారు రూ.10,000 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా. కాగా, భావనగర్‌లో కొత్తగా నిర్మించిన పోర్టును ప్రధాని మోదీ శనివారం ప్రారంభించనున్నారు.

తెలియదు.. నాకు సంబంధం లేదు

» లిక్కర్ స్కామ్ విచారణలో మిథున్ రెడ్డి తీరు
» యాభై ప్రశ్నలు...అన్నింటికీ ఒక్కటే జవాబు
» మద్యం ముడుపులు ముట్టుకోలేదు
» లిక్కర్ పాలసీ రూపకల్పనలో లేను
» 4గంటలు ప్రశ్నించి రాజమండ్రి జైలుకు..
» నేడు మరోసారి విచారించనున్న 'సిట్'



వైద్య పరీక్షల నిమిత్తం ఎంపీ మిథున్‌రెడ్డిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చిన పోలీసులు

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం పాలసీ రూపకల్పన నుంచి ముడుపుల సేకరణ వరకూ అన్నీ తానై చక్రం తిప్పినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ మిథున్ రెడ్డి, విచారణలో మాత్రం తనకు ఏమీ తెలియదని చెప్పినట్టు తెలిసింది. మద్యం కుంభకోణంతో తనకు ఎలాంటి సంబంధం లేదని అడ్డగోలుగా వాదించినట్లు సమాచారం. దేశంలోనే అతిపెద్ద లిక్కర్ స్కామ్‌లో అత్యంత కీలకమైన నలుగురు వ్యక్తుల్లో మిథున్ రెడ్డి ఒకరని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) భావిస్తోంది. కోర్టు అనుమతితో రెండు రోజుల కస్టడీకి ఆయనను తీసుకున్న సిట్ అధికారులు విజయవాడలోని పోలీస్ కమిషరేట్‌లో నాలుగు గంటల పాటు ప్రశ్నించారు. శుక్రవారం ఉదయం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి విజయవాడకు ఆయనను తీసుకొచ్చారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3వరకూ న్యాయవాదుల సమక్షంలో ఆయనను విచారించారు. మద్యం పాలసీ రూపకల్పన, ముడుపుల పర్సెంటేజీ ఖరారు, ఆటోమేటిక్ మద్యం సరఫరా విధానాన్ని మాన్యువల్‌గా మార్పించిన వైనం, ఎక్సైజ్ అధికారి సత్యప్రసాద్‌కు ఐఏఎస్ హోదా ఆశ కల్పించి మద్యం దోపిడీకి మార్గం చూపించుకున్న తీరు తదితర అక్రమాలు, అవకతవకలు, అవినీతిపై 50 ప్రశ్నలు సంధించారు. అయితే, సిట్ అధికారులు ఏది అడిగినా మిథున్ రెడ్డి సూటిగా స్పష్టంగా సమాధానం చెప్పలేదని తెలిసింది. ఏ ఒక్క ప్రశ్నకూ సరైన సమాధానం చెప్పకపోగా.. 'నాకు సంబంధం లేదు.. నాకేమీ తెలియదు..' అంటూ తల అడ్డంగా ఊపినట్లు సమాచారం. ఒక్కో కేసుకు(బాక్స్)రూ.450 నుంచి రూ.600గా మద్యం ముడుపుల రేటును ఎవరి ఆదేశాలతో నిర్ణయించారని అడగ్గా, అలాంటి పని తాను చేయలేదని బదులిచ్చారు. లిక్కర్ పాలసీ రూపకల్పన కోసం మాజీ రాజ్యసభ సభ్యుడి ఇంట్లో జరిగిన సమావేశాల్లో మీరు ఉన్నట్లు టెక్నికల్ ఆధారాలున్నాయని సిట్ అధికారులు తెలపగా, ఒక పార్టీలో ఎంపీలుగా ఉన్నప్పుడు ఒకరింటికి మరొకరు వెళ్లి కలవడం అత్యంత సాధారణ విషయమని, దానికీ మద్యం ముడుపులకు ఏంటి సంబంధమని ఎదురుప్రశ్నించినట్లు తెలిసింది.

ఆ ప్రశ్నపై మిథున్ మౌనం!

మద్యం సరఫరాకు అనుసరిస్తున్న ఆటోమేటిక్ విధానాన్ని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాన్యువల్‌గా మార్చారు. దీనివెనుక మొత్తం పాత్ర మిథున్‌రెడ్డిదేనని సిట్ భావిస్తోంది. దీనిపై ప్రశ్నించగా, ఎలాంటి సమాధానం చెప్పకుండా ఆయన మౌనం వహించినట్లు సమాచారం. మీ కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలోకి డిస్టిలరీస్ ఖాతాల నుంచి రూ.ఐదు కోట్లు ఎందుకు జమైందని అడగ్గా, అది ముడుపుల సొమ్ము కాదని, ఏదో ఇతరత్రా లావాదేవీలు జరిపామని మిథున్ తెలిపారు. ఆ సొమ్ము అప్పుడే వెనక్కి ఇచ్చేశామని బదులిచ్చినట్లు తెలిసింది. అయితే పలుమార్లు నగదు రూపంలో మద్యం వ్యాపారుల నుంచి తీసుకున్న డబ్బు సంగతేంటని అధికారులు అడగగా.. తాను ఎవరినుంచీ రూపాయి కూడా తీసుకోలేదని సమాధానమిచ్చారు. అయితే 2019 ఎన్నికల నాటి అఫిడవిట్‌లో ఉన్న ఆస్తి 2024నాటికి బాగా పెరిగిందని, దానిపై ఆదాయపు పన్ను శాఖకు లెక్కలు చెప్పారా. అని అడగ్గా, అవునని సమాధానం ఇచ్చారు. ఎక్సైజ్ అధికారి సత్యప్రసాద్‌కు ఐఏఎస్ హోదా కల్పిస్తామని హామీ ఇవ్వడం వెనుక మద్యం దోపిడీయే ప్రధాన ఎజెండానా అని ప్రశ్నించగా, తాను ఎవ్వరికీ ఎలాంటి హామీ ఇవ్వలేదని మిథున్ రెడ్డి బదులిచ్చారు. ఆయన దేనికీ సూటిగా సమాధానం చెప్పక పోవడంతో ఇదే విషయాన్ని కోర్టుకు వివరించి కస్టడీ మరింత పొడిగించమని కోరే అవకాశం ఉంది. కాగా, శనివారం మరోమారు సిట్ ఆయనను ప్రశ్నించనుంది. దీనికోసం మరో యాభై ప్రశ్నలు సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది.

మద్యం స్కామ్‌లో గోల్డ్ కవరింగ్!

» ముడుపుల సొమ్ములు మళ్లించారు
» సంబంధంలేని వ్యక్తులు, సంస్థలకు చెల్లింపులు
» తనిఖీలపై ఈడీ అధికారిక ప్రకటన

(హైదరాబాద్ - ఆంధ్రజ్యోతి)

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తంజావూరు, సూరత్, రాయ్‌పూర్, ఢిల్లీతోపాటు ఏపీలో ఏకకాలంలో 20చోట్ల గురువారం సోదాలు జరిపినట్లు ఈడీ వెల్లడించింది. లిక్కర్ స్కామ్ ముడుపులను మళ్లించిన కంపెనీల్లో, లావాదేవీలను అతిగా చూపించిన సంస్థల్లో ఈ సోదాలు జరిపినట్లు తెలిపింది. "బోగస్ ఇన్‌వాయిస్‌లు, ట్రాన్స్‌పోర్టు చలాన్లు, నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాల వివరాలు, మద్యం ధరల పెంపుదల, ముడుపులకు సంబంధించిన డాక్యుమెంట్లు, రూ.38 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నాం. వాట్సాప్ సంభాషణలూ గుర్తించాం. పరారీలో ఉన్న నిందితుల్లో కొందరు దుబాయ్‌లో ఉన్నారు. ఇక్కడి నుంచి వారికి చేరిన కోట్లాది రూపాయల ముడుపులకు చెందిన లెడ్జర్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నాం. సీఐడీ ఎఫ్ఐఆర్, ఆ తర్వాత సిట్ దర్యాప్తు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో... రూ.4000 కోట్ల ఏపీ లిక్కర్ స్కామ్‌లో దర్యాప్తు ప్రారంభించాం. సిట్ ఎఫ్ఐఆర్ ప్రకారం... ఈ కేసులో నిందితులు కొన్ని బ్రాండ్లను చంపేశారు. మరికొన్ని బ్రాండ్లను ప్రమోట్ చేశారు. ముడుపులు ఇవ్వడానికి నిరాకరించిన మెక్‌డోవెల్, రాయల్‌స్టాగ్, ఇంపీరియల్ బ్లూ లాంటి బ్రాండ్లను తప్పించి... పెద్ద ఎత్తున ముడుపులు ఇచ్చిన కొన్ని డిస్టిలరీల బ్రాండ్లను మాత్రమే కొనుగోలు చేశారు. గతంలో లిక్కర్ ప్రొక్యూర్‌మెంట్ విధానం ఆటోమేటెడ్‌గా ఉండేది. దానిని మాన్యువల్‌గా మార్చి... ఆర్డర్ ఆఫ్ సప్లై విధానం తారుమారు చేశారు. తద్వారా ప్రతి ఇన్‌వాయిస్‌కు డిస్టిలరీల యజమానులు 15శాతం నుంచి 20శాతం ముడుపులు చెల్లించారని, ఆ సొమ్మును ప్రత్యేక పద్ధతుల్లో షెల్ కంపెనీల ద్వారా చేరాల్సిన చోటికి చేర్చారని సిట్ తన చార్జిషీట్లలో పేర్కొంది. తమకు కావాల్సిన అధికారులను కీలక స్థానాల్లో నియమించుకోవడం ద్వారా ఆర్డర్-సరఫరా-ముడుపులను ఒక పథకం ప్రకారం విదేశాలకు తరలించినట్లు సిట్ వెల్లడించింది. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి మద్యం సరఫరాదారులకు జరిగిన చెల్లింపులు చాలావరకు బోగస్‌గా గుర్తించాం. సంబంధం లేని కంపెనీలకు, వ్యక్తులకు డబ్బు మళ్లింది. వస్తువులు సరఫరా చేశారని, సేవలు అందిచారని చెబుతూ... సొమ్ములు చెల్లించారు. ఇవన్నీ బోగస్ లావాదేవీలుగా నిర్ధారణ అయ్యింది. ఉనికిలో లేని/షెల్‌కంపెనీలు/సంబంధంలేని వ్యక్తులకు సొమ్ములు చేరాయి. ఇలా అందిన ముడుపులను కొన్ని జ్యువెలరీ కంపెనీలకు మళ్లించి... బంగారాన్ని కొన్నట్లుగా చూపించినట్లు మా దర్యాప్తులో స్పష్టమైంది. వ్యాపార లావాదేవీల ముసుగులో అక్రమ సొమ్మును షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు తరలించారు" అని ఈడీ వెల్లడించింది.

ఈడీ పెంచిన వేడి!

» వైసీపీ శిబిరంలో కలవరం మొదలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

"జగన్‌కు దగ్గరగా ఉండే నలుగురికి లిక్కర్ కేసులో బెయిలు వచ్చేసింది. సిట్ దాఖలు చేసిన మూడో చార్జిషీట్‌లో జగన్ ప్రస్తావనే లేదు. ఇంకేముంది, లిక్కర్ కేసు తేలిపోయినట్లే"... అని భావించిన వాళ్లకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన సోదాలతో షాక్ ఇచ్చినట్లయింది. కేసు పూర్వాపరాలు, ముడుపుల వసూళ్లు, డొల్ల కంపెనీల సృష్టి, హవాలా తరలింపుపై నాలుగు నెలలపాటు సుదీర్ఘ కసరత్తు చేసిన అనంతరమే ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. ఏకకాలంలో దేశవ్యాప్తంగా 20చోట్ల సోదాలు జరిపారు. ఈ విషయంలో పకడ్బందీగా వ్యవహరించారు. వివిధ వర్గాల ద్వారా లిక్కర్ స్కామ్‌పై కేంద్రానికి అందిన ఫిర్యాదులు, 'సిట్' తమ దర్యాప్తులో కనుగొన్న అంశాలను ఈడీ అధ్యయనం చేసింది. దీనిపై 'సిట్' చీఫ్, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబుతో సమావేశమై సమాచారాన్ని సేకరించింది. ఆ తర్వాతే గురువారం విస్తృతంగా సోదాలు జరిపింది.

కీలక ఆధారాలు లభ్యం..

మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) సెక్షన్లకు బలం చేకూర్చే కీలక ఆధారాలను ఈడీ సేకరించినట్లు తెలిసింది. పదుల కిలోల బంగారం ఇన్వాయిస్‌ల నుంచి పండ్ల ఎగుమతులు, ప్యాకేజింగ్ పేరుతో జరిగిన లావాదేవీల అసలు గుట్టు వెలికి తీసింది. ఫేక్ ఇన్‌వాయిస్‌లు, జీఎస్టీ గోల్‌మాల్‌పై నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. డిస్టిలరీ యజమానులు ఎవరెవరు ఎవరెవరికి ఎక్కడెక్కడ ఎంతెంత ముడుపులు చెల్లించారో ఆధారాలు సేకరించి.. ఆ మొత్తాన్ని ఏయే దేశాలకు హవాలా మార్గంలో తరలించారో కూడా తెలుసుకున్నట్లు సమాచారం. దీంతో జగన్ శిబిరంలో కలకలం మొదలైనట్లు తెలుస్తోంది. గురువారం రాత్రే సీనియర్ న్యాయవాదులతో జగన్ సమావేశమై చర్చించినట్లు సమాచారం. ఇప్పటిదాకా... 'సిట్' దర్యాప్తు, అరెస్టులను వైసీపీ నేతలు 'రాజకీయ కక్ష సాధింపు'గా అభివర్ణిస్తూ వచ్చారు. అసలు స్కామే లేదని బుకాయిస్తున్నారు. ఈడీ రంగ ప్రవేశంతో వారిలో కలవరం మొదలైంది.

రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు ఏదైనా కేసులో చేసిన అభియోగాలను ఆధారాలతో సహా తామే నిరూపించాల్సి ఉంటుంది. ఈడీ కేసుల్లో అలా కాదు! 'ఆ అభియోగాల్లో నిజం లేదు' అని నిందితులే నిరూపించుకోవాలి. ఈ కేసులో ఏ1 రాజ్ కసిరెడ్డి వందల కోట్ల రూపాయలను విదేశాలకు తరలించి మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారు. ఆ డబ్బు మద్యం ముడుపుల నుంచి సేకరించిందేనని కోర్టుకు ఈడీ చెబితే... అది ఎవరి సొమ్ము అనే స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత నిందితుడిదే. ఈ కేసులో విజయసాయిరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, అప్పటి ఎక్సైజ్ ఉన్నతాధికారి రజత్ భార్గవ, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా పనిచేసిన వాసుదేవ రెడ్డి తదితరుల వాంగ్మూలాలు కీలకం కానున్నాయి.

వైసీపీకి భారీ షాక్!

» టీడీపీలో చేరిన ముగ్గురు ఎమ్మెల్సీలు

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, బల్లి కల్యాణ్ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ టీడీపీలో చేరారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సీఎం చంద్రబాబు సమక్షంలో వారు పసుపు కండువా కప్పుకొన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు వారిని సాదరంగా ఆహ్వానించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సేవ చేయడంలో నిమగ్నం కావాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యేలు సునీల్, విజయశ్రీ, పులివర్తి నాని, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, పంచుమర్తి అనురాధ, ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మీడియాతోనూ మాట్లాడనివ్వలేదు

టీడీపీలో చేరిన అనంతరం మర్రి రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ద్వారా వచ్చిన పదవికి రాజీనామా చేసి టీడీపీలో చేరాలని అనుకున్నామని, కానీ, ఆరు నెలలుగా మండలి చైర్మన్ తమ రాజీనామాలను ఆమోదించకుండా పక్కన పెట్టారని అన్నారు. దాని వెనుక ఆయనకు ప్రత్యేక అజెండా ఉందని ఆరోపించారు. టీడీపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరామని తెలిపారు. కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. టీడీపీలో చేరడం సొంతగూటికి వచ్చినట్లు ఉందన్నారు. తన తండ్రి పూర్తికాలం టీడీపీతోనే ఉన్నారని తెలిపారు. పద్మశ్రీ మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి ఏడాది అవుతోందని కానీ, ఇంత వరకు ఆమోదించలేదని అన్నారు. పదవి ఉన్నా ప్రజలకు పెద్దగా ఏమీ చేయలేకపోయామని, వైసీపీలో ఉన్నప్పుడు కనీసం మీడియాతో మాట్లాడే అవకాశం కూడా లేకుండా పోయిందన్నారు.

లిక్కర్ స్కామ్‌లో జగన్ సోదరుడు!

(మొదటి పేజీ తరువాయి)

నిందితులైన మిథున్ రెడ్డి(ఏ-4), విజయ సాయిరెడ్డి(ఏ-5), కృష్ణమోహన్ రెడ్డి(ఏ-32), ధనుంజయ్ రెడ్డి(ఏ-31), బాలాజీ గోవిందప్ప(ఏ-33)తో తరచూ జరిపిన సంప్రదింపుల వెనుక అనిల్ రెడ్డి పాత్ర ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. దీంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఏకకాలంలో చెన్నై, హైదరాబాద్‌లోని అనిల్ రెడ్డి 8 వ్యాపార సంస్థలు, 2 ఇళ్లలో మొత్తం 10 చోట్ల సిట్ బృందాలు సోదాలు చేపట్టాయి. సాయంత్రం నాలుగు గంటలకు మొదలైన సోదాలు రాత్రి పొద్దుపోయే దాకా కొనసాగుతూనే ఉన్నాయి. చెన్నైలోని మైలాపూర్ (4), టీ-నగర్ (1), పెరుంగుడి (1), అరక్కు కొట్టై (1) ప్రాంతాల్లోని అనిల్ రెడ్డికి చెందిన 7 కంపెనీలతో పాటు చెన్నైలోని ఆళ్వార్‌పేట, ఇజంబాకంలోని ఆయన నివాసాలపైనా సిట్ అధికారులు దాడులు చేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఉన్న ఆయన వ్యాపార సంస్థలోనూ సోదాలు చేపట్టారు.

కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

అనిల్ రెడ్డికి చెందిన మొత్తం ఎనిమిది కంపెనీలు షిలోహ్ ఇన్‌ఫ్రా, ఖ్వాన్నా ఎగ్జిమ్, షిలోహ్ ఇండస్ట్రీస్, ఫోరెస్ ఇంపెక్స్, ఇండో రాక్స్ వర్క్ ఈజీ స్పేస్, శ్రీ గోవిందరాజ మిల్స్, ట్రాన్సెల్ బయోలాజిక్స్‌లో సోదాలు చేపట్టిన సిట్ అధికారులు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మరోవైపు చెన్నైలోని రెండు నివాసాల్లో వైసీపీకి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు, అభ్యర్థులకు పంపిణీ చేసిన డబ్బుల వివరాలు, సర్వే నివేదికలకు సంబంధించిన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. గత వైసీపీ పాలనలో అనిల్ రెడ్డి పాల్పడిన అనేక అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన డాక్యుమెంట్లు, డిజిటల్ ఆధారాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

జగన్‌కు బినామీ: చెన్నైలో ఉండే అనిల్ రెడ్డి జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఏపీలో ఇసుక దోపిడీతో వెలుగులోకి వచ్చారు. జేసీకేసీ అనే సంస్థ ద్వారా రాష్ట్రంలోని సంపదను చెన్నై, బెంగళూరుకు తరలించి భారీగా సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2019 నుంచి 2024 వరకూ మద్యం వ్యాపారుల నుంచి తీసుకున్న ముడుపులను వైసీపీ అభ్యర్థులకు పంపిణీ చేశారన్న ఆరోపణలు కూడా అనిల్ రెడ్డిపై ఉన్నాయి. అనిల్ రెడ్డి ఆఫ్రికాలో చేసే మద్యం, మైనింగ్ వ్యాపారాల్లో జగన్‌కు బినామీ అని వైసీపీలో చెబుతుంటారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అవినాశ్ రెడ్డి జైలుకు వెళ్లి మధ్యంతర ఎన్నిక అనివార్యమైతే కడప పార్లమెంటు స్థానం నుంచి అనిల్ రెడ్డిని వైసీపీ తరఫున బరిలో దించేందుకు జగన్ సిద్ధమైనట్లు అప్పట్లో వైసీపీలో బలంగా ప్రచారం జరిగింది. 2012లో అక్రమాస్తుల కేసులో జగన్‌ను సీబీఐ అరెస్టు చేసినప్పుడు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ రోడ్డులో దిల్‌కుషా గెస్ట్ హౌస్ ముందు అర్ధరాత్రి వరకూ విజయమ్మ, షర్మిల, భారతితో పాటు అనిల్ రెడ్డి భార్య రోడ్డుపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు.

2020 వరకు భారతి డైరెక్టర్


లిక్కర్ ముడుపులను అనిల్‌కు చెందిన 8 కంపెనీల ద్వారా విదేశీలకు తరలించడంతో పాటు వైసీపీ ఎన్నికల ఖర్చుకు వాడుకున్నట్లు సిట్ తనిఖీల్లో వెల్లడైంది. ఎన్నికల సర్వే ఖర్చుతో పాటు అభ్యర్థులకు పంపిణీ చేసినట్లు సమాచారం. సిట్ సోదాలు చేసిన అనిల్ 8 కంపెనీల్లో 2 కంపెనీలు షిలోహ్ ఇండస్ట్రీస్, ఫోరెస్ ఇంపెక్స్‌లలో 2020 వరకు వైసీపీ అధినేత జగన్ భార్య భారతి డైరెక్టర్‌గా ఉన్నారు. 2019లో జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ఆమె కొంతకాలం కొనసాగారు. ఆ తర్వాత ఆమె వైదొలిగారు.

ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఏమిటో స్పష్టమైందన్నారు. ఆయన విధ్వంసకుడు, అసమర్థుడని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణం డిసెంబరుకల్లా పూర్తవుతుందన్నారు. ఈ ప్రాజెక్టును 2027 డిసెంబరునాటికి పూర్తిచేస్తామని పునరుద్ఘాటించారు. శుక్రవారం అసెంబ్లీలో సమగ్ర నీటి యాజమాన్య విధానంపై జరిగిన లఘు చర్చలో ఆయన పాల్గొన్నారు. సమగ్ర నీటి యాజమాన్య విధానం అమలుతో రాష్ట్రంలో కరువన్నదే ఉండదని చెప్పారు. దేశంలో తొలిసారిగా నదుల అనుసంధానాన్ని ఆంధ్రప్రదేశ్ చేసి చూపించిందన్నారు. గోదావరి-కృష్ణా నదులను అనుసంధానం చేశామని తెలిపారు. రాష్ట్రంలోని నదులన్నింటినీ అనుసంధానం చేస్తామని.. వంశధారకు వరదలొస్తే.. ఆ నీటిని సోమశిల వరకు తీసుకెళ్లేలా అనుసంధాన ప్రక్రియను అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కోటి ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. ఎనిమిది సార్లు గెలిపించిన కుప్పం నియోజవర్గానికి కృష్ణా జలాలిచ్చి జన్మ సార్థకం చేసుకున్నానని.. ప్రజల రుణం తీర్చుకున్నానని ఒకింత భావోద్వేగానికి గురవుతూ చెప్పారు. జగన్ విధ్వంసక పాలనతో ఎంతో నష్టపోయామన్నారు. ఈ సందర్భంగా 'జగన్ విధ్వంసకుడు' అనే శీర్షికతో సభలో ఓ వీడియో క్లిప్పింగ్‌ను చంద్రబాబు ప్రదర్శించారు. పోలవరం, పట్టిసీమ ఎత్తిపోతల పథకాలపై ముఖ్యమంత్రి హోదాలో జగన్ శాసనసభలో చేసిన ప్రకటనలను తెలియజేశారు.


కేంద్రం వద్దన్నా..




పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టును 2020లోనే పూర్తిచేసి జాతికి అంకితం చేయాల్సి ఉండగా.. జగన్ తన అసమర్థ, విధ్వంసక విధానంతో కేంద్రం వద్దంటున్నా కాంట్రాక్టు సంస్థను మార్చేసి.. నిర్మాణాలను ఆపేశారని చంద్రబాబు విమర్శించారు. ప్రాజెక్టు పూర్తి గడువుపై ఎప్పటికప్పుడు మాటమారుస్తూ.. తేదీలను వాయిదా వేస్తూ వచ్చారని అన్నారు. 'వాస్తవానికి 2019లో మేం దిగిపోయే నాటికి ప్రాజెక్టులో 72 శాతం పనులు పూర్తయ్యాయి. మా తర్వాత వచ్చిన జగన్ వాటిని యథాతథంగా కొనసాగించి ఉంటే.. 2020 నాటికే పూర్తయ్యేది. 2020లో గోదావరి వరదల ఉధృతికి డయాఫ్రం వాల్ పూర్తిగా దెబ్బతింది. కేంద్ర జలశక్తి శాఖ వేసిన అంతర్జాతీయ నిపుణుల కమిటీ కొత్తది నిర్మించాల్సిందేనని స్పష్టం చేసింది. దీనివల్ల రూ.1,000 కోట్లు అదనంగా వ్యయం చేయాల్సి వచ్చింది. ప్రాజెక్టు కూడా ఆలస్యమవుతోంది' అని తెలిపారు. ప్రాజెక్టును 2021 ఖరీఫ్‌కల్లా పూర్తి చేస్తామని ఒకసారి.. 2022 ఖరీఫ్‌కు అంటూ మరోసారి.. 2023 ఖరీఫ్ నాటికంటూ ఇంకోసారి.. 2025 జూన్‌నాటికి పూర్తిచేస్తామని చివరిగా జగన్ అసెంబ్లీలో చెప్పిన మాటలను చంద్రబాబు ప్రదర్శించారు. అలాగే 2021 నాటికి పోలవరాన్ని పూర్తి చేస్తామని.. అది ఎప్పటికి పూర్తవుతుందో తెలియదంటూ అప్పటి జలవనరుల మంత్రులు అనిల్ కుమార్ యాదవ్.. అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను కూడా చూపించినప్పుడు ఎమ్మెల్యేలంతా ఘొల్లున నవ్వారు. అదేవిధంగా పట్టిసీమ ఎత్తిపోతల పథకం వృథా అంటూ జగన్ చేసిన వ్యాఖ్యల వీడియోను కూడా చంద్రబాబు ప్రదర్శించారు. 'పట్టిసీమ పంపులను ఆన్ చేస్తే నాకు ఎక్కడ పేరు వస్తుందోనని జగన్ పూర్తిగా ప్రాజెక్టును పక్కన పడేశారు. 2022లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో.. పట్టిసీమ పంపులను వేయకుంటే జనం తంతారన్న భయంతో అప్పుడు ఆన్ చేశారు. ఆ ప్రాజెక్టుతో పదేళ్లుగా రాష్ట్రానికి ఎంతో లబ్ధి చేకూరుతోంది' అని తెలిపారు.

ఏడాదిలో హంద్రీ-నీవా విస్తరణ..

హంద్రీ-నీవా, గాలేరు-నగరి సుజల స్రవంతి పథకాల ద్వారా సీమకు సాగు, తాగునీటిని అందిస్తాం. గాలేరు-నగరి విస్తరణ పనులు ఏడాదిలో పూర్తి చేసి కడపకూ నీటిని అందిస్తాం. ఏడాదిలోగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తిచేస్తాం. గోదావరి, కృష్ణా జలాలు కలసి ఈ ఏడాది ఇప్పటివరకు 5,400 టీఎంసీలు సముద్రంపాలయ్యాయి. వాటిలో 200 టీఎంసీల వరద జలాలను పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు వాడుకుంటామంటే అడ్డుపడడంపై తెలంగాణ ఆలోచించాలి. సాగునీటి రంగంపై కూటమికి ఉన్న శ్రద్ధ ఏమిటో.. చేసిన ఖర్చులు చూస్తే స్పష్టమవుతుంది. 2024 నుంచి ప్రాజెక్టులపై రూ.12,000 కోట్లు వ్యయం చేశాం. ఐదేళ్లలో రూ.60 వేల కోట్లు వ్యయం చేస్తాం.





నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 'ఉచిత వైద్యం' ఆగలేదు!

పనిగట్టుకుని చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

- గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను మేం చెల్లిస్తున్నాం
- శాసనసభలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో పేదలకు ఉచిత వైద్యసేవలు నిలిచిపోయాయం టూ ప్రభుత్వ వ్యతిరేక మీడియా ద్వారా చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ శాసనసభ వేదికగా ప్రజలకు సూచించారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్య సేవలు కొనసాగించడంలో బాధ్యతారాహితంగా వ్యవహరించిందని విమర్శించారు. ఇప్పుడు కూడా రోగులు బాధపడుతూ.. మరణాలు జరిగితే రాజకీయంగా లబ్ధి పొందాలనే దురుద్దేశంతోనే దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఆరోగ్యశ్రీ బకాయిలపై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.2,222 కోట్లు బకాయి పెట్టిందని, వాటిని తమ ప్రభుత్వం దశలవారీగా చెల్లిస్తుందని తెలిపారు. రూ.2,168 కోట్లకు సంబంధించిన బిల్లులు పరిశీలనలో ఉన్నాయన్నారు. ప్రభుత్వాసుపత్రులకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా రూ.457.45 కోట్లు చెల్లించామని వివరించారు.

గత ఐదేళ్లూ పశుసంవర్ధక శాఖకు తాళాలు: అచ్చెన్న



గత ప్రభుత్వం ఐదేళ్లూ రాష్ట్రంలో పశుసంవర్ధకశాఖకు తాళాలు వేసేసిందని ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. పశువులకు దాణా పంపిణీ, వ్యాక్సినేషన్ కూడా ఆపేశారని విమర్శించారు. రాష్ట్రంలో పశు వైద్యులు, పశువైద్య సహాయకుల ఖాళీలను భర్తీ చేయని కారణంగా పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారంటూ బొబ్బిలి ఎమ్మెల్యే రంగారావు, పశువుల ఆస్పత్రుల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, తమ నియోజకవర్గంలో గేదెలు వింత వ్యాధితో చనిపోతున్నాయంటూ కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావులు శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి సమాధానమిస్తూ గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్లలో ఒక్క వెటర్నరీ డాక్టర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని చెప్పారు. అయినప్ప గ్రామస్థాయిలో ఉన్న 6,137 మంది వెటర్నరీ అసిస్టెంట్ల ద్వారా పశువులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఆస్పత్రుల భవనాల మరమ్మతులు చేయిస్తామన్నారు.

పరిశ్రమలు పెట్టకపోతే భూములు వెనక్కి: భరత్



ప్రభుత్వం నుంచి భూములు తీసుకుని గడువులోగా వాటిలో పరిశ్రమ లు ఏర్పాటు చేయకపోతే ఆ భూములను వెనక్కి తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పెందుర్తి ఎమ్మెల్యే పి.రమేష్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలు ఇచ్చారు.

రాజోలులో కొబ్బరి ప్రాసెసింగ్ యూనిట్



కొబ్బరి ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు రాజోలు నియోజకవర్గంలో రూ.9.96 కోట్లతో కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. కడియం లో కొబ్బరి పరిశోధనా కేంద్రం కోసం 10 ఎకరాలను సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చెప్పారు.

డిజిటల్ కార్పొరేషన్ నిధులు దారిమళ్లాయి: పార్థసారథి



గత ప్రభుత్వ హయాంలో ఏపీ డిజిటల్ కార్పొరేషన్ నిధుల వినియోగంలో అవకతవకలు జరిగినట్లు విజిలెన్స్ నివేదిక ద్వారా స్పష్టమైందని, దీనిపై సీఐడీ విచారణ కొనసాగుతుందని సమాచార, ప్రసారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. 2019-24 మధ్య రూ.2 కోట్లు దారి మళ్లించి యాత్ర-2 సినిమా కోసం ఖర్చు చేయడంపై ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కూన రవికుమార్ శాసనసభలో అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలిచ్చారు. డిజిటల్ కార్పొరేషన్‌లో సుమారు 60 మందిని కనీస విద్యార్హతలు లేకుండా పోస్టుల్లో నియమించారని, సాక్షి పత్రిక, ఐప్యాక్, ఐడ్రీమ్ చానళ్లలో పనిచేసే మరో 19 మందిని నిబంధనలకు విరుద్ధంగా నియమించారన్నారు.

రైస్ కెర్నెల్స్ తయారీలో స్థానిక కంపెనీలకు ప్రోత్సాహం: నాదెండ్ల



ఫోర్టిఫైడ్ రైస్ కెర్నెల్స్ తయారీలో 25 శాతం టెండర్లను స్థానిక కంపెనీలకు కేటాయిస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అసెంబ్లీలో ప్రకటించారు. స్థానిక కంపెనీల కంటే ఇతర రాష్ట్రాల్లోని సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడంపై ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ధూళిపాళ్ల నరేంద్ర ప్రస్తావించారు. దీనిపై మంత్రి మాట్లాడు తూ.. రాష్ట్రంలోని సంస్థలు కోట్ చేస్తున్న ధరలకు, ఇతర రాష్ట్రాల సంస్థల ధరలకు చాలా వ్యత్యాసం ఉంటోందని చెప్పారు. గతంలో ఫోర్టిఫైడ్ రైస్ కోసం 2 టెండర్లు పిలిచామని, 22,500 టన్నులను బయట రాష్ట్రాల్లోని సంస్థలకు, ఏపీలోని సంస్థలకు 7,500 టన్నులు కేటాయించామని చెప్పారు. జూన్‌లో కేంద్రం కొత్త నిబంధనలు సూచించిందని తెలిపారు. ఈ నిబంధనల మేరకు కొత్తగా ఖరీఫ్ సీజన్‌లో టెండర్లు పిలుస్తామని మంత్రి వెల్లడించారు.

బాబు అభినవ శ్రీకృష్ణదేవరాయలు: నిమ్మల



శ్రీకృష్ణదేవరాయల కాలంలో చెరువులన్నీ నీటితో నిండి కళకళలాడుతుండేవని చెబుతుంటారని.. ఇప్పుడు రాష్ట్రంలోని సాగునీటి వనరులన్నింటిలో జలాలు పుష్కలంగా కనిపిస్తున్నాయని శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబు అనుసరిస్తున్న సమగ్ర నీటి యాజమాన్య విధానాలే కారణమన్నారు. చంద్రబాబును అభినవ శ్రీకృష్ణదేవరాయలుగా కొనియాడారు. సభలో శుక్రవారం మంత్రి మాట్లాడారు. వచ్చే ఏడాదిలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, కృష్ణా జలాలను ఆఖరి మైలు దాకా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామన్నారు. రిజర్వాయర్ల పేరు చెబితే టీడీపీ గుర్తుకు వస్తుందని.. జగన్ పేరు చెబితే విధ్వంసం గుర్తుకొస్తుందని అన్నారు. నీటి ప్రాజెక్టుల కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు సూచించారు.





'బొండా' మాటల మంటలు

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ఎమ్మెల్యేలే ప్రతిపక్షపాత్ర పోషిస్తూ.. ప్రజా సమస్యలను ప్రస్తావిస్తుండటం నిజం. కానీ... శుక్రవారం బొండా ఉమా చేసిన తీవ్ర వ్యాఖ్యలు కూటమి సభ్యులను నివ్వెర పరిచాయి. ప్రశ్నోత్తరాల సమయంలో ప్లాస్టిక్ కాలుష్యంపై గుంటూరు పశ్చిమ టీడీపీ ఎమ్మెల్యే గళ్లా మాధవి అడిగిన ప్రశ్నకు ఉప ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు. ఇదే అంశంపై బొండా అనుబంధ ప్రశ్న వేశారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఛైర్మన్ కృష్ణయ్యపై వ్యక్తిగత ఆరోపణలు చేశారు. పవన్ కల్యాణ్ పేరును కూడా ప్రస్తావించారు. "పీసీబీ పని చేస్తున్నట్లుగా ఎక్కడా కనిపించడం లేదు. ఏదైనా రిప్రజెంటేషన్ ఇవ్వడానికి ఛైర్మన్ వద్దకు వెళ్తే.. ఉప ముఖ్యమంత్రి పేరు చెబుతున్నారు. డిప్యూటీ సీఎం చేయొద్దన్నారని, ఆయన ఆఫీసు నుంచి మాకు చెప్పాలని అంటున్నారు. ఈ విధానం సరికాదు. నాలాంటి ఎమ్మెల్యేలు గెలిస్తేనే ఆయన (కృష్ణయ్య) ఛైర్మన్ సీట్లో కూర్చున్నారు. ఆయన పెద్ద పెద్దవాళ్లకు ఏవిధంగా ప్రభావితం అవుతున్నారో తెలియదు. ఫ్యాక్టరీల నుంచి వస్తున్న కాలుష్యాన్ని నియంత్రించడంలో పీసీబీ పూర్తిగా విఫలమవుతోంది. విశాఖపట్నంలో రాంకీ పరిశ్రమ నుంచి వస్తున్న ఫార్మా వ్యర్థాలను నేరుగా సముద్రంలోకి వదిలేస్తున్నారని పీసీబీ ఛైర్మనే చెప్పారు. ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలిచ్చినా చర్యలు తీసుకోవడం లేదు. ఆ కంపెనీ యజమాని వైసీపీ ఎంపీ అయోధ్యరామిరెడ్డి ఏ స్థాయిలో ప్రభావితం చేస్తున్నారో తెలియడం లేదు. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ పట్టించుకుని పీసీబీ అధికారులు పనిచేసే విధంగా గట్టిగా మందలించాలి' అని బొండా అన్నారు. దీనిపై పవన్ కల్యాణ్ సభలోనే గట్టిగా, వివరంగా సమాధానమిచ్చారు.

అప్పటికప్పుడే ఆరా...

పి.కృష్ణయ్య రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. ఆయన సీఎం చంద్రబాబుకు సన్నిహితుడిగా, సౌమ్యుడిగా, వివాదరహితుడిగా పేరుంది. నిబంధనలకు లోబడి పని చేస్తారు. అందుకే చంద్రబాబు అందరి కంటే ముందుగా పీసీబీ ఛైర్మన్‌గా ఆయన్ను నామినేటెడ్ పదవిలో నియమించారు. దానికి తగినట్లుగానే ఆయన పీసీబీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కృష్ణయ్య వ్యక్తిత్వం గురించి పవన్ కల్యాణ్‌కు పూర్తి అవగాహన ఉండడంతో.. ఈ ఆరోపణల నిగ్గు తేల్చేందుకు అప్పటికప్పుడు అసెంబ్లీలోని తన పేషీలో ఆయనతో భేటీ అయ్యారు. పీసీబీ అధికారులను సైతం పిలిపించారు. ఎమ్మెల్యే ఈ విధంగా ఎందుకు మాట్లాడి ఉంటారో కృష్ణయ్యను ఆరా తీశారు. బొండా ఆరోపణల పూర్వాపరాలను అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. ఈ మొత్తం వ్యవహారంపై పవన్ సీరియస్ అయ్యారు. పీసీబీ ఛైర్మన్‌ను ఉద్దేశించి బొండా చేసిన వ్యాఖ్యలు బెదిరింపు ధోరణిలో ఉన్నాయని.. వ్యక్తిగత ఉద్దేశాలతోనే ఒకరిని లక్ష్యంగా చేసుకుని మాట్లాడారని పవన్ అభిప్రాయపడ్డారు. పూర్తి వివరాలను సమగ్ర నివేదిక రూపంలో ఇవ్వాలని, సీఎం దృష్టికి తీసుకెళ్తానని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

ఆయనే ఫిర్యాదు చేసి..!

పీసీబీ అధికారులు బొండా తీరును పవన్ కల్యాణ్‌కు వివరించినట్లు తెలిసింది. 'క్రెబ్స్ బయో కెమికల్స్ అండ్ ఇండస్ట్రీస్ వ్యర్థాలను భారీగా జక్కంపూడి ఏరియాలో డంప్ చేస్తోంది. ఇందులో కొంత బొండా నియోజకవర్గమైన విజయవాడ సెంట్రల్ పరిధిలోకి వస్తుంది. ఆ కంపెనీపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఈ ఏడాది ఫిబ్రవరిలో పీసీబీకి లేఖ రాశారు. విజయవాడ పోలీసు కమిషనర్‌కూ లేఖ పంపారు. హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలుచేయించారు. దీంతో పీసీబీ విచారణ చేయించి కంపెనీపై చర్యలకు సమాయత్తమవుతున్న తరుణంలో.. ఆయనే చర్యలు తీసుకోవద్దంటూ అధికారులపై అంతర్గతంగా ఒత్తిడి తీసుకొస్తున్నారు' అని వారు చెప్పినట్లు సమాచారం. బొండా ఉద్దేశపూర్వకంగా ఈ అంశాన్ని లేవనెత్తారన్న అభిప్రాయం వ్యక్తమవుతుండడంతో డిప్యూటీ సీఎం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం.

సీఎంవో ఆరా..

ఇంకోవైపు.. అసెంబ్లీలో ఎమ్మెల్యే బొండా ఉమా వ్యాఖ్యలు, ఆ తర్వాత డిప్యూటీ సీఎం పవన్‌తో పీసీబీ ఛైర్మన్ కృష్ణయ్య, పీసీబీ అధికారుల చర్చలు, క్రెబ్స్ ఇండస్ట్రీస్ వ్యవహారంలో ఎమ్మెల్యే జోక్యం.. ఈ మొత్తం అంశాలపై ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఆరా తీసింది. సీఎంవో అధికారులు పీసీబీ నుంచి వివరాలు తీసుకుని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. పీసీబీ ఛైర్మన్ కూడా అన్ని వివరాలనూ సీఎంవోకు అందజేశారు.

భయపెట్టడం కాదు!

కాలుష్య సమస్యకు పరిష్కారం కావాలి

- నిబంధనలు కఠినంగా అమలు చేస్తే ఎన్ని పరిశ్రమలు మూతబడతాయో!
- ప్లాస్టిక్‌కు బదులు బయో-డీగ్రేడబుల్ వినియోగం పెంచాలి
- కాలుష్యంపై అసెంబ్లీలో రోజంతా చర్చించాలి: పవన్

అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రాక్టికల్‌గా చూస్తే కాలుష్యం లేకుండా ఒక్క పరిశ్రమ కూడా లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. నిబంధనలను గట్టిగా అమలు చేస్తే అవి మూతబడిపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. వాటితో చర్చించి కాలుష్య నియంత్రణ చేసేలా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. శుక్రవారం కాలుష్య నియంత్రణపై శాసనసభ వేదికగా టీడీపీ విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేసిన ఆరోపణలకు పవన్ ఘాటుగా, సుదీర్ఘంగా సమాధానమిచ్చారు. "రాంకీ యాజమాన్యానికి ఇప్పటికే షోకాజ్ నోటీసు జారీ చేసి చర్యలు తీసుకున్నాం.. ఇదొక్కటే కాదు.. ఇలాంటి పరిశ్రమలు వందల్లో ఉన్నాయి. ఒక పరిశ్రమను టార్గెట్ చేసుకుని ఉద్దేశపూర్వకంగా చర్యలు చేపడితే గత ప్రభుత్వంలో మాదిరిగానే ఉంటుంది. ముఖ్యమంత్రి ఉద్దేశం కూడా అది కాదు. రూ.వేల కోట్ల ఆదాయాన్ని సమకూర్చిపెడుతున్న ఆక్వా రంగం నుంచి ఎంత కాలుష్యం వస్తుందో అందరికీ తెలుసు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని పారిశ్రామికవేత్తలను భయపెట్టడమా.. లేక వారిని కూర్చోబెట్టి కాలుష్యం వల్ల వాటిల్లుతున్న అనర్థాలను వివరించి.. వారితోనే కాలుష్య నియంత్రణ చేయించడమా అనేది ఆలోచించాలి' అని చెప్పారు.

తల్లిపాలూ కలుషితమవుతున్నాయ్!

ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు చిరిగిపోయి భూమి, నీరు, గాలిలో కలిసిపోవడం వల్ల.. పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ఎంత ప్రమాదం వాటిల్లుతుందో కూడా అందరికీ తెలుసని పవన్ అన్నారు. 'చివరకు తల్లి పాలు కూడా కలుషితమైపోతున్న పరిస్థితి. అలాగని ఫ్లెక్సీలను పూర్తిగా నిషేధిద్దామంటే.. వాటి తయారీపై ఆధారపడి జీవిస్తున్న వేల కుటుంబాలు రోడ్డున పడిపోతాయి. ప్లాస్టిక్‌కు బదులు బయో-డీగ్రేడబుల్ మెటీరియల్ వినియోగంపై వారికి అవగాహన కల్పించడం ద్వారా మార్పు తీసుకురావాలి. ఇలా చిన్నపాటి ఫ్లెక్సీల విషయంలోనే ఇంతగా ఆలోచించాల్సి వస్తుంటే.. ఇక విస్తృత స్థాయిలో ఉన్న పరిశ్రమలపై కాలుష్య నియంత్రణ నిబంధనలను కఠినంగా అమలు చేస్తే జరిగే పరిణామాలను ఊహించండి. ప్రాక్టికల్‌గా చూస్తే కాలుష్యం లేకుండా ఒక్క పరిశ్రమ కూడా లేదు. వాటన్నింటిపై నిబంధనలను కఠినంగా అమలు చేస్తే ఎలాంటి పరిణామాలు ఉత్పన్నమవుతాయనే భయం నాకే కాదు.. ముఖ్యమంత్రికి కూడా ఉంది. దీనిపై విస్తృత స్థాయిలో చర్చ జరగాలి. అత్యంత ప్రమాదకరమైన ఈ అంశంపై శాసనసభలో ఒక రోజంతా ప్రత్యేకంగా చర్చించాలి. ప్రజలు బాధ్యతారహితంగా ప్లాస్టిక్ వస్తువుల్లో ఇలా తినేసి.. అలా పారేస్తున్నారు. వాటిని నేను, ముఖ్యమంత్రి వచ్చి తీయలేం కదా! ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ప్రజల దైనందిన జీవితంలో అంతర్భాగమైపోయింది. రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పర్యావరణాన్ని పరిరక్షించడానికి అవసరమైన నిధులు కూడా మనకు అందుబాటులో లేవు. కాబట్టి ప్రజల్లోనే మార్పు తీసుకురావాలి' అని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు తీసుకుందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ నిబద్ధతను చాటేందుకు రాష్ట్ర సచివాలయం మొత్తాన్ని ప్లాస్టిక్ రహిత జోన్‌గా ప్రకటించామని గుర్తుచేశారు. సభాధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ.. బ్రాందీ అమ్మకాలకు కూడా ప్లాస్టిక్ సీసాలను వినియోగిస్తున్నారని, వాటిని వృథాగా పారేయకుండా తిరిగి ఇస్తే 10 రూపాయలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విధానం కేరళ రాష్ట్రంలో అమలు చేస్తున్నారని చెప్పారు. ఫ్లెక్సీలకు బదులుగా డిజిటల్ బోర్డులను ప్రోత్సహిస్తే బాగుంటుందని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని జనసైనికులకు మీరు (పవన్ కల్యాణ్) పిలుపునిస్తే చాలావరకు కట్టడి చేస్తారని నవ్వుతూ అన్నారు. కాకినాడ అర్బన్ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు కూడా ఈ అంశంపై మాట్లాడారు.

మండలిలో హోరా హోరీ

వైద్య కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా తెచ్చిందే జగన్!.. మండలిలో నిలదీసిన టీడీపీ

మెడికల్ కాలేజీల అంశంపై వైసీపీ సభ్యుల రగడ

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలల ఏర్పాటు అంశంపై శుక్రవారం శాసనమండలిలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం జరిగింది. టీడీపీ, వైసీపీ సభ్యులు ఛైర్మన్ పోడియం వద్ద పోటాపోటీగా నినాదాలు చేశారు. సభ ప్రారంభం కాగానే వైద్య కళాశాలల అంశంపై చర్చించాలంటూ వైసీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆ తీర్మానాన్ని ఛైర్మన్ మోషేన్‌రాజు తిరస్కరించారు. దీంతో వైసీపీ సభ్యులు వెల్‌లోకి వెళ్లి ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. పీపీపీ రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. వారి ఆందోళనల మధ్యనే ప్రశ్నోత్తరాలు కొనసాగాయి. వైసీపీ సభ్యుల ఆందోళనతో సభ రెండుసార్లు వాయిదా పడింది. తర్వాత జరిగిన బీఏసీ సమావేశంలో వైద్య కళాశాలలపై స్వల్పకాలిక చర్చకు నిర్ణయం తీసుకున్నారు. తిరిగి 12.38 గంటలకు సభ ప్రారంభమయ్యాక కూడా వైసీపీ సభ్యులు ఛైర్మన్ పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. దీంతో టీడీపీ సభ్యులు కూడా పోడియం వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా తెచ్చింది నువ్వు కాదా జగన్? అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. బాపట్లలో పునాదుల దశలోనే వదిలేసిన మెడికల్ కళాశాల ఫొటోలను, అసంపూర్తిగా నిర్మించిన కళాశాల భవనాల ఫొటోలను ప్రదర్శించారు. ఈ పరిస్థితుల్లో ప్రశ్నోత్తరాలు పూర్తయినట్టు ప్రకటించిన ఛైర్మన్.. జీఎస్టీ సంస్కరణల అంశంపై ప్రకటన చేయాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. దీంతో టీడీపీ సభ్యులు తమ స్థానాల్లోకి వెళ్లి కూర్చోగా వైసీపీ సభ్యులు ఆందోళన కొనసాగించారు. మెడికల్ కళాశాలలపై స్వల్పకాలిక చర్చ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పయ్యావుల ప్రకటించి, సభను ఆర్డర్‌లో పెట్టాలని ఛైర్మన్‌ను కోరారు. కాలేజీల అంశంపై వెంటనే చర్చ చేపట్టాలని విపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. వైసీపీ సభ్యులు ఆందోళన కొనసాగించడంతో ఛైర్మన్ సభను సోమవారానికి వాయిదా వేశారు. కాగా, గందరగోళం సమయంలోనే కారుణ్య నియామకాలపై ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిచ్చారు. కారుణ్య నియామకాలకు 3,441 మంది దరఖాస్తు చేసుకోగా, 2,569 మంది నియమితులయ్యారని తెలిపారు. ఉపాధ్యాయుల కారుణ్య నియామకాలను సాధారణ కోటాలోకి చేర్చే ప్రతిపాదన లేదని చెప్పారు. పలు ప్రశ్నలకు మంత్రులు నిమ్మల, నారాయణ సమాధానం ఇస్తుండగా.. వైసీపీ సభ్యుల నినాదాలతో గందరగోళం ఏర్పడింది.



మండలిలో బొత్స, పయ్యావుల వాగ్వాదం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టీడీపీ సభ్యులు

పన్ను వేసి.. చెత్త తొలగించలేదు: నారాయణ

గత ప్రభుత్వం చెత్తపై పన్ను వసూలు చేసినా.. 85 లక్షల టన్నుల చెత్తను తొలగించకుండా వదిలేసిందని మున్సిపల్ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో పురపాలక సంఘాల్లో పారిశుధ్య వ్యవస్థపై సభ్యులడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఇప్పటి వరకు 84 లక్షల టన్నుల చెత్తను తొలగించామని చెప్పారు.

నీటి ప్రాజెక్టుల నిర్వహణను ప్రైవేట్‌కు ఇవ్వం: నిమ్మల

సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే ప్రతిపాదనేమీ లేదని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం, ఇళ్ల స్థలాలు, సాగునీటి ప్రాజెక్టు నిర్వహణ వంటి అంశాలపై సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రాజెక్టు నిర్వహణకు 1,517 మంది లస్కర్లు, 1,456 మంది సాంకేతిక సిబ్బంది ఉన్నారని, కొత్త సిబ్బందిని నియమించే ప్రతిపాదన లేదని, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తున్నారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా 373 నివాస ప్రాంతాల్లోని 96,660 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉందని అంచనా వేసినట్లు తెలిపారు.

గ్రీన్ ట్యాక్స్ తగ్గింపు

12 ఏళ్లు పైబడిన లారీలకు వర్తింపు

- ఎన్నికల హామీ నెరవేర్చిన సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాహనదారులకు శుభవార్త. పాత వాహనాలకు గ్రీన్‌ట్యాక్స్‌ను తగ్గించాలంటూ సవరించిన వాహన పన్ను విధింపు బిల్లును శుక్రవారం అసెంబ్లీ ఆమోదించింది. ఈ బిల్లును రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీనిప్రకారం 12 ఏళ్ల పైబడిన లారీలకు గ్రీన్ ట్యాక్స్ తగ్గుతుంది. 10 టన్నుల లారీపై పన్ను రూ.5,000 ఉండగా, దాన్ని రూ.1500కి తగ్గించారు. అలాగే 30 టన్నుల లారీలపై పన్నును రూ.15,000 నుంచి రూ.3,000కి తగ్గించారు. వాహనాలపై వైసీపీ ప్రభుత్వం పెంచిన గ్రీన్‌ట్యాక్స్‌ను తగ్గిస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నేరవేర్చారు. గత ప్రభుత్వం పర్యావరణం పేరుతో పాత వాహనాలపై ఎక్కువ పన్ను వేసిందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అసెంబ్లీలో విమర్శించారు. 2018-19లో గ్రీన్‌ట్యాక్స్ రూ.5 కోట్లు వసూలు కాగా, వైసీపీ హయాంలో రూ.100 కోట్లు వసూలు చేశారని విమర్శించారు. పారిశ్రామిక వివాదాల సవరణ బిల్లు 2019 ఉపసంహరణ బిల్లును, లేబర్ కాంపౌండింగ్ ఆఫ్ అఫెన్సెస్ బిల్లు 2019 ఉపసంహరణ బిల్లును ఆమోదం కోసం కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.

భీమిలిలో మహిళా పారిశ్రామిక పార్కు: టీజీ భరత్

భీమిలి నియోజకవర్గంలో మహిళలకు ఉపాధి కల్పించడం కోసం పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేసే ప్రతిపాదనను పరిశీలిస్తామని మంత్రి టీజీ భరత్ చెప్పారు. ప్రస్తుతం ఎలీప్ అనే సంస్థ రాష్ట్రంలో మహిళల కోసం కుప్పం, ఓర్వకల్లు, మరో ప్రాంతంలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తోందని తెలిపారు. కుదిరితే భీమిలిలో కూడా ఎలీప్ సహకారంతో పార్కు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పార్కు ఏర్పాటు కోసం ఎలీప్‌కు 50 ఎకరాలు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదన వెనక్కి పోయిందని, తమ ప్రాంతంలో పార్కు ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పించాలని కోరారు.

అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణ

చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ భేటీ

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించడంతోపాటు 'నాలా' ఫీజును రద్దు చేస్తూ రూపొందించిన బిల్లులకు మంత్రి మండలి పచ్చజెండా ఊపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం క్యాబినెట్ భేటీ అయింది. సభలో ప్రవేశపెట్టే వివిధ బిల్లులకు మంత్రులు ఆమోదం తెలిపారు. 13 అజెండా అంశాలపై జరిగిన ఈ భేటీ కేవలం 25 నిమిషాల్లో ముగిసింది. అనధికార భవనాల క్రమబద్ధీకరణ ముసాయిదా బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ఏడాది ఆగస్టు 31 వరకు కట్టిన అనధికార భవనాలకు ఈ స్కీం వర్తిస్తుంది. నాలా ఫీజు రద్దుకు సంబంధించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో వివిధ చట్టాలను సవరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. 'వైఎస్సార్ తాడిగడప' మున్సిపాలిటీని.. తాడిగడప మున్సిపాలిటీగా మార్చే ముసాయిదా బిల్లుకు ఆమోదంతెలిపారు. ఏపీ జీఎస్టీ బిల్లు-2025లో సవరణల ముసాయిదా బిల్లుకు పచ్చజెండా ఊపారు.

ఇవీ సవరణలు: 1) ఆక్వారైతులకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్. 2) ముగ్గురు అధికారులకే అనుమతి అధికారం. 3) ఆక్వా లైసెన్సులకు నిర్ణీత తేదీ నుంచి 4నెలలలోపు నమోదుకు అవకాశం. 4) ఇప్పటికే లీజు ఉన్న వాటికి ఆటోమేటిక్‌గా నమోదు చేసే చాన్స్. 5) చట్టంలోని 'నియంత్రణలోకి' అనే పదాన్ని 'నియంత్రించు'గా మార్పు. 6) సముద్ర ఆహారం నిర్వచనం మార్పు. 7) యాంటీబయోటిక్స్ అవశేషాలు లేని ఆక్వా ఉత్పత్తులతో ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించడం. 8) ఏదైనా సంక్షోభం వచ్చినప్పుడు అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా విలువను నిర్ణయం. 9) ఆక్వా యూనిట్లకు ఆడిట్ నిబంధన తొలగింపు. 10) అప్పడాలో ముగ్గురు ఆక్వా బిజినెస్ ఆపరేటర్లు ఉండలా మార్పు. 11) మత్స్య శాస్త్రాన్ని పశువైద్య విశ్వవిద్యాలయ నియంత్రణ నుంచి మత్స్యవర్సిటీ నియంత్రణలోకి తెస్తారు.



క్యాబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, సీఎస్ విజయానంద్, మంత్రులు

'ఆక్వా' సవరణ బిల్లు కూడా..

ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం-2020లో కొన్ని సవరణలు తీసుకురావాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. గత ప్రభుత్వం తెచ్చిన చట్టం సానుకూలంగా లేదని రైతులు, ఎగుమతిదారులు, వాటాదారులు అభిప్రాయపడుతున్నారు. ఈ చట్టాన్ని సవరించి బిల్లు రూపొందించారు. దీనికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

పంచాయతీల ప్రక్షాళన

- లోపభూయిష్ఠ విధానాలకు చెల్లుచీటీ
- ఐదు దశాబ్దాల సిబ్బంది నమూనాలో మార్పులు
- జనాభా, ప్రాంతం, ఆదాయ ప్రాతిపదికన గ్రేడ్లు
- క్లస్టర్ విధానం రద్దు.. గ్రేడ్ల వారీగా సెక్రటరీలు
- సిబ్బంది సర్దుబాటుతో ఉత్తమ ఫలితాలు రాబట్టాలి
- పంచాయతీల్లో పట్టణ స్థాయి ప్రగతి సాధించాలి
- అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ దిశానిర్దేశం

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పంచాయతీల ప్రగతికి అవరోధాలుగా ఉన్న లోపభూయిష్ఠ పరిపాలన, విధానాలను ప్రక్షాళన చేయాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. 48 ఏళ్ల నాటి సిబ్బంది నమూనాయే ఇప్పటికీ అమల్లో ఉందని, ఈ విధానాల్లో సమూల మార్పులు తీసుకొచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించాల్సిన బాధ్యత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖపై ఉందని చెప్పారు. పంచాయతీల్లోనూ పట్టణ స్థాయి ప్రగతి సాధించాలన్నారు. శుక్రవారం అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సాధారణ పరిపాలన, ఆర్థిక, న్యాయశాఖల ఉన్నతాధికారులతో పంచాయతీల పునర్వ్యవస్థీకరణ, నూతన సంస్కరణల అమలుపై సమీక్ష చేశారు. ప్రస్తుతం పంచాయతీల్లో అమలు చేస్తున్న విధానాలు, వాటిలో లోపాలు, చేయాల్సిన మార్పులు చేర్పులపై అధికారులు వివరించారు. నూతనంగా అమలు చేయనున్న ప్రణాళికలపై పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. గ్రేడ్ల నిర్ణయానికి ఆదాయమే ప్రాతిపదిక కాదన్నారు. గతంలో ఆదాయాన్ని ఆధారంగా చేసుకుని పంచాయతీలకు గ్రేడ్లు నిర్ణయించేవారని, ప్రస్తుతం జనాభా, మండల కేంద్రం, గిరిజన, గిరిజనేతర ప్రాంతం, ఆదాయ అంశాలను విశ్లేషించుకుని నాలుగు గ్రేడ్లుగా విభజించనున్నామని చెప్పారు. ప్రస్తుత క్లస్టర్ విధానంలో రెండు మూడు గ్రామ పంచాయతీల బాధ్యతలను ఒక కార్యదర్శి నిర్వహిస్తున్నారని, నూతన విధానంలో ప్రతి పంచాయతీకి గ్రేడ్ల వారీగా సెక్రటరీలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సిబ్బందిని సర్దుబాటు చేసుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. త్వరలో క్యాబినెట్ ముందుకు ఈ నిర్ణయాలు తీసుకెళతామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 15వ ఆర్థిక సంఘం నిధులు ఎప్పటికప్పుడు పంచాయతీ ఖాతాల్లో వేశామని వెల్లడించారు. ఏళ్లుగా పదోన్నతుల వ్యవహారం పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగ సంఘాల విజ్ఞప్తులను మన్నించి 10 వేలకు మందికి పైగా ఉద్యోగులకు ఒకేసారి పదోన్నతులు కల్పించేందుకు మార్గం సుగమం చేశామన్నారు.


డిప్యూటీ సీఎం పవన్‌తో శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టె సాయిప్రసాద్

సర్పంచ్‌ల గౌరవం నిలబెట్టేలా..: మంత్రిగా పవన్ బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచి పంచాయతీల్లో వెలుగులు నింపేలా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో కోల్పోయిన సర్పంచుల గౌరవం నిలబెట్టేలా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల నిర్వహణకు ఇచ్చే మొత్తాన్ని గణనీయంగా పెంచామని చెప్పారు. మైనర్ పంచాయతీలకు ఇచ్చే మొత్తాన్ని రూ. 100 నుంచి రూ. 10 వేలకు, మేజర్ పంచాయతీలకు రూ. 250 నుంచి రూ. 25 వేలకు పెంచినట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి రికార్డు సృష్టించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఆర్థిక శాఖ కార్యదర్శి వినయ్‌చంద్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ, న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి, ఓఎస్‌డీ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకను వీడి విశాఖకు మిట్టల్

- స్టీల్, ఐరన్ ఓర్‌లో దిగ్గజ పరిశ్రమ
- కూటమి ప్రభుత్వ ప్రోత్సాహంపై దృష్టి

బళ్లారి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్టీల్ తయారీ, ఐరన్ ఓర్ తవ్వకాల్లో దిగ్గజ సంస్థ మిట్టల్ కంపెనీ కర్ణాటకను వీడి విశాఖకు వస్తున్నట్టు ప్రకటించింది. కర్ణాటక ప్రభుత్వం ఏమాత్రం తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, ఇదేసమయంలో ఏపీలోని కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ పరుస్తున్న నేపథ్యంలో రాష్ట్రాన్ని వీడాలని నిర్ణయించుకున్నట్టు పేర్కొంది. వాస్తవానికి కర్ణాటకలోని బళ్లారి జిల్లాలో ఉన్న కుడితిని సమీపంలో పరిశ్రమల స్థాపనకు గత ప్రభుత్వం 2010లో 12,500 ఎకరాల భూమిని రిజర్వు చేసింది. బీఎస్ యడియూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేఐఏడీబీ ద్వారా ఈ భూములను సేకరించి, పరిశ్రమలకు కేటాయించారు. దీనిలో మిట్టల్ కంపెనీ 2,643 ఎకరాలను కొనుగోలు చేసింది. కుడితిని, వేణివీరాపురం, హరగినధోని, కొలగల్లు, రారంగవి, జానకుంట, సిద్ధమనహళ్లి తదితర గ్రామాల పరిధిలో ఈ భూములు ఉన్నాయి. సేకరించిన 12,500 ఎకరాలలో 4,800 ఎకరాలను ఉత్తమ్ గాల్వా, 2,850 ఎకరాలను ఎన్ఎండీసీ, 2,643 ఎకరాలను మిట్టల్ కంపెనీకి కేటాయించారు. ఆ తర్వాత ఇక్కడ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం లభించలేదు. ఫలితంగా ఆయా భూముల్లో ఇంత వరకూ ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు. ఈ నేపథ్యంలో బళ్లారి జిల్లా కుడితిని వద్ద స్టీల్ ఫ్యాక్టరీ నెలకొల్పాలనే ఆలోచనను మిట్టల్ కంపెనీ విరమించుకుంది. ఇదేసమయంలో ఏపీలోని కూటమి ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు ఇస్తున్న ప్రోత్సాహాలను గుర్తించి.. విశాఖపట్టణంలో కంపెనీ నెలకొల్పేందుకు సిద్ధమైంది. ఈ విషయాన్ని రెండు రోజుల కిందటే ప్రకటించింది. ఏపీ సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో మిట్టల్ కంపెనీ విశాఖపై దృష్టి పెట్టింది.

22 నుంచే దసరా సెలవులు: లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు దసరా సెలవులు ఈనెల 22 నుంచి ఇవ్వనున్నట్లు మంత్రి లోకేశ్ వెల్లడించారు. సెలవులపై ఉపాధ్యాయుల విజ్ఞప్తులను టీడీపీ పట్టభద్ర ఎమ్మెల్సీలు తన దృష్టికి తీసుకొచ్చారని, దీనిపై విద్యాశాఖ అధికారులతో చర్చించాక ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అక్టోబరు 2 వరకు దసరా సెలవులు ఉంటాయన్నారు. విద్యా క్యాలండర్ ప్రకారం ఈనెల 24 నుంచి దసరా సెలవులు ఇవ్వాల్సి ఉంది. కానీ 22 నుంచే శరన్నవరాత్రులు ప్రారంభమవుతున్నందున ఆ రోజు నుంచే సెలవులు ప్రారంభించాలని టీచర్లు కోరుతూ వచ్చిన నేపథ్యంలోనే తాజా నిర్ణయం తీసుకున్నారు.

ఓజీ టికెట్ ధరల పెంపునకు అనుమతి

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన ఓజీ సినిమా టికెట్ ధరల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. సెప్టెంబరు 25న విడుదల కాబోతున్న ఈ భారీ బడ్జెట్ సినిమాకు రెండు వారాల పాటు టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి కోరుతూ నిర్మాత డీవీవీ దానయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పరిశీలించిన ప్రభుత్వం పది రోజుల పాటు(అక్టోబరు 4వరకూ) అనుమతిచ్చింది. మొదటి రోజు బెనిఫిట్ షో టికెట్ రూ.1,000కి విక్రయించుకోవచ్చని తెలిపింది. రాష్ట్రంలోని అన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.125, మల్టీప్లెక్స్‌లలో రూ.150కు పెంచుకోవచ్చని ఏపీ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏపీపీ అభ్యర్థులు 22 వరకూ దరఖాస్తు సవరించుకోవచ్చు

అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామక ప్రక్రియలో ఆన్‌లైన్ దరఖాస్తుల్లో పొరపాట్లు చేసిన అభ్యర్థులకు రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు(ఎస్ఎల్‌పీఆర్‌బీ) మరో అవకాశం కల్పించింది. ఏపీపీల నియామకానికి ఆగస్టు 11 నుంచి సెప్టెంబరు 7 వరకూ వచ్చిన దరఖాస్తులు పరిశీలించిన బోర్డు అందులో పొరపాట్లు గుర్తించింది. తగిన ధృవీకరణ పత్రాలు అప్‌లోడ్ చేసి అభ్యర్థులు పొరపాట్లు సరిచేసుకోవచ్చని నియామక మండలి ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ ఎస్ఎల్‌పీఆర్‌బీ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ దరఖాస్తు సవరించుకోవచ్చని లేదా తమకు మెయిల్ పంపవచ్చని సూచించింది.

సమాచార శాఖ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ప్రఖర్ జైన్

సమాచార శాఖ డైరెక్టర్‌గా ప్రఖర్ జైన్‌కు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు సీఎస్ కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. కాగా, ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ ఎండీగా ఐఎఫ్ఎస్ అధికారిణి ఎస్.భరణి బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఉదయం శాప్ కార్యాలయానికి వచ్చిన ఆమె అధికారుల సమక్షంలో ఎండీగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం శాప్ చైర్మన్ రవినాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు.



మార్కెట్‌కు వెళ్లే దారీ లేదు!

కర్నూలు జిల్లా కోసిగి గ్రామానికి చెందిన ఈ రైతు పేరు హనుమప్ప. ఎకరాకు లక్షకు పైగా పెట్టుబడితో 12 ఎకరాల్లో ఉల్లి సాగుచేశారు. ఇప్పుడు క్వింటా రూ.50-100 కూడా పలకట్లేదు. మార్క్‌ఫెడ్ కేంద్రానికి తీసుకెళ్తే ప్రభుత్వ మద్దతు ధర రూ.1,200 చొప్పునైనా వస్తుంది. అయితే, ఉల్లి కోత కూలీ, రవాణా, హమాలీ కలిపి ఎకరాకు రూ.25-30 వేలు ఖర్చు ఎలా భరించాలో తెలీడంలేదు. ఈ బాధలు ఎందుకని.. గత్యంతరం లేక ఇలా పొలంలోనే పంటను వదిలేశామని ఆ రైతు ఏకరువు పెట్టాడు.



కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి దిగుబడులు, యార్డు బయట రోడ్డుపై బారులు తీరిన ఉల్లిలోడు వాహనాలు

- కర్నూలు నగరం బయటే ఉల్లి వాహనాలు!
- కొనసాగుతున్న ఉల్లి రైతుల అవస్థలు

కర్నూలు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఉల్లి రైతుల కన్నీళ్లు ఆగడంలేదు. గిట్టుబాటు ధర లేక నిండా మునిగిన రైతుకు ఇప్పుడు కూలి, రవాణా ఖర్చులు కూడా పెనుభారంగా మారాయి. ఉల్లి పంట కోసి మార్కెట్‌కు తరలిద్దామంటే.. గిట్టుబాటు కావడం లేదంటూ కొందరు పొలంలోనే వదిలేస్తున్నారు. మరికొందరు.. ప్రభుత్వం మద్దతు ధర క్వింటా రూ.1,200 అయినా చేతికొస్తుందనే ఆశతో పంటను కర్నూలు మార్కెట్‌కు తీసుకెళ్తుంటే అక్కడ నిల్వ చేసేందుకు చోటు లేదు. ఏపీ మార్క్‌ఫెడ్ కొన్న ఉల్లి నిల్వలు పేరుకుపోవడంతో ఉల్లిలోడ్‌తో వచ్చిన వాహనాలను మార్కెట్‌లోకి అనుమతించడం లేదు. పోలీసులు ఉల్లి లోడ్ వాహనాలను నగరంలోకి అనుమతించలేదు. కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు రహదారిలో ఆపేశారు. ముందుగా వెళ్తే ఉల్లి దించుకోవడానికి ప్లాట్‌ఫాం దొరుకుతుందనే ఆశతో ఉదయం 11 గంటలకే రైతులు వచ్చారు. అయితే మార్కెట్‌లో స్థలం లేదంటూ బయటే ఆపేశారు. ఏ క్షణంలో అనుమతిస్తారో? అంటూ రైతులు, వాహన డ్రైవర్లు రోడ్డుపైనే గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. దగ్గరలో హోటళ్ల కూడా లేక భోజనాలు చేయలేని పరిస్థితి. ఈ విషయాన్ని మార్కెట్ యార్డు స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన 1,800 మెట్రిక్ టన్నుల ఉల్లితో మార్కెట్ నిండిపోయిందన్నారు. రాత్రి 10 గంటల తరువాత ఉల్లి వాహనాలను మార్కెట్‌లోకి అనుమతిస్తామని చెప్పారు.

రోడ్డుపై నరకం చూస్తున్నాం

రెండెకరాల్లో ఉల్లి సాగు చేస్తే 276 బస్తాలు దిగుబడి వచ్చింది. ప్రభుత్వం రూ.1,200లకు కొనుగోలు చేస్తుండడంతో కొంతైనా ఖర్చులకు వస్తుందని తీసుకొస్తే, మార్కెట్‌లో దించేందుకు స్థలం లేదని పెద్దపాడు రోడ్డుపైనే ఆపేశారు. ఎప్పుడు అనుమతిస్తారో తెలియక రోడ్డుపైనే నిరీక్షించక తప్పలేదు. భోజనం కూడా దొరకలేదు.

\- మల్లికార్జున, ఉల్లి రైతు, తిమ్మందొడ్డి, సి.బెళగల్ మండలం, కర్నూలు జిల్లా

హెక్టారుకు రూ.50 వేల సాయం

- కష్టాల్లో ఉన్న ఉల్లి రైతుకు కూటమి ప్రభుత్వం వరం
- సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ ఏడాది ధర పతనమై.. నష్టపోతున్న ఉల్లి రైతులకు సాయం చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఉల్లి పండించిన ప్రతి రైతుకూ హెక్టారుకు రూ.50వేల చొప్పున నగదు సాయం అందించాలని నిర్ణయించారు. దీంతో 24,218 మందికి లబ్ధి చేకూరనుంది. దీనివల్ల ప్రభుత్వంపై రూ.100 కోట్ల అదనపు భారం పడనుంది. ఈ విషయాన్ని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం రాత్రి సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద మీడియాకు వెల్లడించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 45,278 ఎకరాల్లో ఉల్లి సాగైంది. ధర పతనంతో క్వింటా రూ.600మించి పలకలేదు. దీంతో క్వింటా రూ.1,200 చొప్పున సుమారు లక్షా 39 వేల క్వింటాళ్ల ఉల్లిని మార్కెట్ జోక్యం ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. కర్నూలు మార్కెట్ యార్డుకు రైతులు తెచ్చిన ఉల్లిని దాదాపు సేకరించింది. కొంత రైతుబజార్లకు, మరికొంత వ్యాపారులకు తరలించి విక్రయించింది. అయితే ఇంకా రైతుల వద్ద కొంత ఉల్లి ఉంది. గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోయినందున ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని, ఉల్లి సాగు చేసిన రైతులందరికీ హెక్టారుకు రూ.50వేల చొప్పున ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినట్లు అచ్చెన్నాయుడు చెప్పారు. ఇంకా మిగిలి ఉన్న ఉల్లిని మంచి ధర పలికినప్పుడే అమ్ముకోవాలని, ధర లభించే వరకు రైతులు ఓపిక పట్టాలని మంత్రి సూచించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.